# చూచి నేర్చుకో



రచన: పెసల సుబ్బరామయ్య

సర్వస్వామ్యములు : శ్రీ సాయి మాష్టర్ సేవాట్రస్ట్ వారివి

ప్రతులు : 2,000

ప్రథమ ముద్రణ : ఆగష్ట్ 2007

వెల :

కాపీల కొరకు : శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి (PO)
నెల్లూరు జిల్లా 524 321

Please visit : www.saimastersevatrust.org

# ప్రార్థన

**గురుమధ్యేస్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురుః**
**గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మై శ్రీ గురవే నమః**

శ్రీగురునియందు ఈ విశాల విశ్వం ఇమిడియున్నది. ఈ విశాల విశ్వమంతా శ్రీగురుడే వున్నాడు. శ్రీగురునకు అన్యముగా ఏదియు లేదు. అట్టి గురుదేవునకు నమస్కారము.

పెసల సుబ్బరామయ్య.

# ముందు మాట

బోధనాదక్షతలో శ్రీస్వామివారికి సాటి ఎవ్వరూలేరు. మతప్రమేయం లేకుండా ప్రపంచంలోని అన్ని మతాలవారికి సరిపోయే పంచశీల సూత్రాన్ని ఇతరమాటలేవీ కలవకుండా నెలల తరబడి రాత్రింబవళ్ళు నిద్రాహారాలు లేకుండా బోధించిన వారు శ్రీస్వామివారు తప్ప మరొక మహనీయులెవరైనా ఉన్నారేమోగానీ నా దృష్టికి రాలేదు.



# పంచశీల సూత్రము

## సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ

**సత్యం:-** ఈమాటకు రెండర్థాలున్నాయి. సత్యవాక్ పరిపాలన ఒక అర్థం. రెండవ అర్థం- మాయామయ జగత్తునకు విశ్వ చైతన్యమనే ఒకే సత్యం ఆధారము. ఈ సత్యాన్నే సర్వకాల సర్వావస్థలయందు గుర్తుపెట్టుకొని రాగద్వేషాలు, ఇష్టము అయిష్టము లేకుండా జీవితయాత్ర సాగించు అనేది మరొక అర్థం.

**ధర్మం:-** ధర్మనిరతి అనే హెడ్డింగులో చర్చించాము.

**సంపన్నత్వము:-** దైవీసంపద లక్షణాలు ఆచరణలోకి వచ్చే తీవ్రప్రయత్నంచేసి తనలాగా ఆగుణాలు స్వతసిద్ధం చేసుకోమంటున్నారు.

**సాధారణత్వం:-** పై గుణాలు నాకున్నాయి అనే అహంకారము లేకుండా నాలాగా గోప్యంగా ఉండు అంటున్నారు.

**సద్గురు సేవ:-** గురువు భౌతికంగా మన ఎదుట లేనప్పుడు వారి ప్రతిరూపమైన అగ్నిని ఏమారకుండా తనతో ఉంచుకోవడం. కపిలమోకు ముక్కలకు నిప్పంటించి ఒక్క క్షణం ఏమారకుండా ఎక్కడికి వెళ్ళినా తనతో తీసుక వెళ్ళేవారు. అలా తీసుకవెళ్ళేందుకు ఎన్ని శ్రమలు పడ్డారో ఆలోచించినకొద్దీ మన గుండె చెరువౌతుంది. అంత శ్రద్ధగా మనలనుకూడా విశ్వగురుని నిరంతరం గుర్తుంచుకొని జీవితయాత్ర సాగించమన్నారు. అందరిలోని నీ గురువును గుర్తించి వారి కష్టాలను నీ కష్టాలుగా భావించి నా(స్వామి) వలె వారికి సహాయం చేయమంటున్నారు.

# అలా సద్గురుని సేవించాలంటే

**<u>వైరాగ్యము</u>** నన్ను (స్వామిని) చూచి నేర్చుకోమంటున్నారు.

**<u>ఇంద్రియ చాపల్యము జయించమన్నారు</u>:-** ఆకలికి లడ్డు పెట్టినా తింటారు కానీ పచ్చడి, మిరపొడి కలిపి దాని రుచిని చంపి తింటారు.

**<u>మమకార రాహిత్యము</u> :-** తన భాద్యత తప్ప ఎవరి ఎడల మమకారంలేదు. ఎవరు బాధలో ఉన్నా సహాయం చేయడం తప్ప మన వాళ్ళు ఇలా బాధపడుతున్నారే అనే బాధ ఎరుగరు.

**<u>సాధన యందు శ్రద్ధ కాదు కేవల శ్రద్ధ</u>:-** మీరు కూడా కేవల శ్రద్ధతో సాధనచేసి విశ్వగురుని మెప్పించండి అని బోధించారు. మనకొరకే వారు సాధన చేశారు. రోజంతటిలో రెండు విషయాలకే ప్రాధాన్యతనిచ్చారు. రాత్రంతా అగ్నిహోత్రానికి కట్టెలు ఉన్నాయా? అని అడగడం ఒకటి. రెండవది రాత్రి ఎనిమిది గం॥ అయితే భజన వాళ్ళింకా రాలేదేమయ్యా అని అడగడం. ఈ కేవల శ్రద్ధను చూచి నేర్చకోమన్నారు.

ఈ గ్రంథమంతా వారి బోధలే. వ్రాయడం నాలాంటి ఇంద్రియలోలునకు అలవికాదు. సాధనా పరంగా సత్‌సంగం చేసుకునే భక్తులను ఎంతో గొప్పగా ఆశీర్వదించారు. కేవల శ్రద్ధగలవారు సత్‌సంగములు చేసుకోమని బోధించారు. ఇవి మాత్రమే కాక ఇంకెన్నో వెల కట్టలేని బోధలు వారి జీవిత విధాన్ననుసరించి మనకు బోధించారు. శ్రీస్వామివారి మాటలు వ్రాసే భాగ్యము గల్గించిన శ్రీస్వామివారికి అందుకు సహకరించిన భక్తులందరికీ శతకోటి వందనాలు.

పెసల సుబ్బరామయ్య



# చూచి నేర్చుకో

"ఎప్పుడూ మౌనంలో ఉంటారు. మాకు మంచీ చెడ్డా చెప్పకుంటే ఎట్లా స్వామి?" అన్న సేవకులతో "చెప్పే దేముందయ్యా? చూచి నేర్చుకోండి" అన్నారు. ఎక్కడో, ఎవరినో చూచి నేర్చుకునేదాని కంటే తన ఆచరణతో మనకు బోధించేందుకే మానవరూపం ధరించిన ఆ మహనీయుని (భగవాన్ శ్రీవెంకయ్యస్వామిని) చూచి నేర్చుకోవడం ఉత్తమం గదా!

వారు బోధించిన బోధలలో **సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ అనే ఐదు సూత్రాలు అతి ముఖ్యం.** సత్యం తెలుసుకోవాలి, అనుభవించాలంటే మిగిలిన నాలుగు అంశాలు చక్కగా, కఠోరనియమపాలనతో (మామూలుగా చేసే నియమపాలన చాలదు) ఆచరించాలని బోధిస్తున్నారు తన ఆచరణతో.

**ధర్మనిరతి**:- అది నాట్లు వేసే సీజను. శ్రీస్వామివారి ప్రయాణానికి బండిదొరకడం కష్టంగా ఉంది. ఎవరో పుణ్యాత్ముడు బండి తీసుకొచ్చాడు. సేవకులు తమ సామానంతా బండికి ఎక్కించారు. శ్రీస్వామివారిని బండికి ఎక్కించాలంటే అంగీకరించక బండిలో సామాను దించేయమంటున్నారు. ఇంతలో కడుపు నొప్పితో బాధపడే బిడ్డనెత్తుకొని ఒక తల్లి వచ్చింది. ఆ బిడ్డ బాధ తొలిగించేందుకు ఆ రోజు అక్కడే ఉండవలసి వచ్చింది. బండి ఆసామికి ఆనాటి గనిపని పోయింది. గనుక 6 రూ॥ ఇచ్చి పంపినంత వరకు శ్రీస్వామివారు అంగీకరించలేదు. పని జరుగకున్నా బండివాని కూలి ఇచ్చి పంపారు. ఎందుకు? అతడు

గనిలో పనిచేసి కూలి సంపాదించుకునేవాడు. ఈరోజు బండి కట్టుకొచ్చాడు గనుక ఆ కూలి శ్రీస్వామివారే ఇచ్చారు. అజ్ఞానులైన శ్రీస్వామివారి సేవకులు మరునాడు వచ్చి శ్రీస్వామివారిని మరొక మజిలీకి తీసుకుపొమ్మన్నారు. మరుసటి రోజు కూడా ఆరు రూపాయలు ఇవ్వకుంటే శ్రీస్వామివారు పప్పుకుంటారా?అదే వారి ధర్మనిరతికి గుర్తు. ఆవిధంగా ధర్మాన్ని ఆచరించాడు గనుకే ఈనాడు అందరికీ దేవుడైనాడు.

ఇదేవిధంగా తన కోసం వచ్చే భక్తులకోసం తన ప్రయాణం ఆపుకోవడం ఎన్నిమార్లో చూచాము. మనకైతే మనపని ముఖ్యం గాని ఇతరుల బాధలు లెక్కచేయము.

తనపై విశ్వాసముంచి తననే నమ్ముకున్న భక్తులు శారీరకంగా బాధలు భరించలేక ఎక్కడో ఉండి ప్రార్థించినా వారి బాధలు తన శరీరం పైకి తీసుకొని ఆ బాధలు తాననుభవించి ఆ భక్తుల బాధలు తొలిగించారు. ఉదా:- శ్రీస్వామివారు ఒక భక్తుని కుష్టువ్యాధి తీసుకొని అనుభవిస్తూ మూలుగుచున్నారు. రోశిరెడ్డి కాళ్ళు వత్తేందుకు శ్రీస్వామివారి పాదాలు పట్టుకున్నారు. "అబ్బో, అబ్బో ఇప్పుడు నన్ను తాకవచ్చా?" అంటూ తన కాళ్ళు లాగేసుకున్నారు. ఆరోజే రోశిరెడ్డిగారికి కుష్టురోగికి లాగా పాదం వాచి పగిలింది. ఇదేవిధంగా ఎన్నిమార్లు భక్తుల బాధలు తాను అనుభవించారో చెప్పలేము. జిలకు గీరిగీరి పెంచలమ్మ శరీరమంతా పుండ్లు పడ్డాయి. అలాంటి జిలను తన శరీరం మీదకు తీసుకొని శ్రీస్వామివారు తన శరీరమంతా దువ్వెనతో గీరించుకున్నారు. పరోపకారమైన ధర్మం కోసం తన శరీరాన్నే అనేకసార్లు దానం చేసిన మహనీయుడు గదా స్వామి. వారిలాగా మనం మన శరీరం దానం చేయకపోయినా ఫరవాలేదు కానీ



కష్టాలలో వున్న తోటి మానవులకు మాట సహాయం, ఆర్థిక సహాయం, ఆకలైన నిరుపేదలకు ఆకలి తీర్చడంలాంటి ధర్మాలైనా ఆచరించకుంటే దేవుని సన్నిధిలో విచారణ రోజు మన ఖాతాలో పుణ్యమేముంటుంది. అందుకే శ్రీస్వామివారు "చూచి నేర్చుకో" మన్నారు.

గుప్తదానం గురించి **ఖురాన్** మూడవ కాండము 254 వాక్యము మొదలు 269వ వాక్యము వరకు చెపుతుంది. అదేవిధంగా శ్రీస్వామివారు ఎన్నిమార్లు పంచభూతాలనదుపుచేసి వానలు కురిపించినా, అగ్ని ప్రమాదాలనుండి భక్తులను కాపాడినా, ఎవరి రోగాలు తగ్గించినా అంతా తిరువళ్ళూరు వీరరాఘవులమీద, పెంచల నరసింహులమీద, నెల్లూరు రంగనాయకులు మొదలైన దేవతలపై పెట్టేవారు కానీ ఆగొప్పతనం తనకంటగట్టుకోలేదు. అదే గుప్తదానం.

వడ్డీవ్యాపారం పూర్తిగా నిషేధించినట్లు ఖురాన్‌లో 3వ కాండము 275వ వాక్యములో చెప్పారు. కానీ దేశకాల పరిస్థితులనుబట్టి వడ్డీ విషయంలోకూడా ధర్మముండాలయ్యా అన్నారు. డబ్బు బ్యాంకులో వేసుకోవడం ధర్మమని బోధించారు. నామము పేరుతో అధికంగా వడ్లు సంపాదించే ఆమె ఉదాహరణలో ఈ విషయం తెలుస్తుంది.

తనను నమ్ముకున్న భక్తులు నిద్రలో నున్నప్పుడుకూడా ఆపదలనుండి శ్రీస్వామివారు రక్షిస్తున్నారు. ఉదా:- నా కొమారుని తేలుకాటు నుండి తప్పించారు. నిద్రలోనున్న నారాయణమూర్తి గారిని కుక్కునూరు అగ్నిప్రమాదం నుండి రక్షించారు. అత్యవసరపరిస్థితిలో అనూరాధను గొలగమూడి నుండి వాళ్ళ గ్రామం వెళ్ళమని పట్టపగలే దర్శనమిచ్చి చెప్పారు. ఇలా

వ్రాస్తూపోతే ఎన్నయినా వ్రాయవచ్చు. దమ్మపేట నాగేశ్వరరావు గారు తానుచేసే స్వల్పమైన తప్పులను వారి స్వప్నంలో చెప్పి ఆ తప్పులనుండి కాపాడారు. తమ ఇండ్లలో కాచాయని కొందరు కాకరకాయలు మరొకరు టెంకాయలు తెచ్చి బ్రతిమిలాడి వారికి ఇస్తే నాగేశ్వరరావు తీసుకున్నారు. అది మన దృష్టిలో తప్పులేదేమో కానీ శ్రీస్వామివారి దృష్టిలో అది పెద్ద తప్పే. ఎంతో ప్రేమతో ఆప్యాయతతో ఒకరు నాకు 150గ్రాముల బియ్యం ఇచ్చి వండుకోమన్నారు. అదిగొప్ప తప్పేనని శ్రీస్వామివారు తీవ్రంగా శిక్షించి తెల్పారు. అలాగే ఒకరిచ్చిన అరటి పండు తినడంకూడా తప్పేనని శిక్షద్వారానే కాక దైవరాజ్యంలోకి తలుపులు తెరుచుకోవని, చిన్న తప్పయినా తప్పేనని స్వప్నంలో తెలిపారు. మన ప్రార్థన లేకుండానే మన తప్పులు తెల్పి, శిక్షించి మనలను కన్న తల్లిదండ్రులకంటే ఎక్కువగా మన శ్రేయస్సుకై నిద్రలో కూడా కనిపెట్టి కాపాడే కరుణామయుడు శ్రీస్వామివారు.

నాకుండే గొప్పలోపం తిండి పిచ్చి. తిండికి మితమే ఉండదు. అందులో రుచిగా ఉంటే చెప్పనక్కరలేదు. ఒకసారి, పరీక్ష ఉంటేకూడా అది మరచిపోయి పరీక్ష ఐదు నిమషాలవరకూ ఇంకా ఇంకా లొట్టలేస్తూ తింటూ ఉన్నట్లు పరీక్షకు టైంలో వెళ్ళలేక వెళ్ళి సరిగా పేనా రాయక, పేపరు తెలుగు మీడియమైతే ఇంగ్లీషు మీడియం ప్రశ్నాపత్రమిచ్చినట్లు కలగని భయంతో నిద్రలేచి యోచిస్తే తెలిసింది-తిండిపిచ్చి తగ్గనిదే సాధన జరగదని. చిన్నతప్పయినా తప్పేనని-శ్రీస్వామివారు గుర్తింపజేశారు. అయినా కొన్నాళ్ళకు మరలా నిషిద్ధ పదార్థం తినడం, జబ్బు పడడం- ఇలా ఎన్నాళ్ళకు నన్ను మంచిమార్గంలో పెట్టాలనే వారి ఆశయం నెరవేరుతుందోగాని వారు మాత్రం ఒక్క క్షణమైనా నేనెన్ని తప్పులు చేసినా వదలలేదంటే వారి గొప్పప్రేమ



ఎంతటిదో తెలుస్తుంది. అందుకే నేను శ్రీస్వామివారిని "మొండి దున్నపోతులతో సేద్యముచేసే స్వామి" అని, "జలగపట్టు పడతార"ని అంటుంటాను.

జనవరి, ఫిబ్రవరి నెలలో చలి విపరీతంగా ఉండేది. అలాంటి సమయాలలో అగ్నిగుండానికి సమీపంలో పడుకుంటే వెచ్చగా ఉంటుందని క్రొత్తగా వచ్చిన భక్తులకు ఆశ. ఏనాడైనా దూరంగా ఉండమని వచ్చినవారిని ఒక్కమాట అని ఎరుగరు. ధర్మాన్ని ఎంతగా పాటించే వారో చూడండి. అందరూ భోంచేసిన తరువాతే వారు గంజి త్రాగేవారు. భక్తులు సమర్పించిన చినిగిన పాత గుడ్డలు తప్ప క్రొత్తవి స్వీకరించేవారు కాదు. రోశిరెడ్డి భక్తులనుండి తెచ్చిన పంచలు మడతలు తీసిచూచి అవి గట్టి పంచలయితే "ఇదేందయ్యా ఇట్లాంటివి తెచ్చావే" అంటూ వాటిని దూరంగా పారేశేవారు. గనుక మేము గట్టి పంచెలకు చినుగులు పెట్టి ఇచ్చేవారము. పాతగుడ్డలతో జీవించమనే గురువాజ్ఞను ఎంత ధర్మబద్ధంగా ఆచరించారో చూడండి.

**నాభి నందతి నద్వేష్టి = ఇతరులను అభినందించడు, ఇతరులను ద్వేషించడు.**

ఇది దైవాజ్ఞ. ఈ దైవాజ్ఞను ఆచరించడం ఆయన బిడ్డలమైన మానవులకర్తవ్యము. ఈ దైవాజ్ఞను వారు ఎంత చక్కగా ఆచరించారో గదా. ఏనాడూ "ఫలనావారు ఇలాంటివార"ని గాని, "ఫలానా పని ఇలా చేశారు-అది తప్పు" అనిగాని ఎవ్వరినీ విమర్శించి ఎరుగరు. నిద్రలేచింది మొదలు ఇతరుల పురాణం మాట్లాడనిదే ప్రొద్దుపోని మనం వారిని చూచి ఎంత నేర్చుకొని ఆచరించాలో చూడండి. అవతలివారు తప్పే చేశారు. దాని

ఫలితం వారనుభవిస్తారు. ఇప్పుడు ఆ విషయం మనం ఊసుబోక చర్చించినందున అందులో కొంత పాపం మనకు రావడం తప్ప ప్రయోజనమేమీ లేదు. అంతేగాక అలా మాట్లాడిన ప్రతిసారి మన పుణ్యం వారికి వారి పాపం మనకు సంక్రమిస్తుందని "వార్తాలాపం" అనే గ్రంథములో ఒక బ్రహ్మజ్ఞాని చెపుతారు. శ్రీస్వామివారుగూడా వాదుగుంటలో దిగవద్దు అన్నారు. ఏ విషయమూ వాదించవద్దన్నారు.

తన వారందరూ భోంచేశాకనే తాను భోంచేయాలన్నది దైవాదేశము. ఈనాటి కుటుంబ వ్యవస్థనుబట్టి, వృత్తి రీత్యాగాని ఇది మనకు సాధ్యముగాక పోవచ్చును. కానీ శ్రీస్వామివారు ఈవిషయాన్ని తనకు నిర్వికల్ప సమాధి సిద్ధించినంత వరకు ఎంత గొప్పగా ఆచరించారో గదా! శ్రీస్వామివారిని "భోజనానికి లేవండి స్వామీ" అంటే "అందరూ తిన్నారా అయ్యా" అని అడిగేవారు. ధర్మాన్ని ఆచరించడంలో ఆ మహనీయునికి ఆ మహనీయుడే సాటి.

తాను నడవగల్గినన్ని రోజులూ తన గురువాజ్ఞ ప్రకారం ఏక భిక్షతోనే జీవించారు. తనకర్పించిన ఆహారం నుండి ఎక్కువ భాగం భూతబలికి సమర్పించి తర్వాతనే తాను స్వీకరించేవారు. ఈ నియమాలన్నీ ఎంతో కఠోరంగా పాటించేవారు. మిత్రులు, బంధువుల బలవంతాలకు మెత్తబడి, మర్యాదలనే ముసుగులో నియమపాలనలేని మనకు ధ్యానం సరిగా కుదరాలనే తపన మాటలలోనే గానీ ఆచరణలో శూన్యమయింది. ఎప్పుడంటే అప్పుడు ఎక్కడంటే అక్కడ, ఎవరు పెడితే వాళ్ళ దగ్గర మర్యాదకని తినడం, త్రాగడం మానలేని మనకు ధర్మాచరణ ఏముంది? ఇలాంటివే శ్రీస్వామివారు చూచి నేర్చుకోమన్నారు. 'మందం బంధం' అనే మాటలో వారు వాచాకూడా బోధించారు. మన మర్యాదలు, ఫ్యాషన్లు మాననిదే



'మందం బంధం' అనే వారి దివ్యవాక్కును పాటించలేము. అర్థమేమిటంటే మందాకలితో తింటే అది బంధహేతువౌతుంది. భగవంతుడే పంచభూతాలరూపంలో కృషిచేసి ఆహారం తయారు చేశారు. ఆ ఆహారాన్ని మందాకలితో తినడంద్వారా ఆహారాన్ని వ్యర్థంచేసి మనం భగవంతునికి ఋణపడుతున్నామన్నమాట. దేవ ఋణం, ఋషి ఋణం, పిత్రు ఋణం ఎన్ని జన్మలకైనా తీరదంటారు. మరి మనం ప్రతి జన్మలోను దేవునికి ఋణగ్రస్తులవడం తప్ప ఋణం తీర్చడంలేదు. మనకు జన్మ చక్రమునుండి విముక్తి ఎప్పుడు గల్గుతుంది? ప్రతి విషయములోను కఠోరనియమపాలన లేకుంటే మనసాధనలకు ఫలితమెలావస్తుంది? జఠరాగ్ని బాగా రగలనిదే వారు ఏనాడూ ఆహారం స్వీకరించలేదు. దీన్ని వారు ఆచరించి చూపారు. దాన్ని మనం వారిని చూచి నేర్చుకోవాలి. ఆకలి లేకనే మర్యాదకు తినడం, త్రాగడం చేస్తున్నాము. వచ్చిన అతిథులు, మిత్రులు ఏమనుకుంటారో అనే ధ్యాస తప్పితే మనం శ్రీస్వామివారి ఆజ్ఞ ఎంతవరకు పాటిస్తున్నామన్న ధ్యాసే లేకపోతే మనం శ్రీస్వామివారిని చూచి ఏమి నేర్చుకుంటాము? వారి మాటను విని కూడా ఆచరణ లేక లోకం తీరుకే ఆచరణలో మ్రొగ్గు చూపుతున్నాము. వాచా మాత్రం తృప్తి, శాంతి, ఆనందం కావాలని, దైవం కావాలని వట్టి మాటలు చెపుతున్నాము. మన బిందెకు ఎంత స్వల్పమైన చిల్లిఉన్నా అందులో నీరు నిల్వదుగదా! ఈ ఆధ్యాత్మిక సాధన కూడా అంతే. లోకాన్ని మానసికంగా వదలనిదే ఏ ప్రయోజనమూ లేదు మనకేమీ వరగదు.

**ద్వేషం**:- ద్వేషభావం మీద వారెన్ని జన్మలలో యుద్ధం ప్రకటించి విజేతయైనారో చూడండి. తన సేవకులిద్దరు కొట్లాడుకున్నారు. ఒకతని గోరు మరొకరి మెడకు గీచుకొని రక్తం వచ్చింది. ఆ రక్తాన్ని తన గుడ్డలకంతా పూసుకొని అతడు గొలగమూడిలోని తన

బంధువులకు చూపి చెప్పుకొన్నాడు. వాళ్ళంతా ఆవేశంగా వచ్చి ఆ కొట్టినవాడిని ఆశ్రమం నుండి వెళ్ళగొట్టమని శ్రీస్వామిని కోరారు. అందరి వాదనలు ప్రశాంతంగా విని శ్రీస్వామివారిచ్చిన తీర్పు వినండి "ఒకరిని పొమ్మనే కంటే మనం పోవడం మంచిది గదయ్యా" అన్నారు. ఆ మాటతో గ్రామస్తులంతా కిం అనకుండా వెళ్ళి పోయారు. కొట్లాడుకునేవారికే బుద్ధి ఉండాలిగాని మనం ఒకరిని వెళ్ళగొట్టినంత మాత్రాన వారిలో పరివర్తన వస్తుందా? రాదు. సర్వ ప్రేరణాధికారియైన శ్రీస్వామివారే వారిలో సత్‌ప్రేరణ పెట్టి పరివర్తన తెస్తారు. ఇదంతా మనలను చూచి నేర్చుకోమంటున్నారు. పారాయణలతో పాటు ఆచరణ నేర్చుకోమంటున్నారు.

## మంత్రమెక్కడుంది? తంత్రమెక్కడుంది? చూచుకుంటూ పొయ్యేదేగదయ్యా!

ఈ మహనీయుడు చెప్పిన ఈ మాటకు తానే ఒక చక్కని ఉదాహరణగా నిలిచారు. శ్రీమాధవదాసు చరిత్ర చదివించుకొని విని శరీరం వదిలారు. శ్రీమాధవదాసుగారు కూడా గురుసేవ చేసి తరించారు. వారి గురువుగారు వారికి జీవితాంతము ఏ మంత్రమూ ఉపదేశించలేదు. గురుసేవ ద్వారా ముక్తి పొందారు. గురువు శరీరం వదిలేటప్పుడు శ్రీమాధవదాసుగారు గురువుగారితో ఒక ఘోరారణ్యములో కాలినడకన ప్రయాణము చేస్తున్నాడు, బ్రహ్మంగారు సిద్ధయ్యగారిని పూలకు పంపి సమాధి చెందినట్లే శ్రీమాధవదాసు గారిని వారి గురువుగారు మంచినీళ్ళు తెమ్మని పంపి తిరుమంత్రము భూమిపై వ్రాసి శరీరం వదిలారు. ఆ తిరుమంత్రము ఒక దొమ్మరిపడుచు తాటాకుపై వ్రాసి చెవులలో ధరించి వెళ్ళింది. ఎన్నో కష్టాలకోర్చి మాధవదాసు ధర్మరాజు చేసే రాజసూయయాగము



దగ్గర దొమ్మర పడుచు నుండి తిరుమంత్రపు చీటీ పొందారు. ఆ మంత్రము ఒక్కసారైన జపించకముందే నిండు రాజసభలో పుష్పకవిమానంలో విష్ణుదూతలు వచ్చి వారిని సశరీరంగా ముక్తిధామం తీసుక వెళుతారు.

శ్రీమాధవదాసుగారు ఆ దివ్యమంత్రాన్ని ఒక్కసారైనా పఠించకుండానే ముక్తిధామం సశరీరంగా వెళ్ళారు. ఇదే శ్రీవెంకయ్య స్వామివారు బోధించిన "మంత్రమెక్కడుంది? తంత్రమెక్కడుంది?" అన్నమాటలోని రహస్యం. మంత్రమనేది మనస్సును ఏకాగ్రము చేయుటకు ఒక పరికరము లాంటిది మాత్రమే. మంత్రం లేకుండా కూడా మనసును ఏకాగ్రము చేయవచ్చును. షిరిడీ సాయి రాధాబాయిగారికి చేసిన ఉపదేశమిదే. సాయి తన గురువును సేవించిన విధమే వారి మార్గము. శ్రీరమణ మహర్షి బోధించిన "నేనెవడను" అనే అన్వేషణ కూడా ఇదే. దానినే శ్రీస్వామివారు ఈ మాటలో బోధించారు.

**చూచుకుంటూ పొమ్మన్నారు**:- ఏమి చూడాలి? ఎక్కడ చూడాలి? గురువునే. నీ శక్తినంతటిని ఉపయోగించి నీ మనసులో హృదయంలో గురువును నింపుకోమన్నారు. మరిప్పుడు శ్రీ స్వామి వారు లేరుగదా అంటారు. శ్రీస్వామివారంటే 51/2 అడుగుల మనిషి కాదు. విశ్వమంతా తానైన చైతన్యమే స్వామి. ఏ జీవిని ఆదరించినా, సేవచేసినా గురువుకే చెందుతుంది. ఆ చేయడంలో ముఖ్యంగా భావం ప్రధానము. నీ భావం ఎలాంటిదో ఫలితం అలాగే ఉంటుంది. "యద్భావం తద్భవతి" అన్నారు పెద్దలు. పిపీలికాది బ్రహ్మ పర్యంతం గురు రూపంగా భావించి నిరంతరం సేవించు. అప్పుడు ఋణానుబంధాలు తీరి బంధ విముక్తి కలిగి మోక్షం సిద్ధిస్తుంది. నీ ప్రవర్తనలో, నీ జీవిత రథయాత్రలో క్రొత్త ఋణానుబంధాలు తగులుకోకుండా ఉండాలంటే "ఇష్టము,

అయిష్టము" సంపూర్ణంగా నశించాలి. భక్తుని లక్షణాలన్నీ భగవద్గీతలో చెప్పినట్లు స్వతస్సిద్ధము చేసుకొనుటొక్కటే మార్గము. అందుకు శ్రీ సిద్ధారూఢస్వామి (హుబ్లీ) వారు చెప్పిన "నేను నా కొడుకునే" అనే మాట మనకు మంచి ఆధారము. "నా పూర్వకర్మలే నన్ను వీరికి బిడ్డను చేసినది. నాకర్మలే శత్రుమిత్రులను సృష్టించింది. నా కర్మలే నా శత్రుని కనుగుడ్డు ద్వారము ద్వారా ప్రవేశించి అతని హృదయాన్ని ప్రేరేపించి నా ఎడల చెడ్డగా ప్రవర్తించేటట్లు చేశాయి. నా శత్రువులు అని నేను భావించడం అజ్ఞానము. వారు నిర్దోషులు. నా పూర్వకర్మలే కారణమనే ఎరుక ఒక్క క్షణం ఏమారకుండా ఉంచుకుంటే శత్రుమిత్రులే ఉండరు."

ఇది ఒక్క గురుకృప వలన మాత్రమే సాధ్యము. గురుకృప కల్గాలంటే ఆచార్య భరద్వాజగారు పాకలపాటి గురుచరిత్రలో చెప్పినట్లు ఎంతో పుణ్యముంటే కాని గురు సమాశ్రయం దొరకదు, ఇంకెంతో పుణ్యముంటే కాని వారి కృప పొందలేము. ఈ పుణ్యమెలా వస్తుంది? సాత్వికగుణం పెంపొందించుకోండి. భగవద్గీతలో చెప్పిన దైవీసంపద లక్షణాలు సాధించే తీవ్ర ప్రయత్నంచేస్తూ మనం హృదయపూర్వక ప్రయత్నం చేస్తూ ఒక అడుగువేస్తే శ్రీస్వామివారు పదడుగులు మనవైపు వేసి మనకు చేయూతనిచ్చి ఆదుకుంటారు. అన్నింటికీ పుణ్యమే కారణము. గనుక దాన్ని ఆర్జించండి. పుణ్యమేది పాపమేది అని విచికిత్సకు చక్కని జవాబు - "ఇతరులు నీకు ఏది చేయకూడదనుకుంటావో దానిని నీవు ఇతరులకు చేయకు, ఇతరులు నీకేది చేయాలను కుంటావో దానిని నీవు ఇతరులకు చెయ్యి" అని శాస్త్రకారులు, పెద్దలు చెప్పారు. పరపీడనం పాపం; పరోపకారం పుణ్యం. పాపం అంటుకోకుండా క్రమంగా పుణ్యం పెంచుకో అన్నారు.



**నిర్మమో నిరంహకారః:-** శ్రీస్వామివారు మమకారం కాల్చారు. ఇంటిలోనివారిని బంధుమిత్రులను వదిలేశారు. కుటుంబము వదలి విశ్వమే తన కుటుంబము చేసికొని సర్వజీవులేకాదు నిర్జీవుల ఎడలకూడా దయచూపారు. కాని మనలను ఇల్లువాకిలి వదలి అడవులకు పొమ్మనడంలేదు. ఇంటిలోని వారి ఎడల బంధుమిత్రుల ఎడల మమకారము వదలమంటున్నారు. అసలు మనకు మమకారమున్నట్లు మనకు తెలియడం ఎట్లాగు? పూజ్య శ్రీ భరద్వాజగారు చెపుతారు - మన మమకారము ఎవరిమీద ఉంటుందో వారికి ఏ కష్టమొచ్చినా మనకు దుఃఖము వస్తుంది. మమకారానికి అదే గుర్తు. వారి కష్టం తొలిగించేందుకు నీ శాయశక్తులా కృషిచేయవచ్చు, నీ ఆర్థిక శక్తికి మించి వారి కష్టం తీరేందుకు సహకరించవచ్చు కానీ దుఃఖము ఉండకూడదు. (నిర్మమో నిరహంకారః)

శ్రీ సిద్ధారూఢస్వామివారు "నేను నా కొడుకునే" అంటారు. మన తండ్రి అని మన మనుకొనే వ్యక్తికి నేను బిడ్డను అయ్యేందుకు, నాకు ఆయనకు ఉండే ఋణానుబంధమే కారణము. ఋణానుబంధానికి గతంలో నా అజ్ఞానకర్మలే కారణము. గనుక సర్వం ఋణాను బంధాన్ననుసరించి జరుగుతుంటే మోహమెందుకు? పాత ఋణానుబంధాలు శ్రీస్వామివారికి వదలి క్రొత్త ఋణానుబంధాలు తగులు కోకుండా జాగ్రత్తగా జీవితరథాన్ని నడుపమంటారు శ్రీ ఆచార్య భరద్వాజగారు.

**నిరహంకారము:-** అహంకారము అంటే ఇతరులను దుర్భాష లాడడం, కొట్టడం లాంటివి మాత్రమే కాదు. ఏ చిన్నపనిగాని 'నేను చేస్తున్నాను' అనే భావం ఆత్మలో నైనా ఉండడము. అందుకే నిరహంకారానికి నిదర్శనంగా శ్రీస్వామివారు ఎవరిని కాపాడినా,

ఎవరి బాధతీర్చినా తిరవళ్ళూరు వీరరాఘవస్వామి, నెల్లూరు రంగనాయకులు, పెంచలస్వామి లాంటి దేవతలపై పెట్టేవారు. పైవాళ్ళు వప్పుకోరు అని చెప్పేవారు. మరణ వార్తలు, తప్పనిసరిగా అనుభవించవలసిన కష్టాలను, శారీరక బాధలను గురించి ముందుగా ఆయా భక్తులకు చెప్పేవారు కాదు. "పైవాళ్ళు మాట రానివ్వడంలేదు. నేనేం చేసేదయ్యా" అని తప్పుకునేవారు. "మీ కంటే పైవాళ్ళెవరు స్వామి" అంటే- "నీవు భలే మాట్లాడుతావయ్యా!" అని నవ్వేసేవారు. మనము స్వామి అని తలచే 5½ అడుగుల శరీరం తాను కాదని శరీరభ్రాంతి నతిక్రమించి నడుచుకునేవారు. నేను చేశాను, చేస్తున్నాను, చేస్తాను అనే కర్తృత్వభావన పరిధిని దాటి మెలిగేవారు నిరంతరము. అలా శ్రద్ధతో - కేవలం శ్రద్ధతో సాధన చేయమని బోధిస్తున్నారు.

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అన్నారు పెద్దలు. అదీ శ్రద్ధకాదు కేవలశ్రద్ధ కావాలంటాడు బుద్ధుడు. ఏమాత్రమూ ఒక్క అణుమాత్రము కూడా మలినములేని శ్రద్ధ ఉండాలంటారు. అలాంటి శ్రద్ధ కలగాలంటే తప్పని సరిగా వైరాగ్యమవసరము. ఋణానుబంధాలు, కర్తవ్యాలు, ముందు చేసిన వాగ్దానాలు తీర్చుకుంటూ సాధన చేయమన్నారు. మల్లిక వెంకయ్యలాంటి కొందరిని ఋణానుబంధాలు లేనివారిని తన సేవలోనే ఉండమన్నారు. అక్కిం వెంకట్రామిరెడ్డి వంటి వారిని గృహస్థాశ్రమం స్వీకరించి ఋణానుబంధాలు చెల్లించమన్నారు.

**సాంప్రదాయము గౌరవించుట:-** శ్రీస్వామివారు మందిరాలలో విడిది చేసేవారు లేదా శ్రద్ధాభక్తులుగల భక్తుల ఇండ్లకు వెళ్ళినా వారి గృహాలలో ప్రవేశించకుండా ఇంటి వరండాలలోకానీ, పశువుల కొట్టాలలోగాని, ఆ ఆవరణములో చెట్లనీడన గాని విడిది చేసేవారు.



ఇది పరిశుద్ధమైన సాధుజీవనానికి సాంప్రదాయంగా పెద్దలు ఆదేశించిన జీవిత విధానము. అంతేగాని ఒకే చోట స్థిరనివాసం ఏర్పరచుకోరాదని ఆదేశించారు. భిక్ష స్వీకరించిన చోట తినరాదు, తినినచోట పడుకోరాదు. అలా ఒకే చోట స్థిరంగా ఉండసాగితే పరిచయాలేర్పడి ఏకాంతమునకు భంగము వాటిల్లడమేగాక ఋణానుబంధాలు క్రొత్తవి ఏర్పడే ప్రమాదముంది. అందుకే స్వామివారు ఎప్పుడూ అనికేతుడుగా (స్థిరనివాసము లేనివాడుగా) సంచారము చేసేవారు. ఇలా ఎంత వరకు తిరగాలి? రాత్రి, పగలు తెలియనంతవరకు, తానుండే స్థానము పరిసరాలను బట్టి అదే గ్రామమని తాను గుర్తించలేనంతవరకు తన శరీరంలో శక్తి నశించి తిరగలేనంతవరకు ఇలానే సంచరించారు.

**అహంకార రాహిత్యము:-** అనుక్షణము దేహభ్రాంతి నతిక్రమించి, నేను చేస్తున్నాను అనే భావన మచ్చుకు కూడా లేకుండా అంతా చేసేది పరమాత్మే అనే భావంలో స్థిరంగా నిలబడ్డారు. ఈ భావం స్వతస్సిద్ధమయితే భూత భవిష్యత్ కాలాలకు సంబంధించిన ఆలోచనా స్రవంతి నాశనమవుతుంది. పైవాళ్ళు వప్పుకోరు, ఆ దేవాలయానికి వెళ్ళు, ఈ దేవాలయానికి వెళ్ళు, ప్రదక్షిణలు చెయ్యి, ఆ పవిత్ర జలాల్లో స్నానంచేసి, నిద్రచేస్తే నీ ఆరోగ్యం బాగుపడుతుందనేవారే గాని తాను ఆ జబ్బులు పోగొడుతున్నాననిగాని, చిక్కు సమస్యలు పరిష్కరిస్తున్నానని గానీ ఏనాడు తాను తలంచరు, నోటితో చెప్పరు.

**సాటి జీవులకు సహాయపడేందుకు తన సుఖాన్ని త్యాగం చేయడం:-** పరమాత్మ తప్ప అన్యమేదీ భూమి మీద లేదు గనుక నిజమైన గురుభక్తుడుగా తనను తాను గురువుగారి పాదాలకు అంకితం చేసుకున్నారు. ఈ విషయంలో మనం శ్రీ స్వామివారిని చూచి నేర్చుకోవలసినది వ్రాయనలవికానంత గొప్పగా ఉంది. తనను

ఆశ్రయించిన వారందరి కర్మలూ, తన సేవకుల కర్మలూ తపోశక్తితో క్షాళన చేయలేనివి తప్పనిసరిగా ఆయా శరీరాలు అనుభవించవలసి ఉంటే అలాంటి కర్మలను తన శరీరం మీదకు తీసుకొని తానా బాధను అనుభవిస్తూ ఆయావ్యక్తులకు బాధ విముక్తి చేసేవారు. కొందరి కర్మలు బాపేందుకు నిద్రాహారాలు మాని రోజుల తరబడి అగ్ని ప్రేల్చేవారు. ***ఒక్కక్షణం మన సొంత పని ప్రక్కనబెట్టి బాధలలో ఉన్నవారికి సహాయం చేయడం మనకలవడనంత వరకు మనకు "పునరపి జననం పునరపి మరణం" తప్పదని*** తన ఆచరణద్వారా మానవాళికి గొంతెత్తి చాటుతున్నారు.

"సాధు దర్శనం పుణ్యం, స్పర్శనం పాపనాశనం" అన్నారు పెద్దలు. గనుక 95 సం|| వృద్ధాప్యములో కూడా శ్రద్ధా భక్తులుగల అమాయకులైన తన భక్తులకు దర్శనమిచ్చేందుకు ఎన్నో ఇబ్బందులను కష్టాలను సంతోషంగా ఓర్చుకొని ఆయా గ్రామాలలో సంచరించేవారు. పోతేపోనీ మనకెందుకు వచ్చిన పీడ అనే పద్ధతి మాని శక్త్యానుసారము కొద్దిగానైనా సాటి జీవులకు సహకరించి భగవంతుని కృప పొందమన్నారు.

**మందల కనుక్కుంటే మంగళవారం మంచిదయ్యా:-** మనం చేసే ప్రతిపని భగవంతుని సేవ - నేను ఆయన చేతిలో ఒక ఉపకరణాన్ని మాత్రమే అనే భావం స్థిరంగా మనలో ఉంటే ఒక పనిని మంగళవారం మొదలు పెట్టినా మంచిదేనంటున్నారు. ఏ పనిచేసినా దాని ఎడల ఆశావ్యామోహాలు లేకుండా ఇది భగవంతుని సేవ అనే కృతజ్ఞతాభావంతో చేయమంటారు. ఆపనికి అడ్డు తగిలిన వారిపై ద్వేషం పనికిరాదంటారు. మన పూర్వకర్మలు, ఋణానుబంధాల ననుసరించి దైవప్రేరితులై వారు



అలా అడ్డుతగులుతారేగాని వారిపై ద్వేషాదిభావాలు తగవు అంటున్నారు. ఈ భావనతో పనిచేసేవారికి ఏ వారమైనా మంచిదే. మంగళవారము మంచిదికాదనే భావం తప్పు అంటున్నారు.

**సుఖమంటే ఏమిటో కష్టమంటే ఏమిటో నాకు తెలియదయ్యా** అన్నారు. సగటు మానవులందరికీ ఇష్టాయిష్టాలు స్థిరంగా హృదయంలో పాతుకొని ఉంటాయి గనుక సుఖము, కష్టము అనే ద్వంద్వాలు నీడలా వెంటాడుతుంటాయి. కానీ మహనీయులు సుఖానికి పొంగరు, కష్టానికి క్రుంగరు. భగవంతుడు ప్రసాదించిన దాన్ని తప్పక అనుభవించాలి. సంతోషంగా అనుభవిస్తే తనకేగాకుండా తన ప్రక్కనున్న వారికి గూడా సంతోషాన్ని పంచినవారమౌతాము. అనంతకరుణామయులైన భగవంతుడు తన బిడ్డలకు కష్టాలెందుకు పెడతారు. ప్రస్తుత మన కష్టాలకు మన పూర్వ కర్మలే కారణము. శ్రీసిద్ధారూఢస్వామివారు "నేను నా కొడుకునే" అంటారు. అంటే నన్నీ తండ్రి వద్ద పుట్టించినది పూర్వపు నా అజ్ఞాన కర్మలే కారణము. అలాగే మనలను కష్టపెట్టేందుకు ఎదుటివారికి ప్రేరణనిచ్చింది మన పూర్వ ఋణానుబంధాలు. గనుక పొంగు క్రుంగులకు గురి కారాదంటున్నారు.

**వాక్నియమము:-** తన జీవిత కాలమంతలో ఒక్కసారైనా ఫలానా వాడు మంచివాడు ఫలానావాడు చెడ్డవాడు అని ఎరుగరు. ఈ పని ఇలాచేస్తే తప్పని చెప్పి ఎరుగరు. ఈ కూరబాగుంది, ఈ కూర బాగాలేదు అని ఎరుగరు. ఇది ఆరోగ్యానికి మంచిది అని చెప్పి ఎరుగరు. ఈ విశ్వమంతా చిద్విలాసముగదా! చిత్ యొక్క విలాసము లేక క్రీడ. చిత్ అంటే అంతానిండియున్న పరమాత్మయొక్క లీల లేక క్రీడ, ఆనందమునకు ఆడే ఆట. పరమాత్మ తన వినోదమునకు ఆడే ఆటలో మంచేముంది, చెడ్డేముంది. ఇది గుర్తించి గురుస్మరణ చేస్తుంటే సర్వమూ

సమకూడి నిరవధికానందమే అనుభవమవుతుంది అనే దాన్ని తనను చూచి నేర్చుకోమని బోధిస్తున్నారు.

ఎవరిని గూర్చి చెడుగా మాట్లాడినా లేక చెడుగా తలంచినా ఆ వ్యక్తియొక్క చెడు కర్మ మనకు సంక్రమించి మన పుణ్యం వారికి పోతుంది. ఈ విషయం శ్రీస్వామివారు తన ఆచరణ ద్వారా మనకు బోధిస్తున్నారు.

### నిత్యమూ ఎంత ఆహారం భూతబలికి సమర్పించేవారో చూచిన వారికే తెలుసు

తాను భోంచేసినన్ని రోజులూ ఒక మనిషికి సరిపడేంత అన్నం భూతబలికి సమర్పించేవారు. అంత ఆహారం భూతబలికి ఇవ్వడానికి మనకు మనసు వప్పుకుంటుందా? కనీసం చేతినిండా దండిగా సమర్పిస్తున్నామా? కొంతమందిమి అసలు సమర్పించము గదా? ఈ ఆహారమంతా మన తెలివి తేటలు, మన కృషి వల్లనే మనకు సమకూడిందని భ్రమిస్తాము. పంచభూతాల రూపంలో భగవంతుడు కృషిచేస్తేనే పంట పండింది. సూర్యుడు, భూమి, నీరు,గాలి, ఆకాశములను పంచభూతాలంటారు. అంతమాత్రమే కాకుండా కోటానుకోట్ల జీవులు కృషి చేస్తేనే ఆహారమొచ్చిందని బాగా గుర్తించాలి. జీవులంటే- జీవులరూపంలో కృషి చేసేది భగవంతుడే కదా! భూమిని దున్నే ట్రాక్టరుకు ఇనుము కావాలి - గనిలో నుంచి తీయడం- ట్రాక్టరు రూపం ధరించాలంటే ఎందరు కృషిచేయాలోగదా. ట్రాక్టరు నడిచే ఆయిల్ కావాలంటే ఎందరి కృషి కావాలో, బావి బోర్ లాంటి నీటి ఆధారాలు, కరెంటుకావాలి దానికెన్ని జీవులు కృషిచేయాలో- పాత్రలు తయారీ - పంటలకు మందులు - మనషులకు మందులు - ఇన్ని రూపాలలో భగవంతుడే ఆయా జీవుల రూపంలో కృషి చేసి విశ్వయజ్ఞం



నడిపిస్తున్నాడు. అందులో మనమొక భాగము. దీనిని గుర్తించి ప్రతిసారి భోంచేసే ముందు భగవంతునికర్పించి తినడం మానవులమైన మన కర్తవ్యం గనుక అది నేర్చుకోమని శ్రీస్వామి వారు నిత్యం భూతబలికి సమర్పించేది చూచి నేర్చుకో మంటున్నారు. పిడికెడు మెతుకులు బయట పడేయడం కాదు - భగవంతుడు ఎన్ని రూపాలు ధరించి ఈ విశ్వయజ్ఞాన్ని నిర్వహిస్తున్నాడు, అనేది హృదయపూర్వకంగా గుర్తించి కృతజ్ఞతా భావంతో నమస్కరించి భూతబలి సమర్పించమంటారు ఆచార్య శ్రీ భరద్వాజగారు.

**ఆకలై కొంగు పట్టేవారికి అన్నం పెట్టాలయ్యా:-** శ్రీస్వామివారు బొంతరాజుపాళెం, ముదిగేడు, చెర్లోపల్లె వంటి చిన్న చిన్న కుగ్రామాలలో ఒక్కొక్కొసారి మకాం వేసేవారు. వారి దర్శనార్థమై ఎక్కడెక్కడి నుండో పల్లెలు, పట్నాల వారు వచ్చేవారు. శ్రీవారు ఆ పల్లెటూరిలో ఉన్నారని తెలుసుకొని కాలినడకన వారు వచ్చేసరికి ప్రొద్దుకూకుతుంది. ఆ గ్రామాలలో హోటళ్ళు, పూటకూళ్ళ ఇళ్ళు ఉండేవికావు. వచ్చిన వాళ్ళందరికి వండి పెట్టాలంటే శ్రీ స్వామివారి దగ్గర వంటపాత్రలు, ఆహార పదార్థాలు ఉండవు. ఆ మహనీయుని కృప వలన ఇంటికొక అతిథిని తీసుకవెళ్ళి గ్రామస్థులు చక్కగా భోజనం పెట్టేవారు. బొంతరాజుపాళెం అని ఒక చిన్న పల్లెటూరిలోని గ్రామస్థులంతా వారుండే ఆ గ్రామం బాగుండలేదని పాత ఊరికి కొంతదూరంలో క్రొత్తగా పూరిపాకలేసుకున్నారు. ఇండ్లకు గోడలు కూడా పెట్టలేదు. శ్రీస్వామివారు ఒక్క రాత్రి వారి పవిత్ర అగ్నిహోత్రం వేస్తే మంచిదని వారిని తమ గ్రామం తీసుకువచ్చారు. రాత్రి ఎనిమిదిగంటల వేళ పదిహేను లేక ఇరవై మంది ఎంతో శ్రమపడి తలుపూరునుండి శ్రీస్వామివారి దర్శనానికి నడిచి వచ్చారు. అంత రాత్రివేళ ఆ గ్రామస్తులు ఇంటికొకరిద్దరిని తీసుకువెళ్ళి భోజనం పెట్టారు. శ్రీస్వామివారు ఎక్కడున్నా ఇలాగే

జరిగేది. గనుక నేడు మనం వారాచరించి చూపిన మార్గాన నడవడం మంచిదిగదా! అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోమన్నారు. ఋణానుబంధాన్ని విశ్వసించి గుర్తుంచుకో. ఏ ప్రాణినీ తోలెయ్యవద్దు. ఆకలిగొన్నవారికి అన్నం, గుడ్డలు లేని వారికి గుడ్డలు ఇవ్వు, భగవంతుడు సంతోషిస్తాడు అని చెప్పిన మాటను చూచి నేర్చుకొని ఆచరించమంటున్నారు.

ఆధ్యాత్మికంగా పెరగాలంటే మొదట సాధించవలసిన దైవీ సంపద "ఇష్టముఅయిష్టము" లేకుండా చేసుకోవడం. ఈ మహనీయునకు ఎల్లవేళలా 'ఇష్టం అయిష్టము' లేకుండా జీవించడం సహజ సిద్ధమైపోయింది. తలుపూరులో పెమ్మసాని మస్తానయ్యగారింటికి అమేషా వచ్చేవారు. అక్కడొక పెద్ద వేపమాను, దాని క్రింద పెద్ద పేడదిబ్బ ఉండేవి. పేడదిబ్బను కోళ్ళు గెలికినందున ఎరువంతా చిందర బందరగా పడి ఉండేది. శ్రీస్వామివారిని అక్కడ దింపి కూర్చోబెడితే, తన చుట్టు ప్రక్కల ఉండే చెత్తాచెదారం, ఎరువు మొదలైన వాటిపైన వారి దృష్టే ఉండదు. రాగానే 'నిప్పుచూడండయ్యా' అంటారు. మంటవేసి కట్టెలు వారికి అందుబాటులో పెడితే ఇకవారికి ప్రపంచములో దేనితోనూ సంబంధము లేనట్లు మంట ముందు కూర్చొనుండేవారు.

అట్లాగే చెర్లోపల్లి రామాలయం దగ్గర ఎక్కువగా విడిది చేసేవారు. ఆ రామాలయం 12 x 12 అ॥ పూరిపాక. అందులో 4అ॥ వెడల్పు అడ్డుగోడ పెట్టి లోపల చెయ్యి విరిగిన రాములవారి విగ్రహము, లక్ష్మణస్వామి, సీతమ్మ, ఆంజనేయ స్వామి విగ్రహాలు 9 అంగుళాల ఎత్తు గలవి ఉండేవి. పైకప్పు సరిగాలేనందున వర్షం నీళ్ళు కురిసేవి. మేకలు, కోళ్ళకు అది విశ్రాంతి ప్రదేశం. కోళ్లుగెలికి నేలంతా గుంటలే. శ్రీస్వామివారిని ఆ గుంటల మిట్టల



స్థలంలో కూర్చోపెడితే ఇదేంటి ఈనేల ఇలాఉందే అని అడగనే అడగరు. వారి దృష్టంతా నిప్పుమీదనే ఉండేది. ప్రతి విషయంలోను ఇష్టాయిష్టాలు లేకుండా జీవించడం వారిని చూచి సాధకులందరూ నేర్చుకోవలసిన గొప్ప పాఠం.

ఎనభై ఐదు సంవత్సరాల వృద్ధాప్యంలోకూడ ఏనాడు గోడకానుకొని కూర్చొని ఎరుగరు. రోజుల తరబడి అగ్ని ముందు అలా ఆసనమైనా మార్చకుండా కూర్చొనియుండేవారు. ఆరుబయట మంట ముందు కూర్చుంటే లేచేదే లేదు. గాలివాటం మారి పొగ, అగ్నిరవ్వలు తన మొకానికి కొడుతున్నా సరే తన స్థానం మార్చి కూర్చోరు.

ఇవన్నీ మనకు సాధ్యమేనా అని అనవద్దు. హృదయపూర్వకంగా ఎప్పుడైనా ప్రయత్నించడం అనే ఒక్క అడుగు వేస్తే వారు పదడుగులు మనవైపువేసి మనలనుద్ధరించ వస్తారు. నాలాగా (రచయిత) కాలము వృథాచేయ వద్దని పందికొక్కు కథ చెప్పారు. ఒక పందికొక్కు సజ్జగూటిలో దూరి బాగా తిని బలిసి ఒకరోజు కావలివాని ముందుకొచ్చి నా సంగతేం చెపుతావన్నది. అతడు దాన్ని చంపి కూరవండి తిన్నాడట. అందరూ నవ్వుకున్నారు.

కాలము ఎంతో విలువైనది. సద్గురుసన్నిధికి వచ్చి కూడా కాలం వృథా చేయవద్దు. ఎప్పుడూ తిండి పిచ్చితోనే జీవిస్తే పంది కొక్కులాగా చస్తావు. యమధర్మరాజు నిన్ను కాలము వృథా చేసినందుకు క్షమించడు. దేనికి భయపడకుండా నీ యావజ్జీవశక్తినీ గురువుపై లగ్నంచేసి సాధన సాగిస్తే సర్వమూ ఆ సద్గురుమూర్తే సమకూరుస్తారు అని బోధిస్తున్నారు.

ఇష్టాయిష్టాలు వదలుటే సాధనలోని రహస్యము. సద్గురువుకు సంపూర్ణశరణాగతి చేసినందులకు గుర్తు ఇష్టాయిష్టాలు త్యజించుటే. వాటిని వీడనిదే సర్వస్యశరణాగతి చేసినట్లు కాదు.

ఒకరోజు శ్రీస్వామివారు భోంచేస్తున్నారు. ఒక కుక్కవచ్చి వారి ముందున్న అన్నంలో మూతిపెట్టి తినసాగింది. శ్రీస్వామివారు నోరు విప్పకుండా ఇవతలకు లేచి వచ్చారు. ఆ కుక్క కడుపునిండా తృప్తిగా తిని వెళ్ళింది. మనమైతే ఎంతగోలచేసి ఆకుక్కను ఎన్ని దెబ్బలు కొట్టేవాళ్ళమో, ఎన్నితిట్లు తిట్టే వాళ్ళమోగదా! ఆ మహనీయునిచూచి ఇష్టాయిష్టాలు ఎలా వదలవలెనో నేర్చుకోమంటున్నారు.

**వాక్నియమం:-** కారు డ్రైవరు మస్తానయ్యను రమణయ్య అనే వ్యక్తి "ఒరే మస్తానా" అని పిలిచాడు. మస్తానయ్య మనసు బాధపడింది. శ్రీస్వామిసన్నిధి దాటివస్తే అతని పని చెప్పాలను కున్నారు. వెంటనే శ్రీస్వామి ఒరే అన్నదానికి మూడు వందలు జుల్మానా వ్రాశారని, అది అనుభవిస్తేగాని పోదని చెప్పారు. గనుక మనందరిని వాక్నియమం పాటించమని బోధిస్తున్నారు. చిన్నా పెద్దా అనే బేధంలేకుండా అందరినీ శ్రీస్వామివారు అయ్యా అని పిలిచేవారు. వారినిచూచి మనందరము ఎంతనేర్చుకోవాలో యోచించండి.

శ్రీస్వామివారి సేవకులు ఇద్దరు పెనుగులాడారు. ఒకరికి కొంచెం రక్తమొచ్చింది. అతడు తన బంధువులందరినీ తీసుకువచ్చి అవతలి సేవకుని ఆశ్రమం నుండి వెళ్ళ గొట్టమన్నారు. అప్పుడు స్వామివారు "ఒకరిని పొమ్మనేదానికంటే మనం పోవడం మంచిది కదయ్యా" అని చెప్పారు. ఆమాటతో అందరూ "కిం" అనకుండా జారుకున్నారు. వారి ధర్మతీర్పునకు వాదనలే లేవు. మనందరమూ అలాంటి భావాలతో జీవితం గడిపి దైవకృప పొందాలని శ్రీస్వామివారి తీర్పు.



## దీనజన సంరక్షణే తన అవతారకార్యముగా జన్మించిన మహనీయుడు

భగవంతుడు తన దగ్గరకు పంపిన ఎలాంటివారివైనా వారిబాధలు తీర్చేందుకు సంసిద్ధుడై శ్రీస్వామివారు నిరంతరమూ కృషిచేసేవారు. అలవిగాని జబ్బులతో డాక్టర్లచుట్టూ తిరిగి లక్షల రూపాయలు ఖర్చుచేసి చివరి ఆశగా తనదరి చేరినవారు ఆ బాధలు భరించలేకుంటే వారి బాధను తన శరీరంపైకి తీసుకొని తానునుభవిస్తూ ఆ వ్యక్తికి నయంచేయడం ఈ మహనీయునికే చెల్లింది. గౌని పెంచలమ్మ వంటిజిలను తానునుభవించి ఆమె బాధ తీర్చారు. శెట్టిగారి కుష్టువ్యాధి తన శరీరంపైకి తీసుకొని వారికి బాధ తొలగించారు. అదృశ్యంగా ఉన్న భక్తుల ఆయాసం తానునుభవించి వారి బాధ తీర్చారు. ఈ విధంగా ఎందరి బాధలు తానునుభవించారో మనకు ఆ మహనీయుడు తెలియనిస్తారా? ఈ నిష్కామకర్మను సాధించి దైవకృప పొందమని మనందరికీ బోధిస్తున్నారు.

**ఇంద్రియ నిగ్రహము:-** శ్రీస్వామివారికి భోజనవేళలంటూ ఉండేవి గావు. అనుకున్న పని అయితేనే గంజి త్రాగేవారు. ఒకరి జబ్బు నయంచేయాలంటే వారి చెడుకర్మనంతా తన తపోశక్తితో క్షాళన చేసినంతవరకు అన్నపానీయాలు ముట్టేవారుకాదు. ఎప్పుడో రాత్రి 3గం॥కు గాని 2గం॥కు గాని మన లోకంలోకి వచ్చి గంజిపోస్తావా అయ్యా అంటారు. ఆ టైంలో పాలు దొరకవు. గనుక భక్తులు సమర్పించిన మిఠాయి కొంత దాచిపెట్టి చీమలు ఎక్కకుండా చీమల మందు చల్లిపెట్టి ఉంచేవారు. ఆ మిఠాయి కొంచెం పెడితే "అయ్యా మీరు కూరలో వేసుకొనే యర్రపొడి పెడుతావా" అని మిరప్పొడిగాని పచ్చడిగాని పెట్టమని అడిగేవారు. అవి పెడితే ఆ మిఠాయికి కలిపి మిఠాయి రుచి చంపి దాన్ని తన క్షుద్బాధా

నివారణకు మందుగా స్వీకరించేవారు. ఒకరోజు సగం ఉడికిన సంగటి పెట్టించుకొని దానిలోకి ఎండుమిరప్పొడి అద్దుకొని తిన్నారు.

భగవంతుడు చూపిన ఇంటికివెళ్ళి వాళ్ళేది పెడితే దాన్ని, ఎంత పెడితే అంతే తృప్తిగా తిని వచ్చేవారు. ఈ మహనీయుని మాట మానవులేమాత్రం పాటించినా కొదువలేని తృప్తి, శాంతి, ఆనందం అనుభవిస్తారు. "అయ్యా నాకు కష్టమంటే ఏమిటో సుఖమంటే ఏమిటో తెలియద"న్నారు. ఈ మహనీయమూర్తి ఇష్టాయిష్టాలను పూర్తిగా వదిలేసి భగవంతునికి సంపూర్ణశరణాగతి చేసి మానవోద్ధరణ చేసిన పుణ్యమూర్తి.

**డబ్బు లేకుండా జీవించడం:-** భగవంతునకు సంపూర్ణశరణాగతి చేసిన మహనీయుడు గనుక ఏనాడూ తన దగ్గర డబ్బు ఉంచుకోలేదు. తనకవసరమైన డబ్బు భగవంతుడే పంపుతారు అనేదే వారి ప్రగాఢ విశ్వాసము. జీవితాంతము అలాగే వారికి సమయానుకూలంగా అవసరమైన చార్జీలకు అయ్యే డబ్బు ఎవరో ఒకరి ద్వారా భగవంతుడే పంపేవారు. తన బృందమంతటికీ ఆహారపానీయాలు భగవంతుడే సమయానికి సమకూరుస్తుండేవారు.

**వైరాగ్యము:-** తనకు జబ్బు నయంచేశారని ఒక భక్తుడు విలువైన క్రొత్త దుప్పటి తెచ్చాడు, శ్రీస్వామివారు దాన్ని స్వీకరించలేదు. వద్దంటే వద్దని నిరాకరించారు. సేవకులలో ఒకరు దాన్ని తీసుకొన్నారు. మిట్ట మధ్యాహ్నం సిద్దలయ్య కొండ దిగుతూ ఒకచోట ఆగి తనకు క్రొత్త దుప్పటి కావాలని కోరారు. ఆ దుప్పటి ఇప్పుడు పనికొచ్చిందని ఆ సేవకుడు దాన్ని తెచ్చి సమర్పించాడు. ఆ దుప్పటిని రాళ్ళతో తెగకొట్టి జానెడు జానెడు పీలికలు చేయించారు. "అయ్యా ఈ పేలికలు జబ్బులోళ్ళకివ్వండి ఆ జబ్బులు పోతాయని" చెప్పారు. దుప్పటి తీసుకొన్న సేవకునికి అప్పటికైనా తెలివి కల్గిందో లేదో మరి.



మరొకప్పుడు ఒక భక్తుడు ఒక క్రొత్త జిప్‌బ్యాగ్ సమర్పించబోయాడు శ్రీస్వామివారుససేమిరా అంగీకరించలేదు. ఒకసేవకుడు ఆ బ్యాగ్ తీసుకొని అందులో తన గుడ్డలు పెట్టుకొన్నాడు. అందరినీ నిద్రపోనిచ్చి పరిగాడుతూ వెళ్ళి ఆ జిప్ బ్యాగ్ గుండంలో వేసి కాల్చేశారు. వినకుండా బ్యాగ్ తీసుకున్నందుకు ఆ సేవకుని గుడ్డలన్నీ కాలిపోయాయి. వైరాగ్యమంటే ఎలా ఉండాలో వారిని చూచే నేర్చుకోవాలి. ఎప్పుడూ మట్టి పాత్రలు, అల్యూమినియం దబర్లు, తాటాకు దొన్నెలు మాత్రమే వాడేవారు. తప్పని సరిగా పాతగుడ్డలు, పాతగోతాలతో తృప్తి చెందారు. ఈ మహనీయుని ఆచరణే సాధువులందరికీ ఆదర్శప్రాయమైనది.

**వైరాగ్యము:-** శ్రీస్వామివారు తిరిగే రోజులలో ఈనాడు మనకుండే డాక్టర్లు, వైద్యశాలలు ఉండేవికావు. దేనికైనా నాటు వైద్యాలే. పశువుల జబ్బులకు ఈనాడు వుండే వెటర్నరీ డాక్టర్లు, మందులు ఉండేవికావు. ఆనాడు మనుషులకుగాని, పశువులు, గొఱ్ఱెలు, మేకలకు గాని జబ్బులు వస్తే గ్రామలకు గ్రామాలే తుడిచి పెట్టుకుపోయేవి. అలాంటి భయానక పరిస్థితులలో శ్రీస్వామివారి దారము, సాంబ్రాణి, చీటీలే అన్ని జీవులకూ శ్రీరామరక్షగా ఉండేది. ఎక్కడికి వెళ్ళినా బంగారు పళ్ళెరములలో భిక్షనిచ్చేందుకు పోటి పడేవాళ్ళు. కానీ ఈ మహానుభావుడు భక్తి, విశ్వాసాలు, సత్ప్రవర్తనగల ఇండ్లకే వెళ్ళి వారు పెట్టింది తిని వెళ్ళేవారు. ముందుగా చెప్పి ఎవ్వరిళ్ళకూ భోజనానికి వెళ్ళేవారు కాదు.

అక్కిం వెంకట్రామిరెడ్డిగారు ఇలా చెపుతారు. ఒకరోజు సాయంత్రం 4 గం॥కు ఒక హరిజనవాడకు నన్ను తీసుకువెళ్ళి గుగ్గిళ్ళు అమ్మే ముసలామెను "అన్ని పిసుళ్ళు పొయ్యమ్మా"

అని అర్థించారు. పిసుళ్ళంటే రాగి సంగటి చేసిన కుండకు కరుచుకునే చెక్కులన్నమాట. ఇప్పుడే కుండ కడిగేశాను స్వామి అంటే - శ్రీస్వామివారు తన చేతి కర్రతో కుడితి తొట్టెను కలబెట్టి చేతులతో కుడితి తాకకుండా నేరుగా వంగి నోటితోనే నాలుగు గుక్కలు త్రాగి నన్నుకూడా త్రాగమన్నారు. నేనలాగే త్రాగాను. నాలుగు గుక్కలతో కడుపు నిండి తేపులొచ్చాయి. భక్తి శ్రద్ధలు గలచోట కుడితైనా త్రాగుతారుగాని భక్తి శ్రద్ధలు లేకుంటే పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టరు.

**వైరాగ్యం:-** ఒకరోజొక ఇంటికి మధ్యాహ్నం నన్ను తీసుకువెళ్ళారు. ఆమె మా ఇద్దరికీ ఒక చిన్న రాగిసంగటి ముద్ద ఇచ్చి ఇంట్లో ఏమీ సాదకము లేదని చింతాకుపొడి పోసే టెంకాయ చిప్ప ఖాళీగా చూపించింది. ఒక విస్తర చించి రెండు సగాలు చేసి రాగిసంగటి ముద్ద రెండు సగాలు చేసి విస్తారాకు ముక్కలలో వేయించి టెంకాయ చిప్పను వేలితో తుడిచి చింతాకుపొడి రెండు చోట్ల పూయమన్నారు. నేనలాగే చేశాను. ఆ చిన్న సంగటి ముద్దే మా ఇద్దరికీ కడుపు నింపింది. ఎవరి దగ్గరకెళ్ళినా పంచభక్ష్య పరమాన్నాలు దొరుకుతున్నా భక్తివిశ్వాసాలు లేకుంటే వారి దగ్గరకి వెళ్ళేవారేకాదు. వైరాగ్యమే మానవరూపందాల్చి శ్రీస్వామివారి రూపంలో దర్శనమిచ్చినట్లు ఉండేవారు.

**కఠోర నియమపాలన:-** నియమ పాలన చేస్తూ ప్రాణాంతకమైనపుడు నియమోల్లంఘన పనికిరాదు. ప్రాణాలను సయితము లెక్కచేయక నియమపాలన చేయాలని మానవాళికి, సాధకులందరికీ బోధిస్తున్నారు. ఆనాడు నీటిఆవిరి- బొగ్గురైళ్ళు. పాసింజర్‌రైళ్ళు ఎంతవేగంగా పోతాయో చెప్పడానికేలేదు. శ్రీస్వామివారి బృందం మద్రాసు రాష్ట్రంలోని రాజపద్మాపురం పోతున్నారు. ప్రయాణ తొందరలో శ్రీస్వామివారు గంజిత్రాగే



తాటియాకు రేక తీసుకపోను మరచిపోయారు. రైల్లో శ్రీస్వామివారిని గంజి త్రాగమంటే రేక అడిగారు. రేకలేదు స్వామి అంటే- గంజి వద్దు అన్నారు. అట్లాగే రెండు రోజులు ప్రయాణం చేశారు. ఈ రెండు రోజులూ సేవకులంతా భోంచేస్తున్నారు. శ్రీస్వామివారు మాత్రం నిరాహారిగానే యున్నారు. మూడవ రోజుకూడా రేకలేదు గనుక గంజి వద్దన్నారు. అప్పుడు బృందమంతా ఒక స్టేషన్‌లో రైలు దిగి ఎక్కడో కత్తి సంపాదించి తాటాకు కొట్టుకొచ్చి రేక కట్టి ఇస్తే గంజి త్రాగారు. రెండురోజులకు పైన నిరాహారిగా ఉంటే ప్రాణహాని అవుతుందనే భయమే లేదు. అదే కఠోర నియమపాలన. అలాంటి నియమపాలన లేనిదే ఆధ్యాత్మిక సాధనలో ఈషణ్మాత్రమైనా ప్రయోజనము లేదని చెపుతున్నారు.

ఒకరోజు శ్రీస్వామివారు తలుపూరులో పెమ్మసాని మస్తానయ్యగారి వేపచెట్టు క్రింద విడిది దిగి యున్నారు. ఉన్నట్లుండి కుండపోతగా వర్షం కురవసాగింది. సేవకులంతా సామానుతో సహా మస్తానయ్యగారింట్లోకి వెళ్ళారు. శ్రీస్వామివారు బయట తడిసిపోతున్నారు. కడపలో కూర్చొని కాళ్ళు బయట పెట్టుకోమంటారు సేవకులు. ససేమిరా కడపదాకా రానంటారు. ఆ ఇంటికి వరండా లేదు. శ్రీస్వామివారి శరీరమంతా తడిచి బురదమట్టితో నిండిపోయింది. శ్రీస్వామివారు గడగడ వణుకుతున్నారు. అయినా కడపవరకు వచ్చేందుకు నిరాకరించారు. అప్పుడు సేవకులు ఒక తాటాకు గూడ తెచ్చి స్వామివారి పైన పెట్టి వర్షానికి తడవకుండా చేశారు. కఠోర నియమపాలన అంటే ఎలా ఉండాలో సాధకులందరికీ ఒక సవాల్‌గా చూపించారు.

పంచభూతాలను అదుపుచేయగల్గిన శ్రీస్వామివారు వర్షం ఆపవచ్చుగదా అని మీరడుగవచ్చు. తన సేవకులు, సామానూ

క్షేమంగా ఇంట్లో ఉన్నారు. ఇక వర్షం ఎవరికొరకు ఆపాలి. ఒక్క తనకొరకు మాత్రమే గదా! తన ఒక్కని కొరకు ప్రకృతిసిద్ధంగా జరిగే సృష్టి క్రమాన్ని ఆపడం శ్రీస్వామివారి ధర్మనిర్ణయానికి సరిపోదు. గనుక వర్షాన్ని అలాగే కురవనిచ్చారు.

ఒకరోజు కలిచేడు సిద్దలయ్య కొండ దగ్గర ఒక బొంతచెట్టు క్రింద శ్రీస్వామివారు అగ్నిహోత్రము వేస్తున్నారు. ఎక్కడ ఎంతసేపు అగ్నిహోత్రము నిర్వహించాలో ముందు శ్రీస్వామివారికి తెలిసే వుంటుంది. మధ్యలో ఎన్ని అవాంతరాలు వచ్చినా ఆ అగ్నికార్యం మాననే మానరు. మధ్యలో వర్షం మొదలైంది. చెట్ల కొమ్మల సందులనుండి నీళ్ళు పడుతూ అగ్ని ఆరిపోతుంది. చిదుగులు పెట్టి మరొక ప్రక్కనుండి మంట రగిలిస్తున్నారు. మందిరం వరండాలో అగ్ని వేసుకునేందుకు ఎంత బ్రతిమాలినా రారు. "బొక్క బడుతుందయ్యా" అని మాత్రం అన్నారు. కష్టానికి వెరచి వరండాలోకి పోతే వరండా కప్పుకు బొక్కపడైనా అగ్ని సేవనమునకు అంతరాయం కలిగి తీరుతుంది. అగ్ని సేవనమునకు అంతరాయం కల్గించడమే పరమాత్మకు ఇష్టమైతే అలాగే జరిగి తీరుతుంది. శ్రమ అని మనం వరండాలోకి మారడం మంచిది కాదని తన కఠోర నియమాన్ని తెలిపారు.

శ్రీస్వామివారు ఒకప్పుడు పెన్నానదికి ఇసుక కట్టపోసి నీళ్ళు నిలిపే పనిలో ఉన్నారు. నెలల తరబడి ఇసుక నుండి బయటికిరారు. మోకాళ్ళ వరకు కాళ్ళు, మోచేతుల వరకు చేతులు భయంకరంగా పాచి ఉన్నాయి. అయినా ఆ పని నుండి ప్రక్కకురారు. భగవంతుడే అక్కడికి అన్నం పంపేవారు. నీళ్ళు ఆగి నీటి ప్రవాహం వెనుకకు మళ్ళితేనే ఆ పని నుండి విరమించుకునేవారు. కాళ్ళు చేతులు అంతలా పాచి ఉంటే సామాన్య మానవులు ఇక ఆ ఇసుకలో నిలబడలేరు. అదే వారి కఠోరనియమపాలన.



కలిచేడు ప్రాంతంలో వర్షాలులేవని దీక్షచేసి ఐదురోజులు రాత్రి పగలు ఆసనమైనా మార్చకుండా అలాగే కూర్చున్నారు. ఆహారపానీయాలు మానేశారు. గంజి త్రాగండి స్వామీ అంటే "అనుకున్న పని అయితే గదయ్యా త్రాగేది" అని అన్నారు. ఆ మహనీయుని చూచి కఠోర నియమపాలన ఎలా ఉంటుందో నేర్చుకోమంటున్నారు.

## ఆచరణ పూర్వక నిరహంకారం

అప్పటికి శ్రీస్వామివారు ఎలాంటి జబ్బులైనా నయం చేయగలరని, అందుకు వారెలాంటి మందులూ వాడరని, వారిచ్చే వేలిముద్రలకాగితంతోను, ఆశీస్సుల కాగితంతోను మానవునికుండే అన్నిరకాల బాధలు తీరుస్తున్నారని జనం భక్తితో వచ్చేవారు. కొన్ని రకాల కర్మల మూలంగా ఏ భక్తుడైనా తన బాధను భరించలేకుంటే వారి బాధను తన శరీరంపై తీసుకొని తాను ఆ బాధను అనుభవిస్తూ వారికి విశ్రాంతి కలిగిస్తున్న కరుణానిధి. మానవుల పాలిటి ప్రత్యక్ష దైవంగా ఉన్నారు. అట్టి అనుభవాలు పొందిన భక్తులు కూడా వారిని దైవ స్వరూపాలుగా గుర్తించి సేవించలేదు. నేను వారి బాధలు తీర్చాను గనుక వారు నన్ను గౌరవించాలని, పూజించి సేవించాలని శ్రీస్వామివారు ఏనాడు తలచలేదు. బాధ తీర్చుకున్న భక్తులనుండి ఏనాడు డబ్బు తీసుకొని ఎరుగరు. ఎప్పుడూ ఏక భిక్షతో తృప్తి చెందిన మహనీయుడు.

ఒకరోజు వేకువజామున చలమానాయుని ఇంటికి వచ్చి "ఏమి చలమానాయుడా! రాత్రి చినుకులు పడినే అన్ని సజ్జగింజలు చేలో చల్లితే పిల్లకాయలు కంకులైనా తినరా! లే లెయ్యవయ్యా అన్నారు." చలమానాయుడు మంచం దిగకుండానే సమాధానం

చెపుతున్నాడు "సజ్జవిత్తనాలు లేవు, ఏమీలేవు పోండి స్వామి" స్వామివారు స్వయంగా నాగలికట్టి గొర్రు, జడ్డిగము తగిలించి, చలమానాయుడి అత్తగారు సజ్జకంకులు రోటిలో వేసి దంచి తయారు చేసిన సజ్జలు తీసుకొని చేలోకి కదిలారు. విధిలేక చలమానాయుడు అయిష్టంగానే చేలోకి వచ్చాడు. శ్రీస్వామివారు దున్నుతుంటే చలమానాయుడు జడ్డిగంలో విత్తనాలు వేశారు. ఆవిధంగా వారు వేసిన ఆరు ఎకరాల సజ్జ గ్రామంలో ఎవ్వరికీ పండనంతగా అదర పండింది. ఎకరాకు పందుము పండే పంట పుట్లు పండింది. ఈనాడు ఏ జబ్బులు నయంచేయలేక పోయినా ఎవరిబాధలు తీర్చలేని స్వాములు, పరుల సొమ్ముతో పబ్బం గడిపేవారే గాని, శ్రీస్వామి వారి వలె ఇతరుల కొరకు నాగలి దున్ని సేద్యపు పనులు చేస్తారా? ఇలాంటి నకిలీ సాధువుల తియ్యని మాటలకు లొంగి ధనమే గాకుండా మానములు కూడా పోగొట్టుకొనుచున్న అమాయకులందరు శ్రీ స్వామివారి నిరహంకారము చూచి నేర్చుకోవాలి. ఎవరు నిజమైన సాధువు అవునో కాదో తెలుసుకోమంటున్నారు.

**చలమానాయుని కుమారుని మృతదేహాన్ని భూస్థాపితం చేయడం:**

ఒకప్పుడు చలమానాయుని ఐదేళ్ళ కొమారుడు చనిపోయాడు. తండ్రి దుఃఖ భారంతో ఉంటాడు గనుక శవాన్ని తండ్రిని తీసుకొని పోనివ్వరు. బంధువులెవ్వరూ శవాన్ని తాకేందుకు ముందుకు రాలేదు. ఆ సంకట స్థితిలో శ్రీస్వామివారు ఆ శవాన్ని తన భుజాన వేసుకొని వెళ్ళి ఏటిలో భూస్థాపితం చేసి వచ్చారు. పరుల కష్టార్జితంలో పబ్బం గడుపుతూ గడ్డాలు పెంచి కాషాయానికే కళంకం తెచ్చిన నకిలీ సాధువులందరూ ఎలా జీవించాలో చూచి నేర్చుకోమని శ్రీస్వామివారు ఆచరణతో బోధిస్తున్నారు.



## సర్వస్యశరణాగతి

శ్రీ రోశిరెడ్డిగారు ఎంతగొప్పగా శరణాగతి చేశారు అనేందుకు ఆయన జీవితమంతా ఉదాహరణే. శ్రీస్వామిసన్నిధి అనే గ్రంథంలో చూడవచ్చు. ఉదాహరణకు కండ్లు బొత్తిగా కనబడనిరోజుల్లో, కేవలం ద్రవాహారంతో జీవించే దశలో "రోశిరెడ్డీ! నేరుగా దోవపట్టుకొనిపో" అంటే శ్రీస్వామివారి మాటకు ఎదురు మాట్లాడకుండా ఏ గ్రామానికి పొమ్మంటారు అని కూడా అడగకుండా ఒకేఒక మానసిక ప్రార్థన చేశాడు. - "స్వామీ మీ ఆజ్ఞలను అర్థంచేసుకొని ఆచరించలేని అజ్ఞానిని. తమరు నాలో ప్రేరణపెట్టి మీ ఆజ్ఞలను మీకు ప్రీతి పూర్వకంగా ఆచరించేటట్లు నడిపించండి", అని మానసిక ప్రార్థనచేసి నెల్లూరు మూలాపేట బ్రాహ్మణ వీధినుండి అనేక మందిని మార్గము అడుగుతూ కన్నులు కనపడని గ్రుడ్డివాడు నడచి గొలగమూడికి వచ్చారు. వాళ్ళ అల్లుడు కొమారుడు రోశిరెడ్డిని ఇంటికి తీసుకపోవాలని బస్సులో వస్తున్నారు. ఈయన నడిచి వస్తున్నందున ఒకరినొకరు కలువలేదు. వాళ్ళు ఇంటికి వెళ్ళారు. పంటచేను వదలి పరిగ ఏరుకొనే దౌర్భాగ్యము నుండి తప్పించారు. అంత గొప్పగా సర్వస్యశరణాగతి చేశాడు. ఇంటికి పొయ్యి నిమ్మచెట్లు గుచ్చి పెట్టి రమ్మంటే-ఎన్నిచెట్లు గుచ్చమంటావు, ఏ చేలో గుచ్చమంటావు, డబ్బులెవరి దగ్గర తీసుకోమంటావు, అదెట్ల తీర్చమంటావు అనే ప్రశ్నలే లేకుండా, ఇంట్లో అందరూ నిమ్మచెట్లు వేయ వద్దని తగవులాడినా, అప్పుచేసి నిమ్మచెట్లునాటి వచ్చాడు. ఈనాడు కేవలం పంటవరకే ప్రతి సంవత్సరం మూడు లక్షలరూపాయల ఆదాయం వస్తుంది. రోశిరెడ్డిలాంటి సంపూర్ణ శరణాగతికి ఫలితం ఎలా ఉంటుందో తెలుసుకోండి అని మనలను చూచి నేర్చుకోమంటున్నారు.

అక్కిం వెంకట్రామిరెడ్డిగారు సర్వస్యశరణాగతి చేసి మంచి వర్షాకాలంలో కట్టెలు లేకుంటే తన పూరింటిని సగం పెరికి శ్రీస్వామివారి అగ్నిగుండానికర్పించిన ఉత్తమోత్తమ సేవకుడు.

అందుకే ఆయన ప్రమేయం లేకుండా "ఆరణాలు నీవు పెట్టుకుంటే పదణాలు పై వాళ్ళు పెడతారయ్యా" అని అందరి ప్రేరణతో సహకారంతో బ్రహ్మాండమైన మిద్దె కట్టించారు స్వామివారు. ఆగ్రామంలో కూలిచేసుకునే అక్కిం వెంకట్రామిరెడ్డిదే మొదటి మిద్దె. మిగిలిన వారంతా పూరిండ్లలోనే ఉన్నారు. గనుక సర్వస్య శరణాగతి ఎలా చెయ్యాలి, చేస్తే ఫలితం ఎలా ఉంటుంది అని మనందరినీ చూచి నేర్చుకోమంటున్నారు.

ఈ అక్కిం వెంకట్రామిరెడ్డిగారి కొమారునకు పిల్లనిస్తానని ఒకరెడ్డిగారు వచ్చారు. వెంకట్రామిరెడ్డి నడిగితే అక్కడే ఉన్న శ్రీస్వామివారు అంగీకరిస్తే నాదేమీ లేదన్నాడు. కట్నమెంత ఇస్తావని శ్రీస్వామివారడిగితే మీరెంత అడిగితే అంత ఇస్తానంటాడు. వివరం "స్వామి సన్నిధి" లో చూడవచ్చు. సంతానంలేదు వద్దంటారు శ్రీస్వామివారు. ఆ తర్వాత మరొకరు వచ్చి కోరినంత కట్నం ఇస్తానన్నా దానిని శ్రీస్వామివారు అంగీకరించరు. వెంకట్రామిరెడ్డి కోడలుగారి తండ్రి వచ్చి నేనేమీ ఇవ్వలేనంటే శ్రీస్వామివారంగీకరించి ముహూర్తాలు పెట్టించమంటారు. కానీ శ్రీ అక్కిం వెంకట్రామిరెడ్డిగారు ఆమెను ఇంతకు ముందు చూచి ఉన్నందున నల్లగా ఉన్న అమ్మాయని తన కొడుకు ఎర్రనివాడని - కాకి ముక్కుకు దొండపండువలె ఉంటుందని ఆ సంబంధము ఇష్టములేక వద్దని శ్రీస్వామివారికి చెపుతాడు. కానీ శ్రీస్వామివారు "బంగారమునకు వెలిగారం అతికినట్లు" ఉంటుందని మంచి దాంపత్యమని ముగ్గురు ఆడ,



ఇద్దరు మగ సంతానమని ఆ నల్లని అమ్మాయినే చేశారు. ఇప్పుడు వారి దాంపత్యం ఎంతో అన్యోన్యంగా, అందరికీ ఆదర్శప్రాయంగా మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది. గనుక కాబోయే ఏ వధూవరులైనా శ్రీస్వామివారికి శరణాగతి చేసి "స్వామీ తమరికి అన్ని విధాల నచ్చిన సంబంధం కుదర్చండి. మా ప్రయత్నాలు మేము చేస్తుంటాము. తమరు సర్వ సమర్థులు గనుక, మా పిచ్చి ప్రయత్నాలు జరుగకుండా మీ నిర్ణయమే జరిగేటట్లు కరుణించు తండ్రీ" అని శ్రీస్వామివారికి చెప్పుకోవడమొక్కటే ఉత్తమోత్తమ మార్గము. పై భక్తులకు శ్రీస్వామివారు చేసిన మేలును చూచి మనం నేర్చుకోవలసింది ఎంతైనావుంది.

ఇల్లు పెరికి అగ్నిహోత్రానికి సమర్పించిన గొప్పభక్తుడు కూడా ఇష్టాయిష్టాలు అడ్డం వచ్చి కాకి ముక్కుకు దొండపండులాగా ఉంటుంది ఆ అమ్మాయి వద్దని స్వామి నిర్ణయాన్ని కాదంటాడు. ఇక మనమెంత జాగ్రత్తగా ఉండాలో చూడండి.

వారీనాడు మన కండ్ల ఎదుట లేరుగదా ఇప్పుడెట్ల అనే అనుమానం రావచ్చు. నేను సర్వస్య శరణాగతి చేశానో లేదో నాకు తెలియదు. కాని ఒకటి మాత్రం యదార్థము. ఏమిటంటే వారి మాటకు వెంట్రుకవాసి తేడాగా నడుచుకున్నా ప్రాణాంత కమౌతుందని బాగా తెలిసి వచ్చింది. గనుక సాధ్యమైనంతగా వారి సహాయ సలహాల కొరకు ఎదురుచూస్తాము. "నన్ను ఆత్మప్రేరణ ద్వారా సరైన మీ ధర్మమార్గములో నడిపించు ప్రభూ అని ప్రార్థించుకొంటూ 'స్వామీ! తమరు సర్వసమర్థులు గనుక నాకేది మంచిదో అదే జరిగేటట్లు చేయండి మిగిలిన నా అజ్ఞాన ప్రయత్నాలన్నీ జరుగకుండా చేయండి తండ్రీ" అని ప్రార్థిస్తుంటాను.

నా కొమార్తె D.ఫార్మసీ చదివిన తర్వాత మూడు సంవత్సరాలు నిరుద్యోగిగా ఇంట్లో ఉంది. ఆమె స్నేహితులందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నేను రెకమెండేషన్ల కొరకు పోను. లంచాలు ఇవ్వను. మరి నా కొమార్తెకు ఉద్యోగం ఈ రోజుల్లో ఎలా వస్తుంది? ఈ మహత్తరమైన లీల హృదయగతమైతే ఆ మహనీయుడు మనకొరకు ఈ సృష్టి క్రమాన్నికూడా స్వల్పంగా మార్చుతారని తెలుసుకుంటారు.

మా టీచర్లందరిలోనూ నేను పిచ్చివాని క్రింద లెక్క. ఎందుకంటే అన్నింటికీ శ్రీస్వామివారినే నమ్ముతాను గనుక. ఉద్యోగ అవకాశాలు అనే కాలం చూడమని 'ఈనాడు' పేపరులో ఒక కాగితం నాకిస్తే వెంటనే నే నాకాగితం నలిపి వాళ్ళ మొకాన వేసి లేచి వెళ్ళిపోయేవాణ్ణి. శ్రీస్వామివారు ఇస్తే ఉద్యోగమొస్తుంది గాని పేపర్లు చూస్తే రాదు అనేది నా యోచన. ఇట్లా నన్ను అనేక మార్లు ఆట పట్టించేవారు. ఒక రోజు నెల్లూరు ట్రంకురోడ్డులో ఒక మిత్రుడు కన్పించి ఒకనెల క్రిందట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఫార్మాసిస్టు కావాలని ఒకపేజీ అంత అడ్వర్టైజ్ చేశారు చూడమన్నాడు. అతని సలహా ప్రకారం చూస్తే నిజమే. కానీ దానికి అప్లైచేసేందుకు ఒక్కరోజే టైంఉంది. ఆ అప్లికేషన్‌లో ఆనాడు రెండు విషయాలుండేవి. 1. ఈ అభ్యర్థి నడవడి మంచిది. రాజకీయములతో జోక్యము లేదు అని మేజిస్ట్రేటు సర్టిఫికేట్ ఇవ్వాలి. 2. ఈ అభ్యర్థి ఆరోగ్యముగా ఉన్నాడు అని ఒక MBBS గవర్నమెంటు డాక్టరు సర్టిఫికేట్ ఇవ్వాలి. ఇంట్లో మా అమ్మాయీ మిగిలినవారు "వృథాశ్రమ ఒక్కరోజులో ఇదికాదు" అన్నా వినకుండా నేను ప్రయత్నిస్తున్నాను. కాపురం వున్నది గొలగమూడి. అక్కడినుండి అరవై కిలోమీటర్ల దూరంలో కలిచేడులో ఉద్యోగం. రాత్రి 7 గం॥లకు నెల్లూరులో తెలిసిన డాక్టరు దగ్గరకు పోవాలంటే ఇంట్లో మా అమ్మ, అమ్మాయి ఇంటికి



దూరమైందని రాత్రివేళ తీసుకపోవద్దని తిడుతుంది. కాగితాలు తీసుకొని అమ్మాయి లేకుండా నేనొక్కడినే తెలిసిన గవర్నమెంటు డాక్టరు దగ్గరకు వెళ్ళాను. కేవలం స్వామి కృపవలన ఆయన ఇంటి దగ్గరున్నారు. పాపం వారు సెలవులో వున్నందున స్టాంపులేదు. శ్రీస్వామివారు ఆ డాక్టరును ప్రేరేపించి ఆయనే తన స్నేహితుని దగ్గర సంతకము చేయించి ముద్రవేయించారు. నేను వెళ్ళేసరికి స్నేహితుడైన ఆ డాక్టరు లేకున్నా పని జరుగదు. ఆయన తన స్నేహితుని దగ్గరకు రావాలి, వచ్చినా అతని స్నేహితుడు ఇంటి దగ్గరలేకున్నా పని జరుగదు. శ్రీస్వామివారు చేయించాలంటే అలాచేయిస్తారు.

రెండవది మేజిస్ట్రేటు సంతకం- తెల్లవారి నేను గొలగమూడి నుండి కలిచేడు పది గంటలకు వెళ్ళి స్కూలులో శెలవుపెట్టి, గూడూరు చేరేసరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. మేజిస్ట్రేటు దగ్గర ఈ స్టేట్ బ్యాంకు అప్లికేషన్ల మీద సంతకాల కొరకు వచ్చినవారు కిటకిటలాడుతున్నారు. ఇప్పుడొస్తున్నావే ఈరోజు ముందొచ్చిన మాకందరికీ సంతకాలు అవుతాయనే నమ్మకం లేదు. నీకేమి అవుతుందన్నారు. నేను మేజిస్ట్రేటుగారి బిళ్ళబంట్రోతును పిలిచి నేను అరగంట మాత్రమే ఉండగలను, నీవు ఎంతైనా తీసుకో స్టేట్ బ్యాంక్ అప్లికేషన్ మీద ఒక్క సంతకం చేయించాలి. ఎంత ఇవ్వమంటావు అన్నాను. అతను ఇంత అని అడగకుండానే రెండు నిమిషాలలో సంతకం చేయించి ముద్ర వేయించి తెచ్చి ఇచ్చాడు. నేను ఇరవై రూపాలిస్తే అతడు చాలా సంతోషించాడు.

ఇకపోతే అపాయింట్‌మెంట్ కొరకు వ్రాత పరీక్ష పాసయింది. ఇంటర్వ్యూ జరిగింది. కానీ ఆ ఇంటర్వ్యూలో గొప్ప అన్యాయం జరిగింది. ఎప్పుడూ సర్వీసులో ఉన్న బ్యాంకు ఆఫీసర్లను

ఇంటర్వ్యూకు ఆఫీసర్లుగా వేసేవారు. ఇప్పుడు రిటైరైనవారిని ఆఫీసర్లుగా వేశారు. వాళ్ళు పదివేలనుండి ఇరవైఐదు వేల వరకు ఒక్కొక్క పోస్టుకు వేలం పెట్టారు. ఇంటర్వ్యూలో మార్కులు ఒక్క అంకే వేసేది. రేపు లంచం తెచ్చిఇస్తే రెండవ అంకె వేసేది. మా అమ్మాయి లంచం ఇచ్చేందుకు అంగీకరించలేదు. వీళ్ళకు పదిహేను వేల రూపాయలు ఇచ్చేకంటే ఇంకొక పదిహేను వేల రూపాయలతో పెండ్లే చేసుకోవచ్చని చెప్పింది. లంచం ఇవ్వలేదు గనుక మాకేకాదు చాలామంది ర్యాంకులు సాధించిన వారికి కూడా ట్రైయినింగుకు సీట్లు రాలేదు.

ఎవ్వరేమనుకొన్నా మా కొరకే శ్రీస్వామివారు కలుగ జేసుకొన్నారంటాను నేను. కొంతమంది అభ్యర్థులు ఖర్చుల నిమిత్తం చందాలువేసుకొని, ఇక్కడ లంచాలు తీసుకొన్న విషయం ఢిల్లీ వరకు తీసుకు వెళ్ళి లంచాల విషయం నిరూపించారు. ఢిల్లీ ప్రభుత్వం స్టేట్ బ్యాంకువారి ఇంటర్వ్యూ మార్కులు తోసేసి వ్రాత పరీక్ష మార్కుల ఆధారంగా ఉద్యోగాలివ్వమని ఆర్డరువేస్తూ జరిగే ట్రైయినింగ్‌ను రద్దుచేసింది. వ్రాతపరీక్ష ఆధారంగా మా అమ్మాయికి స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగమొచ్చింది. ఇది కేవలం శ్రీస్వామివారి అవ్యాజనీయమైన కరుణకు ఉదాహరణ. విజయవాడ శ్రీనివాస్‌గారికి నోట్‌ఆర్డర్లు అయి, ఆర్డరు ఆయనకు ఇవ్వకుండా 12సం॥ గడిపారు. ఆయన ఒక్కపూట భోజనము చేస్తూ గొలగమూడిలో 10రో॥ దీక్ష చేయగానే ఉద్యోగంలో చేర్చుకున్నారు. శ్రీస్వామివారి శక్తిసామర్థ్యాలేమిటో చూచి నేర్చుకోమని గట్టిగా బోధిస్తున్నారు.

**నాకు ఇల్లు కట్టించారు:-** నాకొమార్తె పెండ్లి చేయాలని రెండు లక్షలు కష్టం మీద కూడపెట్టాను. వేరే ఏ ఆస్తిపాస్తులూ లేవు. జీతం రాకుంటే పస్తులుండాల్సిందే. "మీరుండగానే కొమారునికి



రెండంకణములైనా ఇల్లు కట్టి పెట్టండి. ఈరేకుల ఇంట్లో ఆశ్రమంవారు ఎప్పుడైనా ఆ నోరులేని బిడ్డను మీ తర్వాత ఉంచర"ని ప్రతి ఒక్కరిచేత చెప్పించసాగారు శ్రీస్వామివారు. వీళ్ళ బాధ ఎట్లా ఉన్నా ఇంట్లో నా భార్యది పెద్ద నస అయింది. విద్యానగర్‌లో శ్రీభరద్వాజ మాష్టరుగారు బలవంతంగా తన డబ్బు 998 రూ. పెట్టి ఒక ప్లాటుకొని నా భార్యపేరుతో రిజిష్టరు చేయించారు. దాన్ని అమ్మి గొలగమూడిలో రెండంకణముల ఇల్లు వేయాలనుకున్నాను. ఆ స్థలం అమ్మితే యాభైవేలు వచ్చింది. దానితో రెండంకణముల ఇల్లు వేయాలంటే ప్రస్తుతం కాపురముండే 9 అంకణముల ఇల్లు ప్రహరీ, బావీ అన్నీ అమర్చారు. అవన్నీ ఏర్పడడంలో ప్రతి అడుగునా ఒకలీల చేశారు. అందులో లక్ష రూపాయల ఖర్చు తప్పించినలీల చెప్పి ముగిస్తాను.

వాళ్ళ పిల్లలకు నేను చదువు చెప్పానని వాస్తు చెప్పే ఆయన నా దగ్గర డబ్బుతీసుకోడు. ఎంత చిన్న ఇల్లయినా ప్రస్తుతం కట్టుకో మొత్తం ఇంటికి ప్లాను వ్రాసిస్తానని వ్రాశాడు. మొదట పునాదులు పూర్తిగా కట్టు బిల్డింగు నీ యిష్టమొచ్చినప్పుడు కట్టమని ఆ పునాదుల ఖర్చు నేనే పెట్టుకుంటానని మా మామగారు వత్తిడి చేశారు. వడ్డీలేకుండా నిదానంగా అసలు ఇస్తానని అంగీకరించారు. ముగ్గుపోసి పునాదులు త్రవ్వబోతే 9 అంకణముల ఇంటికి ఒకే బండ ఉంది. ఎక్కడకూడా ఒక్క అంగుళం సందులేదు. గనుక పునాదులు త్రవ్వవద్దని ప్లింత్‌బీమ్ వేసి బిల్డింగ్ కట్టమని ఇంజనీర్లు సలహా ఇచ్చారు గనుక అది తప్పిపోయింది. ఇంటి ఖరీదులో 1/3 వంతు పునాదుల ఖర్చు ఉంటుందట అంటే లక్ష రూపాయలు మిగిలింది. ప్లాను మొత్తంలో ఒకే బండ ఉండడం శ్రీస్వామివారి మహిమేగాని వేరేమీ నేను నమ్మను.

**రెండవ లీల:-** నా పాత విద్యార్థికి బేలుదారి పని తెలుసు. అతను శ్రీస్వామివారికి కంటేపల్లి నుండి భిక్షాన్నం తెస్తున్నాడు. నేను ఇల్లు కడుతుంటే ఇక్కడ ఉచితంగా పనిచేస్తానంటే నేనంగీకరించక శ్రీస్వామివారి నిత్యభిక్షా కార్యక్రమం అయిపోయాక మధ్యాహ్నం వేళ వచ్చిచేయమన్నాను. కానీ ఇతను శ్రీస్వామివారి దగ్గర మూడు చీట్లు పెట్టాడు. 1. సుబ్బరామయ్యకు పనిచేయడం. 2. కంటేపల్లి నుండి భిక్షాన్నం తేవడం. 3. గొలగమూడి నుండి వెళ్ళిపోవడం. సుబ్బరామయ్యకు పనిచేయమనే చీటీ వచ్చింది. అతను వచ్చి కేవలం అన్నంమాత్రం తిని మిద్దె పని పూర్తిచేశాడు. అతని ఒక్కనికైనా కూలి యాభైవేల రూపాయలు మిగిలింది. ఈ ఇంటినిర్మాణంలో శ్రీస్వామివారు పునాదులకు లక్ష బేలుదారి మేస్త్రికి యాభైవేలు, మొత్తం లక్ష యాభైవేల రూపాయలు లేకుండా చేశారు. ఆ మహనీయుని సహాయం లేకుంటే నేను 9 అంకణములకు బదులు 2 అంకణముల ఇల్లు మాత్రమే కట్టగలగేవాణ్ణే. వేసవిలో బావిలో నీరులేకుంటే ఒక మిత్రుడు నీరు తోలి పని ఆగకుండా చేయించడం కూడా శ్రీస్వామివారి దయే. నీరు తోలినందుకు ఆ మిత్రుడు పైసా డబ్బుతీసుకోలేదు. ఆ మిత్రుని పేరు ఉడతా రమణయ్య. వీరే రైలుక్రిందబడినా బ్రతికి బట్టకట్టిన మహనీయుడు.

శ్రీస్వామివారు లక్షయాభైవేల రూపాయలు సహాయం చేయడమేగాక అడుగడుగునా వచ్చే ఎన్నో అవాంతరాలను తప్పించి నాకు నీడనేర్పాటు చేసిన కరుణామయునకు నేనేవిధంగానూ ఋణంతీర్చుకోలేను. శ్రీస్వామివారిని సంపూర్ణ విశ్వాసంతో నమ్మండి శరణాగతి చేయండి - ఫలితాలు చూచినేర్చుకోండి అని మానవాళికి బోధిస్తున్నారు.



సంపూర్ణ శరణాగతి చేసినా అన్నీ పూలబాటమీద నడిచినట్లు ఉండవు. ఇబ్బందులు వస్తూనే ఉంటాయి. శ్రీస్వామివారి కృప వల్ల తప్పక తొలిగి పోతాయి. కొండంత అనుభవించాల్సి ఉంటే గోరంత అనుభవంతో తొలిగించితీరుతారు. ఇది నా అనుభవము. అవన్నీ వ్రాస్తే ఒక పెద్ద గ్రంథమవుతుంది. బ్రహ్మవ్రాత తప్పించవీలు లేదు అనే మెట్టవేదాంతపు మాట సోమరులకు, భక్తిహీనులకు, పిచ్చినాస్తికులకు సరిపోతుంది. కానీ ఆత్మజ్ఞానులైన మహనీయులను తగువిధంగా ఆశ్రయించిన వారికి పొసగదు. తగువిధంగా జ్ఞానిని ఆశ్రయించడం ఎలాగో జ్ఞానేశ్వరి భగవద్గీత 7వ అధ్యాయము 14వ శ్లోకం యొక్క వివరణ చివర చూడవచ్చును. శ్రీస్వామి వంటి మహనీయులు బ్రహ్మవ్రాతను నాలుగు విధలుగా తప్పిస్తారు.

1. కొండంత అనుభవించవలసి ఉంటే గోరంతగా అనుభవింపజేసి మిగతా కర్మను తప్పిస్తారు.
2. కర్మల స్వభావానిబట్టి మనకర్మను సంపూర్ణంగా దహించివేసి ఆ కర్మల నీడైనా మనపై బడకుండా చేయవచ్చు.
3. తప్పనిసరిగా అనుభవించ వలసిన కర్మ అయితే ఈ జన్మలోనే భవిష్యత్తులో మరొక రోజుకు మార్చవచ్చును. లేదా రాబోవు జన్మలకైనా మారుస్తారు. ప్రస్తుతం అజ్ఞాన దశలోనున్నవాడు కొంత జ్ఞానం ఆర్జించాక ఇక కష్టాలకు చలించని స్థితిలో తన గతకర్మ అనుభవమతున్నా చలించడు.
4. మనకర్మను స్వప్నాల ద్వారా అనుభవింపజేయ వచ్చును.

నేను శ్రీస్వామివారిని తాకానని, శ్రీస్వామివారికి సేవచేశానని, శ్రీస్వామివారిని దర్శించానని ప్రజలీనాడు వారి అజ్ఞానము వలన నన్ను గౌరవిస్తున్నారు. కానీ ఎన్నో ఈగలు వారిని తాకాయి. ఎన్నో చీకటీగలు వారి రక్తాన్ని త్రాగాయి, ఎన్నో కుక్కలు వారి ప్రసాదము తిన్నాయి. అవే నాకంటే గొప్పవనుచున్నాను. ఎందుకు? అవి

నిరంతరము నాలాగా ఇతరులను గురించి విమర్శించవు. ఇతరులను గూర్చి చెడ్డభావాలు కలిగియుండవు. ఇతరులకు సందు దొరికినప్పుడు కీడు చేయాలని ప్లాన్లు వేయవు. కానీ మానవజన్మనెత్తి, సాటిలేని సద్గురుసన్నిధికి వచ్చి, సాటిలేని అనుభవాలు, ఆశీస్సులు పొందాను. ఒక్క సద్గురువు నుండి కాదు శ్రీశ్రీశ్రీ పూండిస్వామివారి నుండి, శ్రీరంగన్నబాబుగారు, శ్రీరామిరెడ్డితాత, శ్రీనాంపల్లిబాబాగారు, శ్రీమాయి అమ్మ, శ్రీఅనసూయమాత, శ్రీచివటంఅమ్మ, శ్రీగులాబ్‌బాబా, శ్రీసుధీంద్ర బాబుగారు, శ్రీ భరద్వాజమాష్టరుగారు, శ్రీకేశవయ్యస్వామిగారు, శ్రీజిల్లేళ్ళమూడిఅమ్మ, శ్రీముమ్మిడివరం బాలయోగి, శ్రీశిరిడిసాయి, శ్రీదర్గాస్వామి వంటి గొప్ప మహనీయుల దర్శన, స్పర్శన, సంభాషణలద్వారా ఆశీస్సులను పొందినా నాలో ఎలాంటి మార్పురాలేదు. ఆ మహనీయుల స్పర్శవలన ఒక కిలో భారం పోతుంటే పరధూషణ, రాగద్వేషాది చెడుగుణములద్వారా నిరంతరము లారీల కొలది ఇతరుల పాపాలు నా నెత్తి కెక్కించుకుంటూ పాప భారంలో కూరుకుపోతున్నాను. నా పుణ్య మంతా ఖర్చయి పరులలెక్కలో చేరడం తద్వారా నేను రిక్తహస్తాలతో మిగిలిపోయే రోజు దగ్గరవుతుంది. ఇప్పటికైనా కళ్ళు తెరిచి సరైన మార్గములో మిగిలిన కొద్దిజీవితమైనా గడపమంటున్నారు శ్రీస్వామివారు.

తన ప్రక్కనే లోకాభిరామాయణము, పరనింద వంటివాటిని పంది మలభక్షణ చేస్తున్నట్లు చేస్తున్నా శ్రీస్వామివారు ఏనాడూ ఇట్లామాట్లాడరాదని చెప్పియుండలేదు. వారి వాక్‌మౌనము, మనో మౌనములను చూచి నేర్చుకోమంటున్నారు.

ఈ మహనీయుని దివ్యసమాధి దర్శించుట ద్వారాను, ఈ పవిత్ర పుణ్యభూమిలో అడుగు పెట్టడంద్వారా పదిపైసల



పుణ్యమార్జిస్తూ కూడా ఇక్కడికి వచ్చి పరనింద ద్వారా అంతకు నూరురెట్లు పాప ఫలం నెత్తినేసుకొంటున్నాము. మహాత్ముల దర్శనం పుణ్యం, స్పర్శనం పాపనాశనం అనే మాటలో సత్యం నూటికి నూరుపాళ్ళున్నా మన చెడుపనుల ద్వారా మనకు పుణ్యము కంటే ఎక్కువచెడు ప్రాప్తిస్తుంది.

శ్రీస్వామివారి సేవకులలో పోలిరెడ్డి అనే వారొకరుండేవారు. వీరు నిర్యాణము చెందుటకు ముందు "నలభైవ రోజున దేవుడు విచారణకు వస్తాడు, ఆరోజు నేనేకాదు మీరుకూడా గంగ ముట్టకూడదు." అని శ్రీస్వామివారు చెపుతారు. అదే నలబయ్యవ రోజు పోలిరెడ్డిగారు కాలధర్మం చెందారు. ముప్పై కిలోమీటర్ల దూరంలో మైపాడు దగ్గరున్న శ్రీస్వామివారు ఎవరి పిలుపు లేకుండానే గంగ ముట్టకుండా గొలగమూడి వచ్చి పోలిరెడ్డి దేహాన్ని వారి స్వహస్తములతో సమాధి చేసారు. వారి అంతిమక్రియలపట్ల శ్రీస్వామివారు అంత శ్రద్ధ చూపారు గనుక వారికి సద్గతి కలిగించారని అర్థము. ఎవ్వరికీలేని అంతటి భాగ్యమాయనకు ఎందుకు కల్గింది. ఎవరేమి చెప్పినా వినడు. కానీ చెప్పవద్దు అని చెప్పేవాడుకాదు. అవతలవారు చెపుతుంటే ఈయన వింటున్నట్లుగా ఊకొడుతుంటాడు. కానీ వారు చెప్పేమాటకు ఈ ఊకొట్టేందుకు సంబంధమే ఉండదు. ఈయన మనం చెప్పేది వినడంలేదని ఆ చెప్పేవారు తెలుసుకొని వెళ్ళిపోయేవారు. ఆ విధంగా పరదూషణగాని, విమర్శగాని వీరు ఏమాత్రము దగ్గరకు రానివ్వలేదు. తన కాలమంతా నామస్మరణలో గడిపాడు. స్వామిని ఏ కోరిక లేకుండా నిష్కామంగా సేవించాడు గనుకనే వారి చేతులతో సమాధి చేయించుకున్నాడు. ఆ విధంగా మనందరినీ జీవించమని శ్రీస్వామివారు చూచి నేర్చుకోమన్నారు.

శ్రీస్వామివారికి గల ఎంతోమంది సేవకులలో ఒక వక్కెమ్మగార్కి మాత్రమే "వక్కెమ్మ ఇక వచ్చేదిలేదని దేవునిమీద ఆనపెట్టి వ్రాయయ్యా" అని చీటి వ్రాయించారు. మిగిలిన సేవకులకు ఎవ్వరికీ అలాంటి దివ్యమైన ఆశీస్సులచీటీ లభించలేదు. ఎందువలన? అందరు సేవకులు సేవచేస్తూ పుణ్యమార్జిస్తున్నారు. కానీ నోరు, చెవులు, మనస్సు ద్వారా విమర్శలు, నిందలు చేస్తూ గొప్పగా ఇతరుల చెడుకర్మలు తమ నెత్తిమీదకు తెచ్చుకుంటున్నారు గనుకనే ఈ మహాతల్లిగారికి వ్రాసిచ్చిన అభయ ప్రధానచీటీ మరెవ్వరికీ వ్రాయించి ఇవ్వలేదు. దీనినే చూచి నేర్చకోమని ఆమెలాగ మన ప్రవర్తన సరిదిద్దుకోమని శ్రీస్వామివారు బోధిస్తున్నారు.

శ్రీస్వామివారి సేవకుల ప్రవర్తన బాగా తరచిచూస్తేగాని మనకు కొంతైనా అర్థంకాదు. మల్లిక వెంకయ్యగారు, వక్కెమ్మగారు, జాతకాల రామానాయుడుగారు, పోలిరెడ్డిగారు తక్కిన సేవకులకంటే నూటికి నూరుపాళ్ళు ఈ దుర్విమర్శలకు దూరంగా తమ నోటిని కట్టేశారు. నాతో ఎప్పుడు మాట్లాడినా శ్రీస్వామివారి గూర్చి మాత్రమే మాట్లాడేవారు. ఎవరినిగురించైనా నేనడిగి నప్పటికీ నాకేమీ తెలియదని చెప్పేవారు. గనుకనే వారు పూర్తి ప్రజ్ఞ, స్మరణలతో శ్రీస్వామివారి సన్నిధి చేరారు. ఇది చూచి సత్పురుషులను ఎలా సేవించాలో అనేది నేర్చకోమంటున్నారు. పరనింద వలన మన సేవద్వారా ఆర్జించిన పుణ్యమంతా విషంబొట్టు కలిసిన పాలవలె మనకు చెడ్డే లభింపజేస్తుంది. దీన్నిజాగ్రత్తగా గమనించి నేర్చకొని ఆచరించమంటున్నారు.

శ్రీస్వామివారి సన్నిధిలో అతి సమీపంలో తన ప్రక్కనే లోకాభిరామాయణం, పరనిందలాంటి పనులు చేస్తున్నా ఎప్పుడూ చేయవద్దని చెప్పలేదు. వారి లోకం వారిది, మన లోకం మనది



అన్నట్లు వ్యవహరించేవారు. దాన్ని మనలను చూచి నేర్చుకోమంటున్నారు.

ఎప్పుడూ వెళ్ళని ఒక గ్రామానికి పోవాలని శ్రీస్వామివారు తొందర చేయసాగారు. "ఆ గ్రామానికి వద్దు స్వామి! ఆ గ్రామస్తులకు మనం తెలియదు గనుక మనకు కట్టెలవిషయం చాలా ఇబ్బంది కలుగుతుంది, ఆ గ్రామానికి వెళ్ళవద్ద"ని తన సేవకులంతా చెపుతున్నారు. కానీ శ్రీస్వామివారు "మనకే ఇబ్బందీ ఉండదయ్యా" అని చెప్పి ఆ గ్రామం తీసుకువెళ్ళారు. అప్పుడు శ్రీస్వామివారు నడుస్తున్నారు. సేవకులంతా పూర్వకాలపు గోతాపు సంచులలో వారివారి సామాను పెట్టి ఆ సంచి భుజానికి తగిలించి వీధుల వెంబడి శ్రీవారితో నడుస్తున్నారు. ఆ గ్రామస్థులు "అయ్యా, మీరేమి పనిచేస్తారు" అని అడిగితే వీళ్ళు "దబరలు, బిందెలకు మాట్లు వేస్తామ"ని చెప్పారట. అంటే వారి వేషాలలా ఉన్నాయి. బాగా మాసిన గడ్డాలు, తైల సంస్కారంలేని తలలు, నీరు కావి పట్టిన గుడ్డలు. శ్రీస్వామివారు ఒక చెట్టుక్రింద విడిది దిగారు. "నిప్పు చూడండయ్యా" అని తన మామూలు పాట పాడారు శ్రీస్వామివారు. "స్వామీ! ఈ క్రొత్త గ్రామంలో మనకు కట్టెలెవరిస్తారు, ఏం చేద్దాం స్వామీ" అన్నారు సేవకులు. అయ్యా ఒకచీటీ వ్రాసుకోమని తన మామూలు పరిభాషయైన కోట్లు పడగలు, అర్బుదాలు, నిర్బుదాలు అని ఒక చీటి వ్రాయించి, "అయ్యా ఈ దోవన్నేపోయి అక్కడ రచ్చమీద పదిమంది కూర్చొనుంటారు. వాళ్ళ చేతికి ఈ కాగితం ఇచ్చిరా. మనకు కట్టెలు వస్తాయి" అని చెప్పారు. కాగితం తీసుకుపోయిన సేవకుని మీదేవూరు ఎందుకు వచ్చావని అడిగితే ఆయన ఆ కాగితం వారిచేతికిచ్చాడు. ఒకతను కాగితం పెద్దగా చదివాడు. ఒక్కనికి తప్ప తక్కిన వారెవరికీ ఆ చీటీ ఏమిటో తెలియలేదు.

ఆ తెలిసినవాడు "ఒరేయ్ ఆయన గొప్ప మహనీయుడురా! ఆయన రోజుకు రెండు మూడు బళ్ళ కట్టెలు గుండమేస్తారు. ఆయనకు కట్టెలుంటే చాలు అన్నమాటే అనుకోడు" అని చెప్పగానే అందరూ లేచి వెళ్ళి ప్రక్కవాళ్ళకుకూడా చెప్పి పనికిరాని నాగళ్ళు, మంచంకోళ్ళు లాంటి రకరకాల కొయ్యలు ఐదు బండ్లకు ప్రోగువేశారు. శ్రీస్వామివారు ఆనందంగా ధునివేస్తూ కూర్చున్నారు. సేవకులందరికీ కమ్మనిభోజనాలు ఒక్కొక్కరికి ఒక్కొక్క ఇంటిదగ్గర పెట్టారు. శ్రీస్వామివారికి వారుండేచోటుకే దైవం భోజనం పంపినట్లు ఎవరో తెచ్చిపెట్టారు. ఆవిధంగా శ్రీస్వామివారికి దైవంపై గల సంపూర్ణవిశ్వాసం నిరూపించబడి సేవకులకు కొంతకు కొంతైనా అర్థమైంది.

ఒకరోజు శ్రీస్వామివారు "నరసింహులుకొండకు పోవాలి వెంటనే బస్సెక్క"మన్నారు నెల్లూరులో. చార్జీలకు డబ్బులేదు స్వామీ అంటే, డబ్బువస్తుంది మీరు వెంటనే బస్సెక్కమని తొందరచేశారు. ఇకచేసేదిలేక బస్సెక్కి కూర్చున్నారు. బస్సు కదలబోతుంది. మధ్యతోవలో బస్సెక్కడ దింపేస్తారో, చార్జీకి చేతిలో చిల్లిగవ్వలేదని సేవకులు చాలా కంగారు పడుతున్నారు. బస్సు స్టార్ట్ కాబోయేటప్పుడు మాకాని వెంకట్రావు సైకిల్మీద పోతూ వీళ్ళనుచూచి బస్సాపి, మాట్లాడి, డబ్బిచ్చి వెళ్ళాడు. భగవంతునిపై విశ్వాసముంచితే పనులెలా జరుగుతాయో, మనం విశ్వసించడం ఎలాగో శ్రీస్వామివారు మరలా మరలా బోధిస్తున్నారు.

ఒకరోజు తలుపూరులో అన్నం ఉడుకుతుంది. శ్రీస్వామివారు వెంటనే మరొక గ్రామానికి ప్రయాణం కమ్మని తనవారిని తొందర పెడుతున్నారు. వీలులేక ఉడికే అన్నం ప్రక్క గృహస్థులకు వప్పచెప్పి బస్టాండుకు వచ్చారు. బస్సు వస్తే ఆ బస్సు



ఎక్కనివ్వకుండా మరొక బస్సు అని ఆపేశారు. ఇంతలోనే పొట్టేపాళెం భక్తురాలు కారులో వచ్చి తాను గంపతో తెచ్చిన వడలు, పులిహోర, పాయసం తృప్తిగా తినబెట్టి అవసరానికంటే ఎక్కువగా దక్షిణ సమర్పించివెళ్ళారు. భగవంతుడంటే ఎలాఉంటాడో చూడమని నేర్పుతున్నాడు. భగవంతుడు శ్రీస్వామివారి రూపంలో ఉన్నాడని నేర్చుకోమని నాడు వారికి, నేడు మనందరికీ నేర్పుతున్నారు.

పై లీలలన్నింటిద్వారా సద్గురుని మాటకు ఎదురు చెప్పకుండా ఆచరించే సంస్కారము నేర్చకోమని మానవాళికి "చూచి నేర్చకోమని చెపుతున్నారు."

**భిక్షాన్నం**:- తమకోరికలు తీరినవాళ్ళు శ్రీస్వామివారి సన్నిధిలో అన్నసంతర్పణలు చేసేవారు. అలాంటి రోజులలో కూడా నియమంగా భిక్షాన్నము తేవల్సిందే. "ఈ రోజు వీళ్ళు పెట్టారని భిక్షకు పోకుంటే రేపు పెట్టరయ్యో" అనేవారు. నేనీరోజు శ్రీస్వామి వారి సేవ కొంతకాలము చేశానని మీరందరూ నన్ను గౌరవించ వచ్చు. కానీ నేను శ్రీస్వామివారిని చూచి ఏమి నేర్చుకొని ఏమి ఆచరిస్తున్నానని? ఏమీలేదు. కోటానుకోట్లమంది గోచిగుడ్డలేక అలమటిస్తుంటే ట్రంకు పెట్టెలలో బీరువాలలో పట్టు వస్త్రములు దాచిపెట్టిన నేను చినిగిన పాతగుడ్డలు ధరించిన శ్రీస్వామివారిని చూచి ఏమి నేర్చుకున్నానని మీరు భ్రమపడుతున్నారు?

"ఆశ్రమాన్ని కనిపెట్టుకొని ఇరవైమందిమి ఉన్నాము స్వామి, మీరు చాటుకుపోతే మాగతేమిటి" అన్నవారితో "అయ్యా! ఈ పండేదంతా ఎవరిదనుకున్నావు?" అంటే ఈ పండేదంతా నాదేనని చెపుతున్నారు. నాదేనంటున్నారు గనుక నేను నా వాళ్ళు మాత్రమే తినాలని అర్థమా? నా వాళ్ళంటే - ఈ విశ్వమంతా ఆయన బిడ్డలే. అందరికొరకు పండిస్తున్నారు. అందరూ పంచుకోండి. బేధ బుద్ధి

స్వార్థ బుద్ధులతో దాచకండి - దేవుని పేర దాన ధర్మాలు చేయమంటున్నారు.

వెంకయ్య పేరుమీద పిడికెడు మెతుకులు ఆకలైన వారికి పెట్టమని ఆ మహనీయుడు సమృద్ధిగా ఏకొరతా లేకుండా తెస్తుంటే మనం ఆ వస్తువులను ఆకలిగొన్నవారికి వినియోగించకుండా బ్యాంకుకు పంపి కాగితాలుగా మారుస్తున్నాము. అనేక కారణములవలన శ్రీస్వామివారి సేవకుడననుకొనే నేను నోరు విప్పకుండా ఉంటున్నాను. "ఒరేయ్" అన్నందుకే మూడువందల పాపం వ్రాశారు. ఈనాడు ఆకలిరూపంలోనున్న శ్రీస్వామివారికి వారి సొమ్ము వారికి సమర్పించకుండా కాగితపు ముక్కలుచేసి బ్యాంకులో పెట్టుకునే నన్ను మీరంతా గౌరవించినా నన్ను శ్రీస్వామివారు పాపం బారినుండి రక్షిస్తారా? నాకు సరైన మార్గము చూపి నడిపించమని ఆ మహనీయుని వేడుకొనుచున్నాను.

**శ్రీస్వామివారు ప్రశ్నలు చెప్పడం, చీట్లు వ్రాయించి ఇవ్వడంలో వరుసక్రమం పద్ధతి అవలంబించారు.**

ఒకప్పుడు తులసమ్మ కొమారుడు నారాయణరెడ్డిగారు ఏదో ప్రశ్న అడగాలని శ్రీస్వామివారి సన్నిధికి వచ్చారు. అదేరోజు మరొకరుగూడా నెల్లూరు నుంచి ప్రశ్న అడగాలని వచ్చారు. ఆరోజంతా శ్రీస్వామివారు మన ప్రజ్ఞలోకి రాలేదు. గనుక ఆ భక్తుడు ఇంటికి వెళ్ళిపోయి మరురోజు వచ్చాడు. కానీ నారాయణరెడ్డిగారు మాత్రం ఇల్లు వాకిలి తన పనులన్నీ వదలుకొని శ్రీస్వామివారి సన్నిధిలోనే మూడు రోజులున్నాడు. కాని శ్రీస్వామివారు మన ప్రజ్ఞలోకి రాలేదు. ఈ నెల్లూరినుండి వచ్చిన వ్యక్తి ప్రతిరోజు ఇంటికి వెళ్ళి తెల్లవారి వస్తున్నాడు. నాల్గవరోజు శ్రీస్వామివారు మన ప్రజ్ఞలోకివచ్చి ప్రశ్నలు చెప్పబోతుంటే, శ్రీస్వామి సేవకులు ఆ నెల్లూరు వ్యక్తి విషయం చెప్పమని



అడిగారు. అప్పుడు శ్రీస్వామివారు అవలంబించిన పద్ధతి మానవాళికే శిరోధార్యము. "ముందొచ్చిన వాళ్ళకు ముందు చెప్పవద్దాయ్యా" అని శ్రీనారాయణరెడ్డిగారికి ముందు చీటీ వ్రాయించారు. నారాయణరెడ్డి నాలుగు రోజులుగా శ్రీస్వామివారి సన్నిధిలోనే తన పనులన్నీ వదులుకొని పడిగాపులు కాస్తున్నాడు గనుక అయన ముందొచ్చాడని అర్థం. నెల్లూరు వ్యక్తి ప్రతిరోజు ఇంటికి పోతున్నాడు గనుక ఆయన ఈరోజునే వచ్చాడని లెక్క. ఈ నాడు అజ్ఞానం వలన అందరూ నన్ను శ్రీస్వామివారి శిష్యుడని పిలుస్తూ గౌరవ మర్యాదలిస్తున్నారు కాని ముందు వచ్చిన వారికి ముందు చెప్పాలగదయ్యా" అనే మాట నేననగల్గుచున్నానా? లేదు. డబ్బు, హోదా, కార్లుగల వారు వెనుక వచ్చినా అందరికంటే ముందు దర్శనానికి పంపుతున్నాను, వారికి స్పెషల్ మర్యాదలు చేస్తున్నాను. మరి నేను శ్రీస్వామివారిని చూచి ఏమి నేర్చుకున్నానని? పాపభారం తప్ప ఇంకేమీ లేదు.

భగవంతుడు నిజంగా మన నుండి కోరేవి 1. మన కాలము 2. మన మనస్సు. అనేక జన్మల సంస్కార బలం వలన మనసు భగవంతునిపై లగ్నంచేయాలని ప్రయత్నించినా అది తన తిరుగుబోతు తనం సులభంగా వదలలేదు. కానీ కాలము భగవంతునకు సమర్పించుటకు ఏ ఆటంకములేదు. ఆటంకములన్నీ మనం కల్పించుకొనేవే. నిత్యం ఒక నిర్ణీత కాలములో సాధ్యమైనంత సేపు మన కాలము దైవానికి సమర్పిస్తూ, సాధ్యమైనంతగా మనసును వారి తలపులతో నింపుకునే తీవ్రమైన హృదయపూర్వక ప్రయత్నం నిత్యం ఆ నిర్ణీత కాలంలో చేస్తుంటే సర్వం చక్కబడుతుంది. భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారు నిరంతరము మన ప్రక్కన ఉంటారు.

ఆ మహనీయుడు కోరేది నిజంగా మన కాలమే అనేందుకు ఒక చక్కని అనుభవము. ఖమ్మం జిల్లా, దమ్మపేట గ్రామస్తుడు D. నాగేశ్వరరావు టీచర్‌గారు గత ఆరు సంవత్సరములనుండి ప్రతినిత్యం ఉదయం 4 గం॥ నుండి 61/2 గం॥ వరకు ఆ గ్రామమందిరంలో ఉంటానని చెప్పుకొని అలా ఉంటున్నాడు. ఒకవేళ ఏరోజైనా ఒక నిమిషం ఆలస్యంగా మందిరానికి వచ్చినా ఆ రోజంతా ద్రవాహారముగాని ఘన పదార్ధముకానీ తీసుకోకుండా మంచినీళ్ళు త్రాగే ఉంటున్నాడు. అట్లా రెండుమూడు మార్లు తన తప్పుకు తానే శిక్ష విధించుకొని ప్రాయశ్చిత్తము చేసికొన్నాడు. ఈమధ్య వారిని ప్రక్క గ్రామానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. మందిరం నుండి రెండు నిమిషాలు ముందుగా ఇంటికి వెళ్ళాడు. రెండవరోజు కూడా అలానే వెళ్ళాడు. రెండవ రోజు రాత్రి కలలో శ్రీ వెంకయ్య స్వామివారు వీరిని చొక్కా కాలరు పట్టుకొని మందిరం బయటనుండి లోనికి లాకొచ్చి మందిరంలోని గోడగడియారము చూపుతున్నారు. ఆ గడియారం 6 గం. 28ని॥ అయి ఉంది. ఈ స్వప్నం వచ్చినప్పుడు నిజంగా రాత్రి 1గం॥ ప్రాంతము. తాను రెండు నిమిషములు ముందు పోవడమే దోషమని శ్రీస్వామివారు ఈ స్వప్నంద్వారా బోధించారని తెలుసుకున్నారు. ఈ నాగేశ్వరరావుగారి మరియొక అనుభవం చూడండి.

ఒకరోజు వీరి మామగారు ప్రక్క గ్రామంలో స్వర్గస్తులయ్యారు. ఇంటిల్లపాది అందరూ ఇంటికి తాళం వేసి వెళ్ళారు. దొంగ మారుతాళంతో తలుపు తీసి పట్టపగలు ఇంట్లో ప్రవేశించి బీరువా తెరచి అన్ని వస్తువులు ఇల్లంతా పరచిపెట్టి తలుపులు మూయకుండానే వెళ్ళిపోయాడు. మరి కొంతసేపటికి మరొకరు వచ్చి ఎంత పిలిచినా ఇంట్లోనుండి ఏ జవాబులేదు. ఇంటి తలుపు



తీసి వున్నా పలుకరేమిటి అని ఇంట్లోకి చూస్తే సామానంతా పరచిఉంది. ప్రక్క ఇంటిలోనున్న వాళ్ళ తమ్మునికి చెపితే అతను చూచి శ్రీ నాగేశ్వరరావుగారికి చెప్పి తీసుకు వచ్చాడు. సబ్ ఇనస్పెక్టరు రిపోర్టు వ్రాయలని తనిఖీచేస్తే ఒక్క వస్తువు కూడా దొంగతీసుకోలేదని తేలింది. ఆ దొంగకు ఏమి అనుభవ మయిందోగాని, సామానంతా పరచిపెట్టి, యాభైవేల రూపాయల రొఖ్ఖము కూడా వదిలేశాడు. నలభై సవర్లపైన బంగారు, విలువైన బట్టలు, వెండిసామాను ఉన్నా ఒక్క వస్తువు పోలేదు.

దొంగ ఇంట్లో ప్రవేశించినప్పుడు నాగేశ్వరరావు శ్రీస్వామిని ప్రార్థించాడా? పోనీ ఇల్లు వదలి ప్రక్కఊరికి వెళ్ళేటప్పుడు నా ఇంటికి కాపలా ఉండు స్వామీ అని ప్రార్థించాడా? లేదే? నాగేశ్వరరావుగారి విశ్వాసాన్ని, ఆచరణకు సంప్రీతుడైన శ్రీస్వామివారు మన ప్రార్థనతో అవసరం లేకుండానే రక్షించారు. అలాంటి రక్షణ పొందాలంటే మనంకూడా వారిలాగా సమయపాలన చేయాలి. రెండు మూడు సార్లు 4 గంటలకు 1 నిమిషం ఆలస్యంగా మందిరానికి వెళ్ళినందుకు రోజంతా ద్రవాహారంగాని ఘనపదార్థంగానీ ఏదీ తినకుండా 24 గంటలు శిక్ష వేసుకొన్నాడు. అందుకే వారి పిలుపు లేకుండా ఆదుకున్నారు. మనందరం అలాంటి అనుభవము పొందాలంటే నాగేశ్వరరావు ఆచరించిన ఆచరణ పాటించాలి.గనుక ఇది మనందరికీ మంచిపాఠమే. శ్రీస్వామివారు మన మధ్య ఉండగా నిత్యము గొలగమూడి గ్రామస్థులు మరియు గొలగమూడి హరిజన గ్రామస్థులు కొందరు వచ్చి వారి సన్నిధిలో రాత్రి 8గం॥ నుండి భజనచేసి వెళ్ళేవారు. అంతవరకూ మౌనం వహించిన శ్రీస్వామివారు రాత్రి 8 గం॥ అయిందంటే "అయ్యా భజనవాళ్ళు ఇంకా రాలేదేమయ్యా" అని అడిగేవారు. సూర్యడొక గంటకు

అస్తమిస్తాడనగా, "అయ్యా రాత్రికి కట్టెలున్నాయా" అని హెచ్చరించేవారు. సమయం ప్రకారము భజన చేయడం రాత్రంతా అగ్నిహోత్రం కొనసాగించడమే వారికి ప్రీతికరమైన పనులు. గనుక "నిత్యమూ నిర్ణీతకాలంలో భగవంతుని దివ్య తలపులతో నీ మనసు నింపుకో"మని భక్తులకు అనుభవాలను ప్రసాదించి బోధిస్తున్నారు. "చూచినేర్చుకో" అనే ఈ గ్రంథాన్ని నిత్యం నియమిత కాలంలో పారాయణచేసినా మనం శ్రీస్వామివారి కృప తప్పక పొందగలము.

భగవంతుని ప్రీతికొరకు నిష్కామకర్మ మనం చేస్తున్నామని భ్రమపడుతాము. కానీ మన నిష్కామకర్మకు శ్రీస్వామివారు చేసిన నిష్కామకర్మకు ఏనుగుకు ఎర్రచీమకు పోలికవలె ఉంటుంది. మనపనిలో ఏ కొద్దిపాటి అడ్డంకుగాని, ఆరోగ్యపరమైన ఇబ్బంది వస్తే వెంటనే ఆయా ఇబ్బందిని అడ్డంపెట్టుకొని నిష్కామకర్మను సాగించక పూర్తిగా వదలివేయడమో, తాత్కాలికముగా కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోవడమో జరుగుతుంది. కానీ శ్రీస్వామివారు **కఠోరనియమపాలనతో** ప్రాణాలకు తెగించి తన నిష్కామకర్మ సాగించేవారు. ఉదాహరణకు పెన్నా నీటికి ఇసుక కట్టలువేసి నీరు నిలిపే పనిలో నిమగ్నమైన శ్రీస్వామివారికి మోచేతుల ఇవతల చెయ్యంతా పాచిపోయి ఉండేది. అలాగే మోకాళ్ళ ఇవతల పాదము వరకు తెగపాచిపోయి ఉండేది. వర్షాకాలంలోని తేమలో తిరిగితే కేవలం కాలి వేళ్ళసందున కొద్దిగా పాస్తే మనం ఓర్చుకోలేక డాక్టరుపాలవుతాము, మందులు పూస్తాము. ఇంజెక్షన్లు తీసుకొంటాము. లోకంలోని పాపము తగ్గించేందుకు, మామూలు కలరా, మసూచి రాకుండా ఉండేందుకు శ్రీస్వామివారు నిష్కామకర్మగా దైవాదేశం పాటిస్తూ దేవుని పని అనేభావంతో చేసే తన ఇసుక కట్టపని ఒక్క క్షణమైనా ఏమారి ఎరుగరు.



కఠోరనియమపాలన ఎలా చేయాలో చూచి నేర్చుకోమంటున్నారు. వర్షమొచ్చి నదికి వెల్లువొస్తే వీరి ఇసుకకట్ట కొట్టుకుపోయినా శ్రీస్వామివారి కాళ్ళుచేతులు పాచిబాధలెక్కువై పని ఆగిపోయే ప్రమాదం రాకుండా పైవాళ్ళే జాగ్రత్త తీసుకొనేవాళ్ళు. ఏటిలో గుండం వేసి కూర్చున్నప్పుడు 15 అడుగుల లోతు పారే ఏటినీరు శ్రీస్వామివారికి ఇరువైపుల పారిందిగాని వారికి చెమ్మే తగలలేదు. వారి కఠోరదీక్షాపాలనకు సంతసించిన నదీమాత శ్రీస్వామివారిని వారి అగ్నిహోత్రానికి ప్రదక్షిణ చేస్తూ వారిని తాకకుండా ప్రవహించింది. పై రెండు సన్నివేశాలలో సాధారణ మానవులవలె సుఖేచ్చలేదు. నాలాగ చిన్న విషయం అడ్డు తగిలినా పని ఆపడం లేదు. వర్షాకాలంలో పది కాలివేళ్ళలో ఒక్కవ్రేలు ఒండెత్తితే దేవాలయం వెళ్ళే నిత్యకృత్యం మానేస్తున్నాను. అనుకున్న పని అయిందాకా ప్రాణానికి తెగించి శ్రీస్వామివారు అన్నం తలంపు, కాళ్ళు చేతుల మంట అనే తలంపునే దగ్గరకు రానీయలేదు. కఠోరనియమపాలన లేకుంటే పుట్టలోని చెదపురుగులవలె నీ జన్మ వృథా అవుతుంది. యముడు నిన్ను ఆహారం వృథాచేసినందుకు శిక్షిస్తాడు అని చూచి నేర్చుకోమంటున్నారు.

జీవితాంతము నిరంతర మౌనము, భగవధ్యానము తప్ప ఆహార సంపాదనకు అణుమాత్రమైనా కాలము వృథాచేయని శ్రద్ధను మనమందరము ఆ మహనీయుని చూచినేర్చుకోవాలి.

ఏటిలో ఇసుకతో కట్టలువేసి నీటిప్రవాహాన్ని ఆపే పనిలో ఎంతో కాలముండి కాళ్ళుచేతులు ఘోరంగా పాచియున్నా ప్రాణానికి తెగించి ఆ భయంకరమైన పనిలోనే నిమగ్నమైనారు. భిక్షాన్నానికి కూడా వెళ్ళేవారుకాదు. భగవంతుడే ఎవరో ఒకరి ద్వారా వారికి అన్నం సమకూర్చారు. 'ఎందుకు స్వామి ఇదంతా', అంటే "లోకంలో దూములు, కలరా జబ్బులు తగ్గేందుకు, పాపము

తగ్గేందుకయ్యా" అన్నారు. ఇతరుల శ్రేయస్సు కొరకు నిరంతరము శ్రమించడం అనే ఒకేఒక దైవాంశ గుణాన్ని మీరుకూడా చూచి నేర్చుకోమంటున్నారు.

ఈనాడు ఏ ఆఫీసుల్లోగానీ, ఏ వ్యాపారంలోగాని, ఏ కాంట్రాక్టులో కానీ, ఫ్యాక్టరీలు, వ్యవసాయం అన్నిరంగాలలో పనిచేసే సోదర సోదరీమణులు స్వార్థబుద్ధిమాని పరోపకార బుద్ధితో శ్రీస్వామివారి వలె పనిచేయడం ఒక్కటే ధ్యేయంగా జీవించేది చూచి నేర్చకోమని బోధిస్తున్నారు. అలా పరోపకార బుద్ధితో శ్రమిస్తుంటే దైవకృపగల్గి పుణ్యం పెరుగుతుంది. పుణ్యం చాలినంత ఉంటే సద్గురు సమాశ్రయం అవుతుంది. అది జరిగాక మామిడి పూతలాగ రాలిపోకుండా ఉండాలంటే ఇంకా పుణ్య ముండాలి. స్వార్థ బుద్ధితో కర్మలుచేసి కష్టాలుకొనితెచ్చుకోవద్దని సూర్యచంద్రులున్నంత వరకు బోధిస్తుంటానని అభయ మిచ్చారు. శ్రీ స్వామి చేసే నిష్కామకర్మలో ఎన్నో అంశాలు మనం నేర్చకోవాలి.

ఈ స్వప్న సందేశంద్వారా ప్రతి ఒక్కరూ సమయపాలన ఎంత చక్కగా నిముషాలు సెకండ్లవార లేకుండా చేయవలెనో తెలుస్తుంది. అలా చేయకుంటే "వాళ్ళుండేదాన్ని బట్టయ్యా మనముండేది" అనే శ్రీస్వామివారి మాట అనుభవమవుతుంది. మనం మన ప్రార్థన, పూజ, పారాయణలకు సమయపాలన లేకుండా చేస్తుంటే శ్రీస్వామివారు కూడా వారికి వీలున్నప్పుడు మాత్రమే వచ్చి మనలను ఆదుకుంటారు. మనం అన్ని విషయాలలోను సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవలలో చాలా చాలా ఖచ్చితంగా వ్యవహరిస్తే మన కష్టాలలో శ్రీస్వామివారు మన ప్రార్థనతో అవసరం లేకుండానే రక్షిస్తాడు.



శ్రీవారికి గల పదిమంది సేవకులలో ఎవరో ఏమో అన్నారని అలిగి శ్రీస్వామివారి సన్నిధి శాశ్వతంగా వదిలి వెళ్ళాలని పోయే రోశిరెడ్డిగారిని మాత్రమే శ్రీస్వామివారు వెనకకు పిలిచి ఎవ్వరూ వినకుండా అర్ధ రాత్రివేళ "అయ్యా ఎవరో ఏమో అన్నారని పంటచేను వదలి, పరిగ ఏరుకుంటావా. ఊర్లోకి పోయి అన్ని నూకలు భిక్షం తెచ్చుకొని జావకాచి త్రాగి ఇక్కడ పడి ఉండకూడదా?" అని ఆజ్ఞాపించారు చాలా మృదువుగా. రోశిరెడ్డి చివరి శ్వాసవరకు ఆ యాజ్ఞను హృదయపూర్వకంగా ఆచరించిన ధన్యజీవి. మరి ఇతర శిష్యులెందరో శ్రీవారిని వదిలి వెళ్ళిపోయారు. ఎవ్వరినీ రోశిరెడ్డిని పిలిచినట్లు పిలువలేదు. ఎందుకు పిలువలేదు. రోశిరెడ్డికున్న కఠోర నియమపాలన ఇతరులలో లేదు. గనుక మన కఠోర నియమపాలనే మనలను ఉద్ధరిస్తుందని చూచి నేర్చుకోమంటున్నారు.

శ్రీ రమణ మహర్షి అంటారు "ఎవరెన్ని మంచిమాటలు చెప్పినా, చెప్పిన పని చెప్పినట్లు చేయడమే సేవ. మిగిలిన వన్నీ వేషాలే". ఈ రోశిరెడ్డిగారు ఒక గొప్ప సత్యాన్ని చెప్పేవాడు "ఏనాడైనా రాత్రివేళగాని పగలుగానీ శ్రీస్వామివారు 'అయ్యా' అంటే నేను 'స్వామీ' అనాలి. అలా అనకుంటే నేను ఆనాటితో చచ్చినట్లే లెక్క" అనేవాడు. 'అట్లా నిద్రకాయడం నీకు ఎట్లా వీలౌతుంది తాతగారు? మాకు మెలకువ రాదే' అనడిగితే వారు తన పొట్టచూపిస్తూ "ఇక్కడ ఎంత కొద్దిగా ఉంటే అంతబాగా మెలకువ ఉంటుంది. అందుకే నేను రాత్రిపూట ఏమీ తినను. వీళ్ళుపోరు పడలేక కొంచెం తాలింపు కూరగాని, జావగాని త్రాగుతాను. దాన్నికూడా శ్రీస్వామివారు వద్దంటున్నారు. వారు నోటితో తినవద్దని చెప్పరు. నేను తిన్న పదార్థం వాంతి చేసుకొనేటట్లు చేస్తారు. రెండు మూడు సార్లు అనుభవమయ్యాక బుద్ధివస్తుంది. మాయ చాలా గొప్పబలం గలదయ్యా. తిరిగి పది రోజులయ్యాక మరలా

అలాగే తింటాను (కూర) మరలా వాంతి. తినడమెందుకు కక్కడమెందుకని అసలు మానేశాను. వేడినీళ్ళు మాత్రమే త్రాగి పడుకుంటే కమ్మగా ఒక్క పిలుపుకే ఎగిరి లేస్తున్నాను. అంతా ఆయన చేస్తాడు. మనం చేసేదేమీలేదు. మనం చేసేందుకు సిద్ధపడి ఉండాలి. అదొక్కటే కావాలి" అన్నారు. "మైసూరు మహారాజును చూస్తే ఏమొస్తుంది. మనంచేసుకున్నదే మనకు" అన్న శ్రీస్వామివారి మాట రోశిరెడ్డిగారి మాటకు సరిపోయింది. గనుక రోశిరెడ్డిగారి కఠోర నియమపాలన, దాని ద్వారా గురుసేవ, దానిద్వారా గురుకృప పొంది, అలిగి ఇంటికి వెళ్ళాలని సంకల్పించగానే "పంటచేను వదలి పరిగ ఏరుకుంటావా?" అని వెనక్కుపిలిచారు. మరి మిగిలిన సేవకులు అలిగి పోతుంటే పోనిచ్చారుగాని పిలువలేదు. నాకు తెలిసిన సేవకులే ఐదారుగురు కొన్నాళ్ళు సేవించి వెళ్ళిపోయారు. కానీ వాళ్ళను తన సేవకు రమ్మని రోశిరెడ్డిగారిని పిలిచినట్లు పిలవలేదే. ఎందుకు? ఆయనది "భీష్మని పట్టు" అని శ్రీస్వామివారే చెప్పారు. గనుక అంతగట్టి కఠోర నియమపాలన మనకూ ఉంటేగాని వారి కృప సంపూర్ణంగా పొందలేమని రోశిరెడ్డిగారిని చూచి నేర్చుకోమంటున్నారు.

వక్కెమ్మగారు, చలమానాయుడు ఒకరి వెనుక ఒకరు మూడడుగుల దూరంలో నిండుగా 15 అడుగుల లోతు పారే నీటిలో నడుస్తున్నారు. ముందు వెళ్ళే చలమానాయుడికి రొమ్ములలోతు నీళ్ళు, వారి వెనుకనే వక్కెమ్మకు నీరు మోకాళ్ళవరకు మాత్రమే ఉన్నాయి. ఎందుకావిధంగా ఒకే క్షణంలో ఇద్దరికీ అంత భేదంగల అనుభవం ఇచ్చారు? నీ భావాన్ని అనుసరించి ఫలితం ఉంటుందని - వాళ్ళ అనుభవం చూచి నేర్చుకోమంటున్నారు. కనీసం ఈ అనుభవం చదివాకనైనా నీ హృదయంలో విశ్వాసం పెంచుకోమని చూచి నేర్చు కోమంటున్నారు.



'యత్కర్మకురుతే తదపి సంపద్యతే' అన్నారు పెద్దలు. ఎలాంటిదిస్తే అలాంటిదే పొందుతావు అని పై మాటకు అర్థము. 'మైసూరు మహారాజును చూస్తే మనకేమొస్తుందయ్యా. మనం చేసుకున్నదేగదా మనకు' అన్నారు. గనుక ఎల్లప్పుడూ సత్యం, ధర్మం తప్పకుండా మనంచేసే ప్రతి పని గురుసేవగా భావించి చేస్తుంటే విశ్వవిభుడు సంతోషిస్తాడు. మన భావాన్ననుసరించి సకామకర్మకూడా నిష్కామకర్మ అయ్యేవిధంగా మనం కర్మచేసే విధానముండాలి.

మైసూరు మహారాజులాంటి శ్రీస్వామివారిని సేవించి రోశిరెడ్డి ఎన్ని విధాలుగా అనుగ్రహించబడ్డారు. ఒక్కసారి చూచి నేర్చుకోమంటున్నారు.

1. వృద్ధాప్యము వలన వచ్చే ఏ వ్యాధీ వారిని బాధించి ఎరుగదు. "నీ వళ్ళు సంజీవి అయిందయ్యా" అన్నారు గదా!
2. రెండు కళ్ళూ బొత్తిగా కనపడవు. కానీ ఎలాంటి కంటి ఆపరేషన్లూ, మందులూ ఎరుగరు. నిత్యం భిక్షకు వెళ్ళే టైంలో కొద్ది చూపు వచ్చేది. భిక్షకు వెళ్ళిరాగానే చూపు పొయ్యేది.
3. భిక్షకు వెళ్ళే టైంలో శరీరంలో ఎంతో శక్తి వచ్చి ఇక పడుకోలేక పొయ్యేవాడు. భిక్షకు వెళ్ళిరాగానే తన శక్తంతా ఏమౌతుందో నిర్వీర్యంగా పక్కమీద వాలిపోతే తిరిగి మరునాడు భిక్ష టైంలో మరలా లేచేవాడు.
4. ఏ మనిషి ఎలాంటివారో దృశ్యరూపంలో చూపేవారు.
5. అవసరమైనపుడు ఇంటి దగ్గర ఏమి జరుగుతుందో శ్రీస్వామివారి దగ్గరనుండే చూడగలిగేవారు.
6. స్నానం చేసేటప్పుడు పడి రెండు కాళ్ళు వాచి చీము

పట్టాయి. ఊరంతా తిరిగినప్పుడు పడలేదు. స్నానం చేస్తూ పడ్డానంటే శ్రీస్వామివారే పడదోశారు. నేను మందులు వాడినా తగ్గదు. వారు తగ్గిస్తే తగ్గుతుందని అలాగే మూలుగుతున్నాడు. చిత్రంగా తెల్లవారికి వాపు, చీము పోయి మామూలు కాళ్ళయ్యాయి.

7. కుడిచేత్తో పుడిశడు నీళ్ళు త్రాగమన్నారు. ఆనాటి నుండి దాహం లేకుండా పోయింది. "ఊర్లోకి వెళ్ళి నూకలు తెచ్చుకొని గంజి తాగి పడి వుండు. పంట చేను వదలి పరిగ ఏరుకోవద్దు" అన్న నాటి నుండి ఆకలి లేకుండా పోయింది
8. వారి చేలో నిమ్మచెట్లు నాటించి వారి కుటుంబ పోషణ బాధ్యతను చూచారు.
9. కొండ చరియలో పడిన బండి, ఎద్దులు, రోశిరెడ్డి కొమారుణ్ణి చిన్న దెబ్బతగలకుండా కాపాడారు. చేయ వలసిన విధంగా గురుసేవ చేస్తే ఫలితమెలా ఉంటుందో ఇక్కడ చూస్తాము.

పదిహేను రోజులు విరేచనాలై శ్రీస్వామివారు చాలా బలహీనంగా ఉన్నారు. మందు తీసుకోండి స్వామీ అంటే "దేవుడిచ్చింది అనుభవించ వద్దా అయ్యా" అన్నారు. మనకు సంప్రాప్తమయ్యే కష్ట సుఖాలు, అనారోగ్యాలూ అవీ దైవప్రసాదంగా భావించమని బోధిస్తున్నారు.

అన్ని ప్రాణుల్లో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోమన్నారు. ఇది అక్షరాల నిజమని నిరూపించారు. చలమానాయుని ఎద్దుకు ఆకలై అల్లాడుతుంటే అక్కిం వెంకట్రామిరెడ్డిని పంపి మైలు దూరంలో ఉండే ఆ ఎద్దుకు అర్ధరాత్రివేళ గడ్డి వేయించారు. గనుక ఏ జీవిని ఆదరించినా, నిరాకరించినా వారికే చెందుతుందనే ఎరుకతో జీవించమంటున్నారు. కావుమని అరచే కాకిని తోలినా



శ్రీస్వామివారు అంగీకరించరు. "అది నిన్నేమి చేసిందయ్యా" అని అనేవారు. సాటి నోరులేని జీవుల ఎడల జాలి, కరుణ గలిగి నడుచుకోమంటున్నారు.

తాళ్ళూరు శ్రీనివాసులు వచ్చిన ఆటో డ్రైవర్ ఆశ్రమవాళ్ళకు అబద్ధం చెప్పి ఐదు రూపాయలు ఎక్కువ తీసుకున్నాడు. తిరుగు ప్రయాణంలో పదిబారల దూరం వెళ్ళిన అతడి ఆటో చెడిపోయి ఎంత ప్రయత్నించినా కదలలేదు. ఆ డ్రైవర్ తన తప్పు అంగీకరించి చెంపలేసుకుంటూనే ఆటో కదిలింది. మనమెక్కడున్నా ఏమి చేస్తున్నా సర్వసాక్షియైన శ్రీస్వామివారికి అనుక్షణము తెలుస్తూనే ఉంటుంది. గనుక మనమెంత జాగ్రత్తగా జీవించాలో సత్యం, ధర్మం ఎంతగా ఆచరిస్తే శ్రీస్వామివారికి అంత దగ్గరౌతామని చూచి నేర్చుకోమన్నారు.

శ్రీస్వామివారికి సేవచేసే వారిలో చెడు అభిప్రాయాలు అన్యచింతలు, పరదూషణ, కోపములాంటి ఏ గుణమున్నా ఆ సేవకుల సేవను నిరాకరించడం ద్వారానేగాక ఆత్మప్రేరణద్వారా కూడా వారిసేవ నిరాకరించినందుకు కారణం తెల్పేవారు. నేడు మనం శ్రీస్వామివారిని సేవిస్తున్నామని అనుకుంటున్నాముగాని పై దుర్గుణాలు లేకుండా సేవిస్తున్నామా అనే విషయము ప్రతి క్షణమూ చూచుకుంటూ ఉండాలని శ్రీస్వామివారు నా ఇడ్లీల అనుభవంతో నిరూపించారు. ఇడ్లీలు తెచ్చినంత సేపూ విడవకుండా నామ జపం చేసినన్నిరోజులూ ఇడ్లీలు స్వీకరించారు. ఏరోజు దోవలో నామ జపంమాని ఆలోచనలతో తెచ్చానో ఆ రోజు ఇడ్లీలు కనీసం తాకేందుకు కూడా నిరాకరించారు. మరొకరోజు మినప్పప్పు నానబోసినది మొదలు రుబ్బి రవ్వకలిపి నాన పెట్టినంత వరకు నామజపం ఆపకుండా చేశాను. తెల్లవారి ఇడ్లీలన్నీ పెట్టినంత వరకేగాక శ్రీస్వామివారి దగ్గరకు తెచ్చినంత

వరకు నామ జపంచేసి తెస్తే - శ్రీస్వామివారు హోటల్ ఇడ్లీలు అప్పటికి తిని ఉంటే కూడా మరలా నేను తెచ్చిన ఇడ్లీలనుండి నాలుగు ఇడ్లీలు తిన్నారు. గనుక మనసేవకు నామ జపం జోడించి చేస్తేనే శ్రీస్వామివారు అంగీకరిస్తారని రూఢి అవుతుంది. ఈ అనుభవం చూచి నేర్చుకోమంటున్నారు. మనం శ్రీస్వామివారికి నేడు సేవలు ఎలా చేయాలో నేర్చుకోమంటున్నారు.

శ్రీస్వామివారికి సేవ చేస్తూనే ఒకరు మనసులో అన్యచింతలు వచ్చినప్పుడు నీవు మనుషుల్లోకి వెళ్ళి వచ్చావు నీ సేవ వద్దని వెంటనే అతని సేవను నిరాకరించారు. దీన్ని చూచి సేవ ఎలాచేయాలో నేర్చుకోమంటున్నారు.

**కఠోర నియమపాలన**:- అంటే ఏమిటో ఎలా ఉండాలో తన ఆచరణ చూచి నేర్చకోమంటున్నారు. ఎక్కడ ఎన్ని గంటలు తన అగ్నిహోత్రం నిర్వహించాలో ముందుగానే వారి హృదయం చెపుతుంది. అంతసేపు అక్కడ అగ్నిహోత్రం కొనసాగించి తీరేవారు. ఒకచెట్టు క్రింద అగ్నిహోత్రం వేస్తుంటే వాన మొదలైంది. చెట్టు ఆకుల సందు నుండి వర్షం నీరుకారి అగ్నిని ఆర్పుతుంది. ఒకవైపు ఆరుతుంటే మరొక వైపు చిదుగులు వేసి మంట రగిలిస్తున్నారు గాని ఆ చోటు వదలి మరొకతావుకు అగ్నిహోత్రం మార్చలేదు. మందిరం వరండాలో అగ్ని వ్రేల్చుకోండి స్వామీ అంటే శ్రీస్వామివారు "బొక్క పడు తుందయ్యా" అన్నారు. మంట చల్లారిపోతుందని చెట్టు క్రింద అగ్ని వ్రేల్చడం మానడం ఎందువలన? కేవలం అక్కడ అగ్నిని సంరక్షించడం కష్టము గనుక. కష్టమునకు వెరచి అనుకున్నన్ని గంటలు అక్కడ అగ్ని వ్రేల్చకుంటే అగ్నివలె ప్రజ్వరిల్లే తన ధర్మనిరతికి బొక్క పడుతుందని సూచిస్తున్నారు. తన అగ్ని సేవనానికి ఆటంకం కలగడమే దైవనిర్ణయమే అయితే మందిరం



వరండాలో కొచ్చినా వరండాకు బొక్క పడైనా అగ్ని ఆరిపోతుందని చెపుతున్నారు. గనుక కష్టానికి వెరవకుండా మన కృషి సాగించడమొక్కటే ఉత్తమ ధర్మమని బోధించారు.

ఇదేవిధంగా పెన్నానదిలో అగ్నివ్రేలుస్తుంటే నది 15 అ॥లోతు ప్రవహించినా శ్రీస్వామివారిని తాక కుండా రెండుగా చీలి ప్రవహించింది. మానవకర్తవ్యంలో దైవనిర్ణయం పై మన విశ్వాసమెలా ఉండాలో చూచి వేర్చుకోమంటున్నారు.

**దారం తెగిపోకుండా చూచుకుంటే నేనెప్పుడు మీతోటే ఉండ్లాయ్యా.**

దారమంటే చేతికి కట్టుకునే దారంకాదు. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోమన్న మాట మరువకుండా ఏ జీవితో వ్యవహరించినా శ్రీస్వామివారే ఆరూపంలో మన ముందు ఉన్నారనే భావం మరచి పోకుండా వ్యవహరించడమే దారం తెగిపోకుండా చూడడమంటే. అలా వ్యవహరించాలంటే రాగద్వేషాలు పూర్తిగా నశింప జేసుకోవాలి. ఇష్టము, అయిష్టము లేకుండా మనం జీవించగలిగితే ఈ సూక్తి పాటించ గల్గుతాము. భగవద్గీతలో

'రాగద్వేష వియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్

ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమదిగచ్ఛతి' అన్నారు. రాగద్వేషాలనే ఇష్టము అయిష్టము అని చెప్పారు. ఒక విషయం మనకు ఇష్టమా అయిష్టమా అనేదానికి ముందు ఆ విషయం ధర్మమా అధర్మమా అనేది మన బుద్ధి గ్రహించగలగాలి. అలాంటి బుద్ధి ఉండాలంటే మన తత్వం పూర్తిగా సత్వగుణ ప్రధానంగా మారాలి. రజోగుణం, తమోగుణాలు హరించబడాలి. అలాంటి సత్వగుణం ఎలా వస్తుంది? 1. మహనీయుల సన్నిధి 2. సత్సంగము 3. వేద పఠనము (వార్తాలాపము వంటి గ్రంథములు)

గనుక దారం తెగిపోకుండా చూచుకోవాలంటే మహనీయుల సన్నిధిలో సాధ్యమైనంత సేపు గడపడం, సత్సంగము, మహనీయుల చరిత్ర పఠన మననంలకు ఎంతైనా ప్రాధాన్యముందని శ్రీస్వామివారు చెప్పకనే చెపుతున్నారు.

**శ్రీ కొమరిగిరి రమణయ్యగారు**: ఆధ్యాత్మికతకే ఆటపట్టైన సంపూర్ణ స్వేచ్ఛను అనుభవించిన ఘనుడు. చివరివరకు శ్రీస్వామివారి పాదముల కడ నిల్చిన ధీరుడు. భిక్షనే జీవనోపాధి చేసుకొన్న ఘనుడు. ఎవ్వరితోను ఎలాంటి సంబంధము లేకుండా సంపూర్ణ స్వేచ్ఛను అనుభవించి శ్రీ స్వామివారిలో ఐక్యమయిన ఘనత వీరికే దక్కింది. తన దున్నపోతుల బండితో నిరంతరమూ అడవి నుండి కట్టెలుతోలి శ్రీస్వామివారి కృపను పొందిన మహనీయుడు.

**శ్రీ పోలిరెడ్డిగారు**: 'ఏమీ కోరని భక్తే నిజమైన భక్తి'- అన్నమాటకు నిదర్శనమే వీరు. శ్రీస్వామివారికి ఆకుకూర తెచ్చి వండి పెట్టడం తన అరల సంచిలో దాచి ఉంచిన ఉప్పు, మిరపకాయ, చింత పండుతో పచ్చడి చేసి శ్రీస్వామివారికి సమర్పించే సేవలు చేశాడు. మానవ సంఘాన్ని వదలి నిరంతర మౌనంలో కాలం గడిపాడు. శ్రీస్వామివారే వీరి దేహాన్ని సమాధి చేశారు. కనుక ధన్యజీవి.

**శ్రీరోశిరెడ్డి ఉరఫ్ నాగయ్య**: శ్రీస్వామివారిది ఒకేమాట గదయ్యా అన్నదానిని సంపూర్ణంగా విశ్వసించి శ్రీస్వామి మాటకు ఎదురు పల్కని ధన్యజీవి. వృద్ధాప్యము వలన రెండు కళ్ళూ కనబడకున్నా భిక్షకు వెళ్ళే సేవను చివరిదాకా సాధించిన ఘనుడు. భిక్ష టైంలో కొద్దిపాటి చూపు వచ్చేది. భిక్షనుంచి ఆశ్రమం చేరగానే చూపుపోయేది. ఎంత చిత్రమో చూడండి. చివరలో స్నానంచేసి ధ్యానం చేస్తూ శరీరం వదిలిన ధన్యజీవి.



**శ్రీ మల్లిక వెంకయ్య**: నిస్వార్థ సేవకు పెట్టిన పేరుగా జీవించారు. చుట్టుప్రక్కల గ్రామాలకు మకుటంలేని రాజయ్యాడు. గాలి, దయ్యము, పశువుల జబ్బులకు ఘన వైద్యుడయ్యాడు. ఏనాడు తన వల్ల మేలు పొందిన వారినుండి పైసా డబ్బుగాని, గుడ్డలు ఆశించక నిస్వార్థసేవ చేసి అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని దీక్షతో తన సేవలందించిన ఘనుడు. పూర్తి ప్రజ్ఞ స్మరణలతో తనువు చాలించిన మహనీయుడు.

**నరసమ్మ**: తన ప్రాణాలను శ్రీస్వామివారి పాదాలకంకితం చేసిన మహాతల్లి. "నరసమ్మ చచ్చిపోయిందనుకొన్నానే" అని శ్రీస్వామివారి చేత వరం పొంది బంధుప్రీతి, శరీరభ్రాంతి, సర్వానర్థదాయకమైన అహంకారము సమూలంగా శ్రీస్వామివారి యోగశక్తితో నిర్మూలించుకొన్న మహాసాధ్వి. తనప్రాణాలను శ్రీస్వామివారి కర్పించి పొందవలసినదంతా పొందిన మహాతల్లి.

శ్రీస్వామివారి సేవకులలో వారి నుండి పూర్ణానుగ్రహం పొందిన మహనీయులనుండి మనం చూచి నేర్చుకోవలసినదెంతైనా ఉంది. తులసమ్మగారి దానగుణము, సేవాభావము, మానహీనంగానున్న అనాథకు తన వంటి నున్న చీరలో సగం చీర చించి ఇచ్చి మిగిలిన సగం చీరతోనే వంటిని కప్పుకున్న దాన కర్ణ- నిరంతరము శ్రీస్వామివారి సేవకులకు, వచ్చిన భక్తులకు అన్నాలు వండి వడ్డించడమనే సేవలోనే తరించిన మహాసాధ్వి ఈమె. సంపూర్ణ విశ్వాసానికి మచ్చు తునక ఈమె. ఇంద్రియ సుఖాలు మానసికంగా వదలినా వదల వచ్చునేమో గాని శరీరం అంగీకరించదని నా నమ్మకము. అప్పటి వరకు నవకాయ పిండి వంటలు తిన్న నాలుక ఒకేసారి పచ్చడి మెతుకులు తినగలదా? ఏనాడు కాలు క్రింద మోపకుండా కార్లలో తిరిగిన మహాతల్లి చెప్పులు లేకుండా రాళ్ళలో ముండ్లలో నడిచిందే! అదంతా తన

సంపూర్ణ విశ్వాసానికి శ్రీస్వామివారు ఆమె కిచ్చిన వరప్రభావమే గదా! హంసతూలికాతల్పములపై నిద్రించిన ఆ తల్లి తాటాకులు, గోతాలపై పడుకోవడమేమిటి! విశ్వాసం లేకుండా అన్యులెవ్వరికీ సాధ్యము కానిది ఈమె ఆచరణ. అందుకే 'అమ్మ ఇక వచ్చేది లేద'ని లిఖితపూర్వకంగా వ్రాయించి ఇచ్చారు శ్రీస్వామి.

**వక్కెమ్మ:-** ఒక చెవికమ్మ విప్పుకునే దొంగకు రెండవ చెవికమ్మ విప్పుకునే అవకాశం కల్గించి మరొక ప్రక్కకు తిరిగి పడుకున్న తల్లి ఈమె. వీరి భక్తి విశ్వాసాలకు గుర్తుగా నిండుగా పారే ఏరు దోవ ఇచ్చింది. పేడ ఏరే మిషతో మానవ సంఘానికి దూరంగా వెళ్ళి ధ్యానం చేసుకున్న భక్తురాలు. ఎవ్వరితోను విరోధమే లేని మహాసాధ్వి. ఈమె వైరాగ్యము, ధ్యేయము పై శ్రద్ధ మనందరికీ గొప్ప పాఠాలు.

నేడు కలియుగంలో తమకేదో గొప్పస్థితి కలిగినట్లు భ్రమకు లోనై గురువులమవ్వాలనే గుబులు పుట్టి అమాయకులను ప్రోగు చేసుకొంటున్నారు. దానికి ప్రతిఫలంగా ఎంత తీవ్రంగా నష్టపోతున్నారు. "చచ్చి బూడిదైనా రమ్మంటే వచ్చేదే గదయ్యా" అన్నమాట అక్షరాల సత్యమని అనేకుల అనుభవాలు నిరూపిస్తున్నాయి. అంతటి మహనీయుడే ఎంతో గోప్యంగా తనగుట్టు బయట పెట్టకుండా జాగ్రత్త వహించారు. తానెవరికి మేలుచేసినా తిరువళ్ళూరు వీరరాఘవస్వామి, పెంచల నరసింహస్వామి, నెల్లూరు రంగనాయకుల స్వామి, తిరుపతి వెంకటేశ్వర్లు మొదలైన దేవుళ్ళమీద పెట్టి వారికి మ్రొక్కుబడి చెప్పుకోమని, అక్కడ నిద్రచేయమని చెప్పేవారేగానీ, అవతల భక్తులకు జబ్బు నయంచేసినా, కోర్టుకేసు గెలిపించినా ఆ మంచి తన వల్ల జరిగిందని ఏనాడు అంగీకరించలేదు. మాకేదైనా బోధించండి స్వామీ అంటే "బోధించేదేముంది చూచి నేర్చుకోండి"



అని కొందరితోను - "ఆశపోతే అంతా పోతుందని" మరి కొందరితోను చెప్పారు. ఇంకొందరితో "మూడు వేలు ఇస్తే (ఈషణత్రయం అనగా ధారేషణ, ధనేషణ, పుత్రేషణ) ఏ సాదయ్యయినా చెపుతాడ"ని కొందరితోను చెప్పారు. సర్వం తెలిసిన మహనీయుడు ఎలా నడుచుకున్నాడో చూచి మనలను నేర్చుకోమన్నారు. నేటి నకిలీ సాధువులంతా శ్రీస్వామివారి పద్ధతి చూచి నేర్చుకొని తమకు కల్గిన భ్రమ నుండి బయట పడితే మంచిదిగదా. ఓ సద్గురురాయా! మా చీకటిని ప్రోదోలి మాకు మార్గము చూపు ప్రభూ. నీ పాదము లాశ్రయించినాక గురువుల మవ్వాలనే గుబులు పుట్టకుండా ఉండేటట్లు మా నడవడిని సరిచేయండి ప్రభూ.

**వక్కెమ్మ:-** ఈ మహాతల్లి పొందిన దివ్యానుభవాలు మరెవ్వరూ పొందలేదు. పదిహేనడుగుల లోతు పారే పెన్నానదిని గిరకల లోతు నీరుగా చేసి ఈ తల్లిని దాటించారు. మరొకసారి వీరి ముందు మూడడుగుల దూరంలో నడుస్తున్న చలమానాయునికి ఏటిలో నీరు ఐదడుగుల లోతు ఉంటే వీరి గుడ్డలన్నీ తడిశాయి. అదే ఏటినీటిలో ఆయన వెనుక రెండడుగుల దూరంలో నడిచే వక్కెమ్మకు 9 అంగుళాల లోతు నీరు ఉండడముతో ఆమె గుడ్డలు కొంచెంకూడా తడవలేదు. 'వాళ్ళుండేదాన్ని బట్టయ్యా మనముండేది' అన్న శ్రీస్వామివారి మాట అక్షరాల నిజమని నిరూపించారు. ఆశ్రమంలో లౌకిక వ్యవహారాలలో, సంభాషణలలో మునిగి తేలే శ్రీస్వామి సేవకుల సాంగత్యం వదలి ఏకాంతంగా నామ స్మరణతో ఆకుకూర కోయడంలోను, పిడకలు ఏరడంలోనూ కాలం సద్వినియోగం చేసింది. "వక్కెమ్మ వళ్ళు మరిచిపోయింది పిలిచి అన్నం పెట్టండయ్యా" అని శ్రీస్వామివారనే వారంటే ఆమె ఎంత గొప్పగా ధ్యానం చేసేదో చూడండి. నిద్ర పోయే తన

చెవికమ్మ తీసుకునే దొంగకు మరొక చెవికమ్మగూడా తీసుకోమని మరొక ప్రక్కకు తిరిగి పడుకున్న త్యాగమూర్తి గనుకనే వక్కెమ్మ ఇక వచ్చేదిలేదని దేవుని మీద ఆజ్ఞపెట్టి వ్రాయించారు. ఇలాంటి సద్గుణాలు సాధనచేసి సొంతం చేసుకొని ఆమె పొందినట్లు మీరుకూడా శ్రీస్వామివారి నుండి కృప పొందమని శ్రీస్వామివారు చూచి నేర్చుకోమంటున్నారు.

**తులసమ్మ:** సేవకులు "ఎవరిని చూచి నేర్చుకోమంటారు స్వామీ, ఏమి నేర్చుకోమంటారు స్వామీ" అని అడుగలేదు. శ్రీ తులసమ్మగారి చరిత్ర చదివినప్పుడు మనకేమి తెలుస్తుంది. ఏమి నేర్చుకోవాలి. గొప్ప భక్తురాలనే ఒకే ఒక మాట కాదు. ఆమెకు గల అతిగొప్ప ఆభరణము - ఆమెకు గల ఆచరణ. వారి ఆచరణే ఆ తల్లిని శ్రీస్వామివారికి కట్టిపడేసింది. **అమ్మ ఇకవచ్చేది లేదని శ్రీస్వామివారే వ్రాయించారు. అంటే అమ్మకు పునర్జన్మలేదని అర్థం. ఘోర తపస్సులు చేసిన వారికి గూడా లభించని జన్మరాహిత్యము అంత సులభంగా గురుసేవ ద్వారా ఆ తల్లి పొందింది.** ఆ తల్లి ఎలా ఆచరించి మనకు చూపిందో అలా చేసి తరించ మన్నారు శ్రీస్వామి. ఆ తల్లి వైరాగ్యము, ఆమె విశ్వాసము, గురుభక్తి, అన్ని జీవులలో వెంకయ్య ఉన్నారనే ఏమారని ఎరుక అనుక్షణం ఉండడం, నిష్కాపట్యము లాంటి సుగుణముల రాశి. ఆమె జీవితచరిత్ర 'సేవకుల అనుభవాలు - స్వామి సన్నిధి' అనే గ్రంథములో చూడవచ్చు.

**వైరాగ్యము:** ఆ రోజులలోనే కారు గలిగిన భాగ్యవంతురాలై ఉండి తన చీరలన్నీ దానంచేసి కేవలం రెండు చీరలతోనే సాంసారిక జీవితాన్ని వెళ్ళబుచ్చిన దానకర్ణ. మానహీనంగా ఉన్న నిరుపేదను చూచి తన వంటిన ఉన్న చీరలో సగం చీర చించి ఇచ్చిన భాగ్యశాలి.



**కర్పూర హారతి:** అప్పుతీసుకోనైనా మందిరానికి వెళ్ళి కర్పూర హారతిలో వందరూపాయలు సమర్పించేది. 'అప్పుచేసి అట్లా దేవునికెందుకవ్వా సమర్పిస్తావు' అంటే 'పోనీలేయ్యా మనం ఇట్లా వచ్చి అట్లా పోతాము. ఎప్పుడు స్వామిని కనిపెట్టుకొని ఉండేది ఆ పేద పూజారే గదా. అంత మాత్రమైనా సమర్పించ కుంటే ఏమి తింటాడు' అని అన్నది.

'దైవ కార్యాలకు అప్పుచేయవద్దన్నాడు గదా శ్రీసాయి' అనడం మంచిదికాదు. అప్పు తీర్చే శక్తి లేనివాడు అప్పుచేయకూడదు. లక్షాధికారికి సమయానికి చేతిలో లేకుంటే అప్పుచేయడం దోషంకాదని మనం గుర్తించాలి.

**విశ్వాసము:-** తులసమ్మగారిని కిడ్నీ కేన్సరు వ్యాధితో ఉన్నప్పుడు నెల్లూరు అమెరికన్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె గంటలలో మరణిస్తుందని ఆస్పత్రి నుండి పంపేశారు. బంధువులు ఆమెను శ్రీస్వామివారి దగ్గరకు తీసుకువచ్చారు. ఒక వారం ఆమెను ఇంటిలో ఉంచి తీసుకురమ్మన్నారు శ్రీస్వామివారు. వారలా చేయగానే ఆమె కాన్సరు వ్యాధి ఏమైందోగాని ఆ తర్వాత ఆమె ఇరవై సంవత్సరాలు ఇల్లూ వాకిలీ, బిడ్డ, తన లక్షల ఆస్థి, కారు, ట్రాక్టరు అన్నీ వదిలేసి తన శేష జీవితాన్ని యావత్తు శ్రీస్వామివారి దివ్య సన్నిధిలోనే గడిపింది. ఒకానొక బిడ్డడైన శ్రీ ఆదినారాయణరెడ్డిగారు టి.బి (TB) వ్యాధి వల్ల మరణించ నున్నాడని అందరూ వెళ్ళి చివరి చూపులని చూచి వస్తుంటే - "కన్నబిడ్డ అనే మమకారమే లేక బిడ్డను చివరి చూపులకు వెళ్ళమంటే పోయి చూచి వస్తాను, వద్దంటే పోను సెలవివ్వండి స్వామీ" అని శ్రీస్వామివారి ఆజ్ఞ కొరకు నిరీక్షించి, శ్రీస్వామివారు "ఆయనకు బాగుంటుంది లేమ్మా, నీవు పోవద్ద"న్నప్పుడు గురువాజ్ఞనే శిరసావహించి శ్రీస్వామి సన్నిధి వీడని మహోన్నత

విశ్వాసి ఆమె. అలాంటి అకుంఠిత విశ్వాసము ఉండబట్టే అమ్మవచ్చేది లేదని వ్రాత మూలకంగా ఆశీర్వదించారు. తనలో సగభాగముంది అమ్మకు అని చెప్పారు.

ఆ తల్లివలె ధన కనక వస్తు వాహనములను ఎవరైనా వదలవచ్చునేమోగాని తన శరీరం పై మమకారం మాటలతో కాకుండా ఆచరణలో వదలడం ఎవ్వరికీ వీలుకాదు. నాటి వరకు షడ్రసోపేతమైన భోజనాలు రుచి చూచిన ఆ మహాసాధ్వి స్వామి సన్నిధిలో భిక్షాన్నము, పచ్చడి మెతుకులు, అవి లేనప్పుడు గంజి త్రాగి తృప్తి చెందింది. హంసతూలికాతల్పములపై శయనించిన మహనీయురాలు కటిక నేలపై గోనె పట్టా వేసుకొని శయనించింది. అప్పటి వరకు కాలు క్రింద పెట్టకుండా కారులో తిరిగిన ఇల్లాలు కాలికి చెప్పులు ధరించకుండా శ్రీవారి బండి వెంబడి పాదచారియై నడిచింది. ఆమె అకుంఠిత విశ్వాసము, ఆమె యొక్క ప్రవర్తనము, శ్రీస్వామివారి యందుగల గురుభక్తే అలా మహోన్నతముగా మలిచింది. ఆ తల్లి విశ్వాసాన్ని, గురుభక్తిని చూచి నేర్చుకోమని శ్రీస్వామివారు మనకు తన దివ్యవాణి ద్వారా తెలిపారు. ఈమెను గూర్చి మరొక గ్రంథం వ్రాసేకంటే "స్వామిసన్నిధి" అనే గ్రంథంలో విపులంగా చదవండి. ఈ తల్లి ఆచరించి చూపిన దివ్యగుణాలు ఎవరాచరించినా శ్రీస్వామివారి నుండి అలాంటి ఆశీస్సులు పొంద వచ్చునని బోధిస్తున్నారు.

**పోలిరెడ్డిగారిని చూచి నేర్చుకోమంటున్నారు:** ఏమీ కోరని సేవే నిజమైన భక్తి. నిస్వార్థంగా అరల సంచిలో ఎండు మిరపకాయలు, చింత పండు, ఉప్పు, యర్రగడ్డ ఉంచుకొని, నీడవలె శ్రీస్వామివారిని వెంబడించి సేవించారు. చాలాగొప్ప అవసరమైన మాట తప్పితే ఎప్పుడూ మౌనంగానే మానసికంగా నామ స్మరణసాగించేవారు. అన్నం తినడంలో మెతుకులు ఎంచుకొని



తింటాడని ప్రతీతి. తినే పిడికెడన్నమూ చాలా నెమ్మదిగా తినేవాడు. గనుకనే చివరిలో ఎలాంటి అనారోగ్యాలు లేకుండా ఎవరిసేవల కొరకు ఎదురు చూచే అవసరం రాకుండా మాట్లాడుతూనే ముమ్మారు ఓంకారం చేసి తనువు చాలించారు. ఎవరి పిలుపు లేకుండానే మైపాడు నుండి శ్రీస్వామివారే వచ్చి తన స్వహస్తాలతో వీరిని సమాధి చేసి సద్గతి నిచ్చారు. ఎవరేమి లోకాభిరామాయణం వీరికి చెపుతున్నా చెప్పవద్దని మాత్రం చెప్పరు. తాను వింటున్నట్లు నటిస్తారు. కానీ తాను ఊకొట్టేదానికి అవతలివాడు చెప్పేదానికి సంబంధముండేది కాదు. కొంత సేపటికి ఈయన వినడంలేదని తెలుసుకొని ఆ చెప్పేవాడే లేచి వెళ్ళి పోయేవాడు. తన నోటిని, చెవులను అంతగా నిగ్రహించి గురుసేవకే తన శరీరాన్ని వినియోగించాడు. మీరు అలానే చేసి వారు పొందిన కైవల్యం పొందండని శ్రీస్వామివారు పదే పదే చూచి నేర్చుకోమంటున్నారు.

1. ఆకలై కొంగు పట్టేవాడికి అన్నం పెట్టాలయ్యా! బ్రేవ్‌మని తేపేవాడికి కాదయ్యా. శ్రీస్వామివారు పర్యటించే గ్రామాలు చాలా చిన్నగ్రామాలు. ఆనాడు అచ్చటి హోటళ్ళు, మెస్సులు అంటే పూటకూళ్ళ ఇండ్లు ఉండేవికావు. శ్రీస్వామివారి దర్శనార్థం అనేక మంది ఎంతో వ్యయ ప్రయాసలతో వచ్చేవారు. ఆ వచ్చిన అతిథులకు భోజనం వండి పెట్టేటట్లు శ్రీస్వామివారు తన సేవకులను ప్రేరేపించేవారు.

నేడు సమాజములో అన్న సంతర్పణలనే పేరుతో జరిగే కార్యక్రమాలు ఎంతో జుగుప్సాకరంగా తయారైనవి. ఆకలై కొంగు పట్టే అభాగ్యులను దూరంగా గేటవతల ఉంచి మనకు కావలసిన వారికి, చందాలిచ్చినవారికి, వారికి ఆకలి ఉన్నా లేకపోయినా బ్రతిమాలి ప్రసాదంగా ఒక్క ముద్దయినా తినమని చెపుతున్నాము. గేటవతల ఉండే హృదయాలు ఆకలిచే బాధించబడి మన

కార్యక్రమాన్ని శపించక మానదు. సర్వసాక్షియైన శ్రీస్వామివారు ఇట్టి అజ్ఞానాన్ని సహించరు.

**సర్వసమర్థుడు:-** అనవసరమైన ఆలోచనలుమాను. అదంతా అహంకారమే. గతాన్నిగూర్చి నీ ఆలోచనలు, భవిష్యత్తును గూర్చి ప్లానులు అన్నీ నీ అహంకారమునకు గుర్తు. వాటిని మాని నీ అహంకారమును హతమార్చుకో. నీకు అవసరమని నేను తలిస్తే అది తప్పక చేస్తాను అని ఒక అద్భుతలీల చూపారు. మా ఇంట్లో రెండు నిమ్మచెట్లున్నాయి. వాటిలో ఒకటి కమలాపండ్లచెట్టు. రెండవది నారదబ్బకాయల చెట్టు, మొదటికాపుకు కమలాపండ్లు పది మాత్రమే కాచాయి. నారదబ్బకాయలు గుత్తులు గుత్తులుగా కాశాయి. కమలాపండ్లు తిన్నాము. నారదబ్బకాయలు ఒకటి కూడా తినలేదు. అన్నీ అందరికీ ఇచ్చేశాము. ఈచెట్టు అడ్డము. అందరికీ కోసి ఇవ్వాలి, దీని వల్ల ఇంట్లోకి గాలిరాదు అని కొట్టేశాము. కమలాచెట్టు ఉంది. దానికి ఎంతో పేడ ఎరువు వేశాము, వేపపిండి ఇవన్నీ వేశాము. రెండవ సంవత్సరము ఆ కమలాచెట్టు నారదబ్బకాయలే కాసింది. ఇది చిత్రముకాదా? మొదటి సంవత్సరం కమలాకాయలు, రెండవ కాపు నారదబ్బకాయలు కాయడమేమిటి? ఈ దివ్యలీలద్వారా "ఓరీ అజ్ఞానీ భవిష్యత్తును గూర్చి (అంటే మరుక్షణాన్ని గూర్చి) ప్లాను వేయవద్దు అని భోదిస్తున్నారు. జీవితధ్యేయాన్ని అనుక్షణము మర్చిపోకుండా గుర్తుంచుకో, నీ కవసరమని నేను తలచిందంతా నీవు అడగకుండానే నేను సమకూరుస్తాను" అని భగవంతుడు అభయమిచ్చాక గూడా ఇంకా భవిష్యత్తును గూర్చి యోచించడం, గతాన్ని గూర్చి బాధపడడం ఎంత గొప్ప అవివేకమో, అహంకారమో బాగా యోచించమని తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

ఓ అనంత ప్రేమైకమూర్తీ! ఓ సాటిలేని సద్గురోత్తమా! అనుక్షణమూ నేను నిన్ను తలవని క్షణాలలోగూడా నా యోగ



క్షేమములు వేయి కండ్లతో కనిపెట్టిచూస్తూ తగు విధంగా నడిపిస్తున్నావనే ఏమారని ఎరుక ఇకమీదటనైనా కల్గి నా ధ్యాసంతా త్రికరణశుద్ధిగా తమ స్మరణలో దివ్యలీలా చింతనలో గడిపేటట్లు చేయవే వరదా!

నూతేటి శ్రీరాములునాయుడుగారి అద్భుతమైన అనుభవాలు చదివి పరవశించండి. ఇంతటి మహనీయుని దరిచేరిన మన అదృష్టము పుణ్యఫలము ఎంత గొప్పవో బాగా అవగాహన చేసుకొని ఆచరించి తరించమంటున్నారు.

మొదటి అనుభవం పుల్లనిమ్మపండు కోసి నివేదనకు పెట్టిన కొంతసేపటికి పేలపిండి నివేదిస్తే నివేదించిన ఆ పేలపిండి మాత్రము పుల్లనిమ్మపండంత పులుపుగా ఉంది. నివేదనకు పెట్టని పేలపిండి తియ్యగానే ఉంది. బోధ ఏమిటి? నీవు ప్రీతితో తినే పదార్థాన్నే నివేదించాలి. నీవు తినలేని పదార్థం నివేదించరాదని తెలుసుకొని చూచి నేర్చుకోమంటున్నారు.

మరొక అనుభవం:- శ్రీరాములునాయుడు తన తోటలోని గుడిశలో ఆవు పంచితం చల్లాడు. ఒక రెండు చుక్కలు శ్రీస్వామివారి పటంమీద పడుంది. పంచితం పడినా మంచిదే అని వదిలేశాడు. ఆరోజు పూజానంతరం శ్రీస్వామివారి చిత్రపటం దగ్గర కూర్చున్నప్పుడు తన తలపై ఏదో ద్రవం పడితే బల్లి ఉచ్చపోసిందని పైన చూస్తే బల్లి లేదు. ఆ ద్రవం వాసన చూస్తే ఆవు పంచితం వాసన. తలమీద ద్రవాన్ని తుడిచేసుకున్నాడు అసహ్యంతో అప్పుడు వారికి ఆత్మబోధ ద్వారా చెప్పారట "అయ్యా నీపైన పంచితం పడితే అసహ్యించుకొన్నావే, నాపైన పడితే తుడవకుండా వదిలేశావు ఏమిటి" అని ఆత్మబోధ చేశారు. 'అది చిత్రపటమేగదా అనే స్వల్పమైన భావన సమ్మూలనంగా

వదలి నేనే అక్కడ పటంరూపంలో ఉన్నాననే భావనతో నాకు పూజ నివేదనలు, భజన, స్తోత్రము వగైరా సేవలు చేయమని బోధిస్తున్నారు. మనం ఈలీల చదివి ఇలాంటి వెన్నైనా నేర్చుకోవచ్చు. నేను సర్వజ్ఞుడను అనుక్షణము నీ సర్వక్రియలు గమనిస్తూ నిన్ను నడిపిస్తాను. అయితే నీవు నా సూచనలు విని ఆచరించాలిగదా' అని జాలిగా మనవైపు చూస్తున్నారు.

ఆవిధంగా చూచి నేర్చుకొని జననమరణ చక్రము నుండి తప్పించుకొనే సంస్కారము మనకెలావస్తుంది? అనేదే సమస్య. దీనికి 'వార్తాలాపం'లో శ్రీప్రకాశనందస్వామిగారు విపులంగా చెపుతారు. సత్వగుణ ప్రధానంగా మన శరీరతత్వం మారాలి. రజస్సు, తమస్సు ఎంత పర్‌సెంట్ తగ్గితే అంతగొప్పగా చూచినేర్చుకోగలుగుతాము. 'సాత్వికత్వము ఎలా వస్తుంది' అని అడిగిన భక్తునితో శ్రీప్రకాశనందగారు 'శాస్త్రపఠనము, శాస్త్రమననము, సత్సంగము, సద్గురుసేవ, సద్గురు సాన్నిధ్యముల ద్వారా సాత్వికము, శుద్ధసాత్వికముగా మార్పుచెందుతుంది. క్రమేణా రావలెనేగాని ఆశపడి ఇంకా సత్వగుణం రాలేదేం అని నిరుత్సాహ పడరాదు' అన్నారు. వాచా శూరత్వం మాని క్రియాశూరత్వం చూపమన్న శ్రీభరద్వాజమాష్టరుగారు 'ఆహార శుద్ధికావాలి. అంటే శాకాహారమే అనే అపోహమానండి. ఇతరుల సొత్తు కాకుండా కష్టార్జితం తినండి. త్రికరణశుద్ధి పాటించండి. పరుల దోషాలు చూపడం మానండి అన్నారు. ఇష్టమున్నా లేకున్నా టైంటేబుల్ ప్రకారం పనిచేయాలి, ధర్మమార్గంలో జీవితం గడపాలి. ఇలాంటి వెన్నో ఆచరించక త్వరపడితే రాదు, బాధపడితే రాదు. శ్రీస్వామివారు చెప్పిన పంచశీల సందేశం పాటించాలి. 1. సత్యం, 2. ధర్మం, 3. సంపన్నత్వం, 4. సాధారణత్వం, 5. సద్గురుసేవ చేసి తరించాలి' అంటారు.



అవధూతలీల 70వ పేజీ - కష్టం చేస్తూనన్నా ఉండు. దేవుని ధ్యానం చేస్తూనన్నా ఉండు, రోగంతో మూలుగుతూ నన్నా ఉండు, దరిద్రంతో బాధపడుతూనన్నా ఉండు. ఈ నాలుగు దశలలోను మానవునకు భగవంతుడు గుర్తువస్తుంటాడని గాబోలు శ్రీస్వామివారు అలా చెప్పారు. కష్టంచేస్తూ మనస్సంతా సంపూర్ణంగా పనిలో నిమగ్నంచెయ్యి. ఇది గురువాజ్ఞ కొరకే చేస్తున్నాను. ఆ మహనీయుడు మనకిచ్చిన పని క్షుణ్ణంగా చేయడమే మనధ్యేయం కావాలి. దైవధ్యానం చేస్తూనన్నా ఉండు, లోకచింతన మాను, గతాన్నిగూర్చి యోచనచేయకు అలాచేస్తేనే వర్తమానంలో నివసించగలిగి దైవకృప పొందుతావు అని బోధిస్తున్నారు. రోగంతో మూలుగుతూనన్నా ఉండు. అప్పుడు కూడా వైర భక్తిచే దైవాన్ని నిందిస్తూనో లేక నవవిధభక్తులలో దేనిచేతనైనా దైవధ్యాస చేస్తుండు. లోక చింతన మాని ఆలోచనా స్రవంతిని అరికట్టు. మనము అనుకొనేవి, ప్లాన్ చేసేవి ఏవీ జరుగవు. జరిగేదంతా ఆయన సంకల్పమే. ఒకవేళ గ్రుడ్డిగా చేసిన ఆలోచనలు దైవసంకల్పం ఒకటే అయి కొన్ని జరుగవచ్చు. అంతమాత్రం చేత నా యోచనా ప్లాన్‌వల్లనే జరిగిందనుకోవడం శుద్ధ అజ్ఞానం. "అణువును విచ్ఛేదం చేస్తే అనంత శక్తి ఆవిర్భవించినట్టు అహంను విచ్ఛేదం చేస్తే సచ్చిదానంద పూర్ణమైన పరమాత్మ లభ్యమవుతుంది" అన్నారు శ్రీరమణ భగవాన్. అహంను విచ్ఛేదం చేయడమంటే భవిష్యత్తును గూర్చి ప్లాన్లు వేయడం అహంకారము యొక్క ప్రత్యేకరూపమని నాకు తోస్తుంది. ఇదే ఆచార్య శ్రీభరద్వాజగారు "Live in the present - వర్తమానంలో ఉండు. వళ్ళు దగ్గర పెట్టుకొని ఉండు" అంటారు.

శ్రీస్వామివారు మహాసమాధి చెందారు. ఇప్పుడేమి చూచి నేర్చుకోవాలి అనవచ్చు. "పొయ్యేదెక్కడికయ్యా, సూర్యచంద్రులు

ఉన్నంతవరకు ఉండేదేగదయ్యా" అన్నారు గనుక నేడు అదృశ్యంగా చైతన్యరూపుడై అంతటా నిండి నిబిడీకృతమై ఉన్నారు. ఏమి చూడాలి? ఎక్కడ చూడాలి? "వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది" అన్నారు. సమాధి అనంతరం లీలలలో ఊహకందని లీలలు చేశారు. ఉడతా రమణయ్య అనే గొలగమూడి నివాసి రెండు రైలు పట్టాల క్రిందపడి రైలు వారిపైన వెళ్ళిపోతే బ్రతికే అవకాశముందేమో యోచించండి. కానీ బతికాడు. మరలా రైల్వే కీ మాన్‌గా డ్యూటీలో చేరాడు. వారికి చదువు వచ్చినా పారాయణ చేసే అవకాశము లేదు. పూజ చేసే వ్యవధిలేదు, ప్రదక్షిణలు చేసే వ్యవధిలేదు. కానీ ఇంత పెద్ద ప్రాణగండమైన ప్రమాదము నుండి శ్రీస్వామివారే రక్షించారంటాడు. ఎందుకు రక్షించారని మీరడిగితే ఆయన జీవిత విధానమే అందుకు కారణము. రైలుగేటు దగ్గర యాత్రికుల కొరకు బావి త్రవ్వించి వరలు దించి బావిచుట్టు సిమెంటు పూయించాడు. ఆ బావి వలన తనకు అవసరము లేకున్నా అన్నిజీవులలో ఉన్న శ్రీవెంకయ్యస్వామివారి కొరకు చేయించాడు. అలాగే అనేక ధర్మకార్యాలు తాను కష్టపడి చెమటోడ్చి సంపాదించిన దానినుండి చేస్తున్నాడు. అదే నిజమైన భక్తి. అలా అందరిలోని శ్రీవెంకయ్యను చూచి నిష్కామకర్మగా చేస్తూ, నిష్కామకర్మ సకామకర్మ గాకుండా జాగ్రత్తగా చేస్తుంటే శ్రీస్వామివారి సంపూర్ణకృప కలుగుతుంది. ఇతరజీవులకు బాధకల్గించని రీతిని మన జీవితం ద్వారా ఇతరులకు ఉపకారం జరిగే విధంగా జీవించడం ముఖ్యమని చూచి నేర్చుకోమంటున్నారు.

చూచి నేర్చుకోమంటే కంటితోనే చూడమని కాదు. చెవితో విన్నా చూచినట్లే. ఎందుకు? ఆ వినే విషయానికి తగ్గ బొమ్మలు మనసులో మెదులుతాయి గదా. "పని చేయకున్నా డబ్బు వస్తుంది.



కాని అది దక్కదు" అన్నారు. ఈమాట నేటికే కాదు, ఏనాటికైనా నూటికి నూరుపాళ్ళు సత్యం. "మోసం నాశనం" అన్నారు పెద్దలు. ఏ వృత్తికైనా ఇది వర్తిస్తుంది. సత్యం, ధర్మం అనే శ్రీస్వామివారి మాటకు ఇది విరుద్ధము కదా. అలా నడవకపోబట్టే ఎన్ని ఆస్పత్రులు వచ్చినా రోగులు పట్టడంలేదు. శ్రీస్వామివారున్నారు గనుక అందరి రోగాలు తగ్గించుచున్నారా? అని కొందరు మేధావులు అనవచ్చు. అందరి పూర్వ కర్మలు వాటి బరువులు ఒకే విధంగా ఉండవు గదా. అందరికీ నయం చేయడం అధర్మమవుతుంది. ఇప్పుడు మనం సాధనచేసి పూర్వపు చెడ్డకర్మ తొలగించుటకు శ్రీస్వామివారిని మెప్పించాలి. అందుకే శ్రీస్వామివారు "వాళ్ళుండేదాన్ని బట్టయ్యా మనముండేది" అని చెప్పారు. ఇది బాగా యోచిస్తేనేగాని 'పనిచేయకున్నా డబ్బు వస్తుంది కాని అది దక్కదు' అన్న శ్రీస్వామివారి మాట బాగా హృదయగతం కాదు. ఆ మాట హృదయగతమైనవారు అధర్మమార్గములో పొమ్మన్నా పోలేరు.

శ్రీస్వామివారు ఆచరించి చూపిన మార్గమే మానవులందరికీ ఆచరణీయము.

1. విద్యార్థులకు, 2. గృహస్తులకు, 3. సన్యాసులకు, 4. వానప్రస్థులకు, 5. అత్యాశ్రమీయులకు అందరికీ వారి ఆచరణలో ఏది కావలసిన వారు దాన్ని ఆచరించి తరించమని చూచి నేర్చుకోమన్నారు.

విద్యార్థులకు :- 1. కాకదృష్టి,2. బకధ్యానం, 3. జీర్ణ వస్త్రం, 4. మితాహారం శాస్త్రములలో చెప్పబడింది. నేటి విద్యార్థులు వీటిలో ఏదీ ఆచరించడంలేదు. ఎవరైనా ఒక విద్యార్థి లోకోపకారం ఏదైనా కనిపెట్టాడండే అట్టి మహనీయుడు పైవిషయాలు తెలియకుండానే ఆచరించి ఉంటాడు. నూటికి నూరు మంది విద్యార్థులు పై

విషయాలు ఆచరించక తమకు తెలియకనే భగవంతునికి ఋణపడుచున్నారు. మంచి మేధస్సు, ఆరోగ్యము, సంపద, చదువుకునే అవకాశమిచ్చినా భగవంతుని కృపను చేతులారా జార విడుచుకొనుచున్నారు. మేము MBBS, ఇంజనీరింగ్, సాఫ్టువేర్ చదివామని చాలా డబ్బు సంపాదిస్తున్నామని గర్వం తప్ప వారు తమ సబ్జెక్టులో ఎంత నిష్ణాతులు అయియున్నారో తమ డిగ్రీలు ఎన్ని మార్లు తప్పిపోయి ఎంత కొద్ది మార్కులతో పాసయ్యారో చూచుకోవాలిగాని, తాము ఎంత సంపాదిస్తున్నామన్నది లెక్క కాదు. పనిచేయకున్నా డబ్బువస్తుంది. కానీ డబ్బు దక్కదు అంటారు శ్రీస్వామివారు. పోగా తాను ఉద్యోగంలో చేసిన తప్పిదాలన్నింటికీ భగవంతునికి లెక్క చెప్పవలసి ఉంటుందనే విషయం ఏనాడైనా ఆలోచిస్తున్నారా? సాటిజీవులెన్ని కష్టాలు ఇబ్బందులు తన మూలాన అనుభవిస్తున్నారో యోచించారా? ఆ జీవులకు తాను కల్గించిన బాధలకు వడ్డీతో సహా తాను అనుభవించవలసి ఉంటుందని గుర్తించ మంటున్నారు శ్రీస్వామివారు. పూర్వ జన్మలో ఆవును కొట్టిన కారణంగా తన కాళ్ళు పోయాయని తెలిపారు. ఇది అన్ని రంగాలలో వర్తిస్తుంది. విద్యార్థులు ప్రేమకలాపాలు, రుచులకొరకు ప్రాకులాడడం. ఫ్యాషన్ పేరుతో విపరీత వస్త్రధారణ లాంటివి మానమని శ్రీస్వామివారి హెచ్చరిక.

ఇంద్రియాణాంహి చరతాం యన్మనోనువిధేయతే
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివాంబసీ

"ఇంద్రియములలో చరించు మనస్సు యొక్క ప్రజ్ఞ హరించ బడును. ఎట్లా అంటే గాలిచేత పడవ వేగము హరించ బడునట్లు", అంటున్నారు. గనుక శ్రీస్వామివారి ఆచరణే మానవాళికి గొప్ప బోధ.



శ్రీస్వామివారు గృహస్థులకొరకు ఎన్నో బోధలు చేశారు. కానీ వాటిని ఆచరించేవారే అరుదు. ఒకామె దగ్గరికెళ్ళి అంత ముద్ద పెట్టమన్నారు. ముద్దలేదని కసురుకుంటూనే సంగటి ముద్ద వేసింది. నాలుకకు అడ్డం వేయమంటే లేదంటూనే పచ్చడి వేసింది. నాలుకకు అంత ధారవేయమంటే లేదంటే లేదని చాలా పరుషంగా మాట్లాడింది. ఉట్టి తెగి క్రిందపడి నెయ్యంతా నేలపాలైంది. గృహస్థులు తమ దగ్గర ఉన్న వస్తువులను భగవంతునిపేర దానధర్మాలకు ప్రేమతో ఇవ్వమంటున్నారు. దీనిని ఆచరిస్తే జన్మ జన్మలకు దారిద్ర్యమే మన ఛాయలకు రాదని బోధిస్తున్నారు.

శ్రీస్వామివారికి ఆశ్రయమిచ్చిన, కూలిచేసుకునే అక్కిం వెంకట్రామిరెడ్డిగారికి మిద్దె కట్టించారు. భుక్తికి డోకాలేకుండా నిమ్మచెట్లు నాటించారు. రెడ్డిగారి కుమారునకు మంచి సంబంధము తెచ్చి వివాహం చేశారు. రెడ్డిగారి కుమారుడు ప్రేమలో పడి వర్ణాంతర వివాహం చేసుకోబోతే దాన్ని జరుగకుండా చేశారు.

భక్తి శ్రద్ధలతో తనకాతిధ్యమిచ్చిన చిలకలమర్రి దేవుడయ్యాగారి ఇంటిలో ఈశాన్యం వైపు అంబలి పోసిన క్రొత్తకుండ భూమిలో పూడ్చి సిరిసంపదలిచ్చారు. మునికూటి రామయ్యగారింటిలో మంచినీళ్ళ బానక్రింద బియ్యంపోసి వారికి సిరిసంపదలిచ్చారు.

హృదయపూర్వకంగా తనను సేవించిన T. వెంకయ్యను "మీరు నన్ను వదలినా నేను మిమ్ములను వదలను" అని ఆశీర్వదించి ఎంతో సిరి సంపదలేకాక కుమారునికి పదివేల రూపాయల ఉద్యోగం ఇప్పించారు.

తనకు పెట్టేందుకు ఏమీలేదని చెప్పలేకున్న ఇల్లాలు మనసు గమనించి ఆమెనుండి మిరపొడి స్వీకరించి సుఖశాంతులు అనుగ్రహించారు.

ఏ పూర్వపుణ్యమో నేనెప్పుడూ శ్రీస్వామివారి దగ్గర కూర్చోవడం తప్ప వారికేనాడు ఆతిథ్యమివ్వనేలేదు. కానీ నన్ను ఆయాసం బాధనుండి విముక్తుని చేయడమేగాక కలిచేడులోని టీచర్ ఉద్యోగం విరమింపజేసి ఆ మహనీయుని దివ్యసన్నిధిలో ఉంచుకొన్నారు. అంతేగాక అవధూతలీల గ్రంథం, స్వామిసన్నిధి, బోధామృతం, గురుస్తుతి, మరియు పదకొండు చిన్న పుస్తకాలు, చూచినేర్చుకో అనే ఈ గ్రంథాలన్నీ ప్రచురించే దివ్యభాగ్యం కల్పించారు.

నేనెక్కడా ప్రయత్నించ కుండానే నా కొమార్తెకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పదవ తరగతి సర్టిఫికేట్‌తోనే ఉద్యోగం ఇచ్చి ప్రస్తుతం ఇరవైవేల రూపాయలు జీతమిస్తున్నారు.

నా ప్రమేయం లేకుండానే పంజాబ్ నేషనల్ బ్యాంకులో పనిచేసే అదే కేడర్ అల్లుణ్ణి తెచ్చారు. అల్లుడు, కొమార్తెకు సొంత భవనం ఏర్పాటు చేశారు.

పైసా చేతలేని నాచేత మిద్దెఇల్లు కట్టించి అందులో పునాదుల నిర్మాణానికి లక్షరూపాయలు లేకుండా తొమ్మిది అంకణముల ఇంటికి భూమిలో ఒకే బండ ఉండేటట్లు చేయడమేగాక కనీసం యాభై వేలరూపాయలు బేలుదారుకు ఇవ్వకుండా నా పాత విద్యార్థి కేవలం అన్నం తిని మిద్దె ప్రహరీలు పూతపనితో సహా చేయించి ఒకలక్షా యాభైవేలు అనుగ్రహించారు.

సాధన చేసుకుంటూ ఎక్కడ ఉండమంటారన్న భక్తునితో ఒక్క దూలం ఇల్లు వేసుకొని ఎక్కడైనా ఉండమన్నారు. ఇక్కడ



శ్రీస్వామివారు సర్వస్య శరణాగతి చేసి భగవంతుడొక్కనినే నమ్మి వారిపైననే ఆధారపడి జీవించమంటున్నారు. ఇంటికి ఆధారం దూలము. కప్పంతా దానినే ఆధారంగా జేసుకొని నిలుస్తుంది. సాధకునికి భగవంతుడొక్కడే ఆధారంగా జేసుకొని సాధన సాగించమన్నారు.

లోకంలో ఈషణత్రయం (ధారేషణ, ధనేషణ, పుత్రేషణ- ధార అంటే భార్య, ధనం అంటే ఆస్థిపాస్తులు, పుత్ర అంటే బిడ్డలు, చుట్టాలు, స్నేహితులు) వదలక అనే మనకు ఆధారమని నమ్మి వారి కొరకు అధర్మంగా జీవించేందుకు వెనుకాడము. ప్రాణ, విత్త, మానభంగ మందు బొంకవచ్చు అనేమాట అడ్డుపెడతారు. ఈ మాట రాక్షస గురువు శుక్రాచార్యులు చెప్పారు. మానవులమై దైవాన్నే నమ్మినవారు శుక్రాచార్యుల రాక్షస నీతి పాటిస్తే దైవకృప పొందగలమా? పొందలేము. పదిరోజులకి సరిపడే బియ్యం 30 రోజులకు సరిపోయేటట్లు చేసిన మహనీయుడు. ఇల్లు కట్టుకునే స్తోమతలేని అక్కిం వెంకట్రామిరెడ్డిగారికి మిద్దె ఇల్లు కట్టించారు. నాకు మిద్దె కట్టుకునే స్తోమతలేకుంటే లక్షాయాభై వేల రూపాయలు ఖర్చులేకుండా 9 అంకణముల ఇంటి ప్లానంతా ఒకే బండ చేశారు. పునాదులు కట్టే అవసరం పోయింది. ఇలాగా ఒక పుస్తకము నిండా వ్రాయవచ్చు.

ఇలాంటి అనుభవాలు పొందేవిధంగా వారు బోధించిన పంచశీల సూత్రం వెంట్రుకవాసి తేడాలేకుండా ఆచరిస్తూ ఉంటే - దైవాన్నే నమ్ముకునే ధైర్యం వస్తుంది.

శ్రీస్వామివారికి అక్షరాలుకూడా రావు. సర్వస్య శరణాగతి అనే మాటలు వాడకుండా పామరభాషలో పొడిమాటలు చెప్పి తత్వం బోధించి చూచి నేర్చుకోమన్నారు. వినగలిగితే వారినోటి నుండి వచ్చిన ప్రతిమాట వేదవాక్కే.

## కులాలు

అ.లీ 185 వ పేజి. 14 లైను - బ్రాహ్మణులలో మాదిగ వాళ్ళున్నారు. మాదిగవాళ్ళలో బ్రాహ్మణులు ఉన్నారు. ఆయా వ్యక్తుల గుణాలను బట్టి కులంగాని, జన్మను బట్టి కులం కాదని స్పష్టంగా బోధిస్తున్నారు. గనుక కులాన్నిబట్టి నేను పెద్ద కులంవాణ్ణి అనే గర్వం తగదు. కులానికి తగిన గుణం కల్గి ఉండడం ప్రధానమని బోధిస్తున్నారు. ఏకులమైనా గుణమే ప్రధానము. అందరిలో శ్రీస్వామివారిని చూచే గుణం రానిదే మనకేమీ వరగదు. అహంకారమే గొప్పదై మనలను పతనం చేస్తుంది.

## తినేపదార్థాలు, ఉపచారాలు

"చెప్పింది చెప్పినట్లు చేయడమే సేవ, మిగిలినదంతా వేషాలు" అంటారు శ్రీరమణమహర్షిగారు. అలాగే శ్రీస్వామివారు "నీవు ప్రీతితో తినే పదార్థమే నివేదించాలి, నీవుతినేందుకు ఇష్ట పడని పదార్థం నివేదించరాదని బోధిస్తున్నారు. ఒకరోజు శ్రీరామయ్యా అనే భక్తునకు నివేదనకేమీలేక శ్రీస్వామివారి పటానికి పుల్లనిమ్మకాయ రెండుగా కోసిపెట్టి నివేధించాడు. దాన్ని ప్రసాదంగా తాను తీసుకోలేడుగదా. కొంతసేపటి తరువాత ఇంటినుండి పేలపిండి పంపితే ఒక ముద్దను శ్రీస్వామివారికి నివేదించి కొంచెం కళ్ళద్దుకొని నోటిలో వేసుకొన్నాడు. అది పులుపు రొడ్డుగా ఉంది. ఇదేమిటి బెల్లంవేయవలసినదాంట్లో పుల్లనిమ్మరసం పోసిచేశారు అని ఆ ముద్ద పేలపిండి పారేశాడు. రాత్రికి తిందామని ఉంచుకున్న మరొక పేలపిండి ముద్ద నుండి కొంచెం నోట్లో వేసుకుంటే కమ్మగా తియ్యగా ఉంది. ఇదేమిటి స్వామి ఇట్లా ఉంది అనుకుంటే "నీవు తినేందుకు పనికిరానిదానిని నాకెందుకు నివేదించావు" అని ఆత్మబోధ చేశారు.



ఆవు పంచితం కొందరు తీర్థంగా తీసుకుంటారు. మరి కొందరు కంటికి మంచిదని కళ్ళలో వేసుకుంటారు. ఒకరోజీభక్తుడు తన పూజాగృహంలో పంచితం చల్లుతుంటే శ్రీస్వామివారి చిత్రపటం మీద కొంచెం పడింది.. పంచితం పడితే మంచిదిలే అని తుడవకుండా వదిలేశాడు. కొంత సేపటి తరువాత తన నెత్తిన ఏదో ద్రవం పడినట్లుంటే బల్లి మూత్రం పోసిందని పైన చూస్తే అక్కడ బల్లిలేదు. చేతితో దాన్ని తాకి వాసన చూచాడు, అది ఆవు పంచితం వాసన ఉంది. ఛీ ఛీ అని తుడిచేసుకున్నాడు. అప్పుడు శ్రీస్వామివారు "నీపైన పడితే అంతగా అసహ్యించుకొని తుడిచేసుకున్నావే నా పైన పడితే తుడవ కుండా వదిలేశావే?" అని ఆత్మబోధ చేశారు.

గనుక మన శరీరానికి ఉపచారాలు చేసుకున్నట్లే శ్రీస్వామివారి చిత్రపటానికి సేవచేయాలని, అతి చల్లని అతి వేడి పదార్థములు నివేదించరాదని, నివేదనలు ప్లేటులో పెట్టి నివేదించాలిగాని నేలమీద పెట్టి నివేదించరాదని బోధించారు.

192వ పేజి (అ.లీ) 3వ పే. పెనుబర్తిలోని శ్రీరాముల శెట్టిగారు శ్రీస్వామివారిని ఆశ్రయించాక, తన కుష్టు వ్యాధి నివారణైంది. కానీ ఆయన శ్రీస్వామివారు చెప్పిన స్త్రీ పథ్యము, నియమాలు పాటించలేదు కనుక అతనికి మరలా ఆ వ్యాధి సంక్రమించింది. శ్రీస్వామివారి మాట ఆచరించాలనే జ్ఞానం రావాలి. అదే అనుభవము అనే కాపీనం బిగించి అని శ్రీజ్ఞానేశ్వర్‌మహారాజ్ చెప్పినదానికి అర్థము. శ్రీస్వామివారి ఆజ్ఞ వెంట్రుకవాసి తేడాలేకుండా ఆచరించాలి. అలా ఆచరించలేము. ఎందుకు? మన సంస్కారాల బలం మరియు పాప ఫలము అంత బలీయమైనవి. మన లెక్కలో పాపం కంటే పుణ్యముంటే తప్పక కరుణించి

మనలను చక్కని మార్గంలో నడుపుతారు. లేకుంటే పొయ్యేవాళ్ళను పోనిచ్చేదిగదయ్యా అంటారు. 198 పే (అ.లీ) పెంచలకొండంత మసీదు పడుతుందయ్యా అన్నారు. పెంచలకొండంత దేవాలయము పడుతుందనవచ్చు గదా అలా అనలేదు. మసీదు అంటున్నారు. అంటే నాకు మతబేధం లేదు అంటున్నారు. నేను మతాలు అనే దౌర్భాగ్య భావాలకు అతీతుడను. అన్ని మతాలు బోధించే బోధ ఒక్కటే అంతట ఉన్న పరమాత్మను దర్శించే ప్రయత్నం చేయండి ఆశను వీడండి, భగవంతుడు ఏ పరిస్థితిలో ఉంచితే ఆ పరిస్థితిలో తృప్తిగా జీవించు. ధనార్జనే ధ్యేయము కాదు. సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవే అన్ని మతాలు బోధిస్తున్నాయి. భగవంతుని బోధలను ఆచరణకు తెచ్చుకో. అన్ని మతాలు చెప్పేది ఒక్కటే అని మతబేధమే లేదని బోధిస్తున్నారు.

వైద్యుల సుధాకర్ మరదలు గీతా భవాని మ్రొక్కు చెల్లించేందుకు శ్రీస్వామివారి సమాధి మందిరానికి వచ్చి నిద్రచేస్తే నిద్రలో శ్రీసాయినాథుడు ఆమెకు స్వప్నదర్శనమిచ్చి దారమిస్తారు. రూపాలు వేరైనా దైవత్వం ఒక్కటేనని చెపుతున్నారు.

నీ చుట్టూనున్న ప్రకృతిని చూచి నేర్చుకోమంటున్నారు. అగ్ని, నీరు, గాలి, ఆకాశము, భూమి మొదలుకొని వృక్షములు, మిగిలిన ప్రాణులను చూచి నేర్చుకోమంటున్నారు. తనజాతి నిలుపు కునేందుకు మామిడి చెట్టు ఒక్క కాయమాత్రమే కాస్తుందా? లెక్కలేనన్ని కాయలు కాస్తుంది. మానవులు, చిలుకలు, ఉడతలు, చీమలు ఎన్నో జీవులు తింటున్నాయి, ఎన్నో జీవులకు నీడనిస్తున్నాయి. బర్రెలు తన దూడకు చాలినన్ని పాలు మాత్రమే ఇస్తే పశువులను ఎవరు పెంచుతారు. తన దూడకు పోను ఎన్నో పాలు మనకు, మన పిల్లలకు, మన కుక్కలకు ఇస్తుంది. ఇలాగే



ప్రతియొక్క చెట్టు, ప్రతియొక్క ప్రాణి ఇతరులకు సహాయ పడుతుంది. ఒక్క మానవుడు మాత్రం అన్ని జీవులనుండి ఎంతో పొంది కూడా తను మాత్రం ఇతరజీవులకేమీ ఇవ్వకుండా స్వార్థ బుద్ధితో సర్వం దాచి పెట్టున్నాడు. ఇతరులకు సహాయం చేసే బుద్ధిని ప్రకృతిని చూచి నేర్చుకోమంటున్నారు.

అగ్ని, నీరు, గాలి, ఆకాశము, భూమి ఇవన్నీ శత్రు మిత్రులనే బేధంలేకుండా అందరికీ సహకరిస్తున్నాయి. ఒక్క మానవుడు మాత్రమే తనవారు తనది వీళ్ళు ఇతరులు, శత్రువులు అనే భావాలతో స్వార్ధ చింతనతో, తన దుఃఖానికి తానే కారణమవుతున్నాడు.

### మ్రొక్కుబడులు చెల్లించడంలో జాప్యం

233-234 పే. (అ.లీ) గోనుగుంట రావమ్మ తన మ్రొక్కుబడి చెల్లించడంలో ఎంతో జాప్యంచేసింది. రెండుమార్లు స్వప్న దర్శనమిచ్చి శ్రీస్వామివారా బాకీ విషయం అడిగినా చలించలేదు. 50 రూ. మ్రొక్కుబడికి నూటముప్పై రూపాయలు ఫలానా తేది(19.12.85) లోగా కడుతానని ఆశ్రమంలో ప్రామిసరి నోటు వ్రాసి ఇవ్వమన్నారు. అంటే 18నెలలు ఆలస్యము చేసినందుకు 80.రూ. జుల్మానా విధించారు. జుల్మానా డబ్బుతో మాత్రమేకాక అనారోగ్యాలు, ఆర్థిక నష్టాల రూపంలో గూడా వుంటాయని మనం గమనించాలి. ఉదా: (అనారోగ్యానికి మ్రొక్కుకున్నారు. ఆరోగ్యం బాగైంది. 1సం॥ పైగా మ్రొక్కు తీర్చలేదు. మరలా అనారోగ్యం-నెల్లూరు వరకు వచ్చి అనారోగ్యానికి పరిష్కారము కొరకు డాక్టరు దగ్గరకెళ్ళాడు. డబ్బు ఖర్చు తప్ప ఆరోగ్యం మెరుగు కాలేదు. ఇక లాభం లేదని గొలగమూడికి రాగానే ఆరోగ్యవంతుడైనాడు).

ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎనిమిది సం|| వయస్సుగల పిల్లవాని ప్రార్థన మన్నించి పోలు మస్తానయ్య బర్రెను ప్రాణాపాయస్థితి నుండి క్షణంలో నయం చేసి రక్షించారు. ఆదిలాబాద్ జిల్లా భక్తునికి ఆపరేషన్ బాధలు తొలిగించారు. ఇలాంటి లీలలకు లెక్కలేదు. అంటే వారు సర్వవ్యాపి - దగ్గర దూరం అనేది లేకుండా విశ్వమంతా వ్యాపించి ఉన్నారు. మనకుండే శ్రద్ధా భక్తులననుసరించి వారు మనలను ఆదుకొని తీరుతారు.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి మహవీయులకే గురువున్నాడు. మీకు గురువులేడు పాడు లేడు ఏంది స్వామీ అన్న చెలమానాయునితో నేను పదవ చూపులో ఉన్నాను గురువెందుకయ్యా నా నెత్తిన అని అన్నారు. గనుక శ్రీస్వామివారికి గురువులేరని తలచరాదు. పూర్వం తానుచేసిన కఠోరదీక్షా ఫలితంగా సద్గురువు తారసిల్లి తనను నేడు తానున్న అద్వైతస్థితి ప్రసాదించారని అర్థము. ఈ క్రింది మాటలలో దీన్ని విశదపరిచారు. మీకు నాలుక మీద ఎవరో మహనీయుడు బీజాక్షరాలు వ్రాశాడటగదా! అది నిజమేనా స్వామీ అన్నవారితో "మైసూరు మహారాజు పోతుంటే చూస్తే మనకేమొస్తుంది. మనం చేసుకున్నదే గదా మనకు" అని కూడా అన్నారు. కష్టపడి ప్రతిభను ఆర్జించిన వారినే మైసూరు మహారాజు తన ఆస్థానంలో ఉంచుకొంటారు. అలాగే మనం కష్టపడి సాధన చేస్తేనే మైసూరు మహారాజు వంటి సద్గురువు తారసిల్లి మనకు మార్గము చూపుతారని భావము. గనుక ప్రతి ఒక్కరము శక్తినంతా వినియోగించి కృషి చేయాలి, శ్రీస్వామి వారు చెప్పినట్లు ఆశను పొగొట్టుకోవాలి. నీకు రావలసినవి వచ్చి తీరుతాయి అన్న రమణమహర్షి వాక్యము, ప్రతి ధాన్యపు గింజపైన అది ఎవరినోటిలోకి పోవాలో వ్రాసి పెట్టబడి ఉంటుంది



అన్న కబీరు వాక్యములపై సంపూర్ణ విశ్వాసం ఉండాలి. లోకం మెప్పుకోసం బ్రతకడం మానాలి. అన్నీ జీవులలో వెంకయ్య (భగవంతుడు) ఉన్నాడనే సేవాభావం అలవరచుకోవాలి. అప్పుడు మన మాచరించే సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం చక్కగా ఉంటే సద్గురుసేవ లభిస్తుంది. దానినే మైసూరు మహారాజు ఉదాహరణతో శ్రీస్వామివారు బోధించిన బోధ అర్థమయిందంటే చాలదు. హృదయగతం కావాలి, ఆచరణకు రావాలి. ఆచరణ సహజ సిద్ధం చేసుకొనే తీవ్రప్రయత్నం చేసుకోమని శ్రీస్వామివారు బోధిస్తున్నారు.

మీలో మాల, మాదిగ, జోగి, జంగం లేకుండా చూచుకోండి. అంటే మనలో మానవ సహజమైన అవగుణాలు లేకుండా నిర్మూలించుకోండని చెపుతున్నారు. ఉదాహరణకు ఇతరులను తప్పుపట్టడం, నిందించడమనేది ఒక దుష్ట సంస్కారము. దీని ద్వారా మన పుణ్యం అవతలవాడికి వాని పాపం కొంత మనకు సంప్రాప్తమవడమేగాక అందరిలోను దైవమున్నాడనే భావన క్రమంగా క్షీణిస్తుంది. ఆధ్యాత్మికంగా ఎన్ని సాధనలు చేసినా అలాంటి దుర్గుణాలు ఉన్నవారికి ఫలితం రాదు.

అందరికీ పంట పండించాను. దొంగలుపడి దోచుకోకుండా చూచుకోండి. పంట అంటే ఇక్కడ ఆధ్యాత్మికంగా అనుగ్రహించబడడం. దొంగలు పడి దోచుకోవడమంటే మనలోని చిన్న చిన్న బలహీనతల వల్ల వారి అనుగ్రహం మనకు లభించడం లేదని భావము.

"నేను అందరిలాగ పిచ్చెమ్మ, పెంచలనాయుడు గారికి కలిగాననుకున్నావా?"అన్నారు. అంటే తాను జనన మరణ రహితమైన ఆత్మయన్న జ్ఞానం కలిగియున్నాని, తనది దివ్యజన్మయని, తన కర్మలన్నీ దివ్యమయినవని చెపుతున్నారు.

తన చూపుకు సముద్రాలమీద అడ్డేలేదని నీవేది కోరుకుంటే అది అవుతుందని చెలమానాయుడు అనే సేవకునితో అన్నారు. అది అక్షరాల నిజమని ఆనాడేగాక నేడు మహాసమాధి అనంతరం కూడా సత్యమని నిరూపిస్తున్నారు. ఎందరికో మాట మాత్రం చేతనే డాక్టర్లు ఆశలొదిలేసిన కేసులను రోగవిముక్తులను చేశారు. నేడు ఆ మహనీయుని సమాధి దర్శనము చేతనే ఎన్నో సంవత్సరాలుగా బాధపడుతూ డాక్టర్ల మందులవలన నయంగాని జబ్బులు నయమవడం, ఏవిధంగా యోచించినా శిక్ష తప్పదనుకున్న కోర్టు కేసులు కొట్టివేయబడడం, మీకు సంతానమే కలుగదని డాక్టర్లు చెప్పినవారికి కూడ సంతానం కలగడం చూస్తున్నాము. ఆధ్యాత్మికంగా ఉద్ధరించమని వీరి మహాసమాధిని ఆశ్రయించినవారికి వీరి మార్గ దర్శకత్వము వలన ఎంతో గొప్ప అభివృద్ధి గల్గడం చూస్తున్నాము. ఇవన్నీ వారి జన్మ దివ్యమైనదని వారి కర్మలు కూడా దివ్యమైనవని నిరూపిస్తున్నాయి.

నేడు నీటి ఆవిరితో అన్నాలు వండే భవన నిర్మాణాలు, కోట్ల విలువ చేసే అన్నసత్రము, స్నానాల గదుల భవనాలు, బ్యాంకులో కోట్ల రూపాయల నిల్వలు, ఇవన్నీ వారి మహోన్నతమైన దివ్య మహిమకు నిదర్శనాలేగదా.

శ్రీస్వామివారికి కాళ్ళుపట్టుకపోయి వంగనప్పుడు ఎందరు బ్రతిమాలినా మందుతీసుకొనిగాని ఆధ్యాత్మిక శక్తితోగాని నయంచేసుకోను అంగీకరించరు. కర్మదోషాలను అనుభవించి తీర్చుకోవాలని శ్రీస్వామివారు మానవాళికి బోధిస్తున్నారు.

వారి దివ్యబోధలు అనంతములు. ఆ మహనీయుడు వ్రాయించిన వరకు వ్రాశాను. మన హృదయాలపై పనిచేసి వారి శుభమార్గంలో నడుపమని ప్రార్థిస్తున్నాను.



# మధర్ థెరిసా ఆశ్రమము గురించి ఒక్కమాట

నెల్లూరు భక్తవత్సలనగర్‌లో ఉన్న ఈ ఆశ్రమము కేవలం అనాథులకు మాత్రమే. అందులో చేరిన వారందరూ అనాథులు గనుక చనిపోయాక శవమును ఇవ్వరు. ఎవ్వరికి చెప్పరు. వారు బ్రతికినన్నాళ్ళు, ఇండ్లలోకంటే బాగా చూస్తారు. ఇద్దరు MBBS డాక్టర్లు, కొందరు నర్సులు, చిమ్మేవాళ్ళు, వంటవారు ఎందరో సిబ్బంది ఉన్నారు. ఎవ్వరికీ జీతం లేదు. వారివారి అంతస్తుకు తగిన వసతులన్నీ ఉచితముగా ఇస్తారు. మానవసేవే మాధవసేవ అనే సంపూర్ణ విశ్వాసంతో సేవ చేస్తుంటారు. వీరి అనాథాశ్రమాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయి. మనలాంటి ఉదారుల చందాలతోనే ఈ సేవా సంస్థలు నడుస్తున్నాయి. కోటానుకోట్ల రూపాయలు బ్యాంకులో ఉన్న శ్రీవెంకయ్య స్వామివారి సేవా సంస్థ చేయలేని పని ఈ పవిత్ర సంస్థవారు చేయుచున్నారు. 2003 సం॥లో ఐదుగురు అనాథులను గొలగమూడి ఆశ్రమము నుండి మధర్ థెరిస్సా ఆశ్రమానికి పంపియున్నాము.

విరాళములు MO లేదా DD లు పంపేవారు సాయి మాస్టరు సేవా ట్రస్టు, గొలగమూడి- 524 321 అడ్రస్సుకు పంపవలెను.

ఇట్లు<br>
శ్రీసాయి మాస్టరు సేవా ట్రస్టు<br>
గొలగమూడి.

# మా యితర ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి జీవిత చరిత్ర | 45 రూ॥ |
| 2. | అవధూత బోధామృతం - శ్రీవారి బోధలు | 15 రూ॥ |
| 3. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ వారితో వారి సేవకుల అనుభవాలు | 15 రూ॥ |
| 4. | అవధూత లీల (ఇంగ్లీషు) | 30 రూ॥ |
| 5. | భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి (ఇంగ్లీషు, చిన్నది) | 5 రూ॥ |
| 6. | వార్తాలాపము | 150 రూ॥ |
| 7. | అవధూత లీల (తమిళం) | 50 రూ॥ |
| 8. | శ్రీ వెంకయ్య స్వామి (తమిళం, చిన్నది) | 5 రూ॥ |
| 9. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 రూ॥ |
| 10. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 రూ॥ |
| 11. | శ్రీ వెంకయ్య స్వామి పూజ | 1 రూ॥ |
| 12. | వెన్నెలు పూలు - శ్రీ వెంకయ్యస్వామి దివ్యత్వం | 1 రూ॥ |
| 13. | సాయి కృప - కలిచేదు భక్తుల అనుభవాలు | 1 రూ॥ |
| 14. | దివ్యలీలలు | 1 రూ॥ |
| 15. | బోధ యజ్ఞాయ నమః | 1 రూ॥ |
| 16. | ధర్మమూర్తి | 1 రూ॥ |
| 17. | పిలిచిన పలికే దైవం | 1 రూ॥ |
| 18. | శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము. | 12 రూ॥ |
| 19. | శ్రీ స్వామి కృప | 1 రూ॥ |
| 20. | మౌన బోధ | 1 రూ॥ |
| 21. | గురుస్తుతి | 7 రూ॥ |
| 22. | శ్రీ బూర్లె రంగన్నబాబు గారి దివ్య చరితము | 6 రూ॥ |
| 23. | శ్రీ మాధవదాసు గారి దివ్య చరిత్ర | 4 రూ॥ |
| 24. | శ్రీ పూండి స్వామి వారి దివ్య చరిత్ర | 2 రూ॥ |
| 25. | శ్రీ యర్ర దర్గాస్వామి వారి దివ్య చరిత్ర | 5 రూ॥ |
| 26. | నమ్మలేని పచ్చి సత్యాలు | 1 రూ॥ |
| 27. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ॥ |
| 28. | చూచి నేర్చుకో | 8 రూ॥ |

## ఉచితము

1. మాష్టర్ గారి సత్సంగము
2. శ్రీ మాష్టారి మంచిమాట
3. శ్రీ భరద్వాజగారితో భక్తుల అనుభవాలు
4. మృత్యువుపై ఘన విజయము
5. స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః
6. స్మృతి రహిత ప్రసన్నాయ నమః
7. సర్వ సమర్థుడు
8. అమృత వాక్కులు
9. శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర
10. శ్రీ వెంకయ్య స్వామి (హిందీ)
11. శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టార్ గారు
12. శ్రీ మాష్టరు చూపిన సాయి మార్గం

ప్రతులకు వ్రాయండి :


**శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్టు**

గొలగమూడి, నెల్లూరు జిల్లా - 524 321